
# మహానగరం

నాగమురళీధర్ నామాల

బొమ్మలు : పి. చైతన్య



# మహానగరం

నాగమురళీధర్ నామాల

బొమ్మలు: **పి.చైతన్య**

మంచి పుస్తకం

**మహానగరం**

నాగమురళీధర్ నామాల


బొమ్మలు : పి. చైతన్య

మొదటి ముద్రణ : సెప్టెంబరు, 2016

ప్రతుల సంఖ్య : 1000

వెల : ₹ 100/-

ISBN : 978-93-83936-49-6



© కథ : నాగమురళీధర్ నామాల

© బొమ్మలు : పి. చైతన్య



ప్రచురణ, ప్రతులకు :

**మంచి పుస్తకం**

12-13-439, వీధి నెం. 1

తార్నాక, సికింద్రాబాదు 500 017

ఫోన్ : 94907 46614.

email : info@manchipustakam. in

website : www. manchipustakam. in

**ముద్రణ** : చరిత ఇంప్రెషన్స్

1-9-1126/బి, అజామాబాద్,

హైదరాబాదు, ఫోన్: 27678411.



రచయిత బ్లాగు చిరునామా : https://muralidharnamala.wordpress.com/

ఫేస్ బుక్ పేజీ : https://www.facebook.com/nnmuralidhar

గూగుల్ ప్లస్ : https://plus.google.com/113069614515937193289

# మహానగరం

పండువెన్నెల తెల్లగా పరుచుకుని అడవంతా వెండి పొదలా కనిపిస్తోంది. అంత అర్ధరాత్రి ఆ అడవిలో ప్రాణమంటే తీపి ఉన్న ఏ జీవీ ప్రయాణం చేయాలని కోరుకోదు. అడవంతా గుబురుపొదలు, బ్రహ్మరాక్షసి జుత్తులా వ్యాపించిన పెద్ద పెద్ద వృక్షాలు, పాముల్లా వేలాడే మర్రి ఊడలు. చీకట్లో చిక్కని స్వరంతో చెవులు చిల్లులు పడేలా అరుస్తున్న కీచురాళ్ళు. ఏ పుట్టని చూసినా, ఏ చెట్టుని చూసినా భూతమో, దెయ్యమో అన్నట్టు ఉన్నాయి. దిక్కులన్నింటినీ కమ్మేసినట్టుగా వ్యాపించిన ఆ భూతాల అడవిలో ఇరుకుగా ఉన్నదారి వెంట దృఢమైన అడుగులు వేస్తూ సాగిపోతున్నాడు యశోధరుడు.

యశోధరుడి అడుగుల చప్పుడు విని దూరంగా పొదల్లో ఉన్న పదడుగుల మహాసర్పం తల ఎత్తి బుసలుకొట్టింది. ఆ శబ్దం గుండెలు వణికించేలా ఉంది. ఏ సామాన్య మానవులో వింటే ఆ శబ్దానికే గుండె ఆగి చచ్చేవాళ్ళు. యశోధరుడు ఇవేమి పట్టనట్టుగా ముందుకు సాగిపోతున్నాడు. అత్యంత ప్రమాదకరమైన గచ్చపొదలు, మొగలిపొదలు అతనికి ఎదురవుతున్నాయి. అడుగువేస్తే అదునుకోసమే వేచి ఉన్న నాగులు కాటు వెయ్యటానికి సిద్ధంగా ఉన్నాయి. తన చేతిలో ఉన్న కర్రతో నాగుల్ని నెట్టి పడేసి ఏ మాత్రం జంకులేకుండా ముందుకి సాగిపోతున్నాడు. పొదల్లో దాక్కున్న నక్కలు అతని మీదకి దూకేవే కానీ అతని దృఢమైన దేహాన్ని చూస్తే సింహానికి సహితం బెదురుపుట్టక మానదు. యశోధరుడు

ఆజానుబాహుడు. విశాలమైన ఛాతీతో, బలంగా మెలితిరిగిన భుజాలతో శత్రుభయంకరమైన రూపం అతనిది. మేలిమి బంగారు ఛాయతో, ఒత్తుగా పెరిగిన వంకీల జుత్తుతో క్షణమాత్రంలో ఆకర్షించే స్ఫురద్రూపి.

అలా నడుస్తూ వెళుతున్న యశోధరుడికి ఎదురుగా ఒక మంటపం కనిపించింది. బాటసారులు విశ్రాంతి తీసుకోవటానికి నిర్మించినదిగా అతనికి తోచింది. అక్కడ ఆగి అడవి ఆవలి అంచు కనిపిస్తుందేమో అని చూశాడు. అనంతంగా విస్తరించి ఉన్న ఆ అడవి అంచు అతనికి కనుచూపుమేరలో కనిపించలేదు. రాత్రి ఎంత నడిచినా అడవి దాటటం సాధ్యం కాదని అతనికి అర్థమయ్యింది. ఆ మంటపంలో రాత్రికి విశ్రాంతి తీసుకుందామని అనుకున్నాడు. పడుకునేందుకు వీలుగా మంటపాన్ని శుభ్రం చేసుకున్నాడు. తనతో తెచ్చిన మూటలో ఉన్న గొంగళిని పరిచి మూటని దిండుగా పెట్టుకున్నాడు. రోజంతా నడుస్తూ ఉండటం వల్ల బడలికగా అనిపించింది. నడుంవాల్చి నిద్రకి ఉపక్రమించాడు. ఆకలితో ఉండటం వల్ల ఎంత ప్రయత్నించినా అతనికి నిద్రపట్టడంలేదు. తన మూట విప్పి చూస్తే అమ్మ కట్టిన మినపరొట్టె కనిపించింది. ఆకలిగా ఉండటం వల్ల, అమ్మ ప్రేమగా పెట్టడం వల్ల రొట్టెముక్క చాలా రుచిగా అనిపించి అతని ఆకలిని తీర్చింది. తిరిగి నడుము వాల్చి కళ్ళు మూసుకున్నాడు. అడ్డుగా ఉన్న ఆకలి తొలగిపోవటంతో నిద్ర అతన్ని ఆవహించింది. క్షణాల్లో గాఢనిద్రలోకి జారుకున్నాడు.

* * *

కాసేపటికి భరించలేని దుర్గంధం ఆ ప్రాంతమంతా వ్యాపించింది. ఆ దుర్గంధం భరించలేక యశోధరుడికి మెలకువ వచ్చింది. ఎదురుగా మద్ది వృక్షాల్లా పొడుగ్గా, నల్లగా ఇద్దరు బ్రహ్మరాక్షసులు కనిపించారు. వాళ్ళిద్దరూ ఏదో విషయంలో ఘర్షణ పడుతున్నారు.

“ఒరేయ్ పెద్దోడా! రోజూ తల మాంసం నువ్వే తింటున్నావ్. ఈ మనిషి తల మాంసం నాకే కావాలి.”

“రేయ్ చిన్నోడా! మన ఒప్పందం ప్రకారం పగలు దొరికిన మనిషి తల నీది. రాత్రయితే నాది.”




"ఆ ఒప్పందం ఇక చెల్లదు. రోజూ వేట రాత్రే దొరుకుతుంది."

ఇలా ఇద్దరూ పెద్దగా అరుస్తూ ఘర్షణ పడుతున్నారు. యశోధరుడు లేచి నిలబడ్డాడు. యశోధరుడు లేవటం బ్రహ్మరాక్షసులిద్దరూ చూశారు.

"ఒరేయ్ మనిషి! చచ్చేవాడివి సుఖంగా నిద్రలో చావక ఎందుకురా లేచావ్?" అన్నాడు పెద్ద రాక్షసుడు.

"నేను చావాల్సి వస్తే ఇద్దరిలో ఒకడిని చంపి కానీ చావనురా," అని ధైర్యంగా అన్నాడు యశోధరుడు.

"ఒరేయ్, మా కాళ్ళంత లేవు నువ్వు. చేతిలో ఆయుధం లేదు. ఎలారా మమ్మల్ని చంపుతావ్?" గట్టిగా నవ్వుతూ హేళనచేశాడు చిన్న రాక్షసుడు.

"ఇదిగో, నా హస్త రేఖలు చూడు. ఒక బ్రహ్మరాక్షసిని చంపి కానీ చావనని నా జాతకంలో ఉంది. ఆ పని మీదే వెళుతున్నాను. నేను బయలుదేరిన పని

ఇక్కడితోనే ముగిసేలా ఉంది," అన్నాడు యశోధరుడు.

ఇద్దరు రాక్షసులు కోపంగా యశోధరుడికి దగ్గరగా వచ్చారు. యశోధరుడు అలానే భయపడకుండా నిలబడి ఉన్నాడు. అన్ని విద్యలూ ఎరిగిన చిన్న రాక్షసుడు యశోధరుడి చేతిని బలంగా తన వైపు లాక్కుని చూశాడు. వాడి ముఖం ఒక్కసారిగా వివర్ణమయ్యింది. బేలగా మారిన చిన్నోడి ముఖాన్ని చూసి పెద్ద రాక్షసుడికి ఆందోళన మొదలయ్యింది. చిన్న రాక్షసుడు పెద్దోడిని లాక్కుని పక్కకి వెళ్ళాడు.

"ఒరేయ్ పెద్దోడా! ఈ మనిషి చేతిగీతలు చూస్తే వాడు చెప్పేది నిజమే అనిపిస్తోందిరా. వదిలేద్దామా?" అని గుసగుసగా అడిగాడు చిన్న రాక్షసుడు.

"గుద్దుకి చచ్చేలా ఉన్నాడు. వీడు మనల్ని చంపటమా? మతిపోయిందా నీకు, మూర్ఖుడా," అని కోపంతో బిగ్గరగా అరిచాడు పెద్ద రాక్షసుడు.

"పెద్దోడా! బొజ్జ పెంచావే కానీ బుద్ధి పెంచలేదు నువ్వు. విషకీటకం చిన్నదయినా దాని కాటు చాలు చావటానికి. వీడి గీతలు చూస్తే వీడికి మహా యోగాలు ఎన్నో ఉన్నట్టు కనిపిస్తోంది. కావాలంటే వీడి బుద్ధిని పరీక్షిద్దాం పద," అని సర్దిచెప్పాడు చిన్న రాక్షసుడు.

యశోధరుడి దగ్గరకి ఇద్దరూ వచ్చారు. పారిపోయే అవకాశం ఉన్నా అలా చేయక ధైర్యంగా నిలబడ్డ అతని విశ్వాసాన్ని చూసి పెద్ద రాక్షసుడికి ఆశ్చర్యం కలిగింది.

"ఒరేయ్ మనిషి, నీకు రెండు ప్రశ్నలు వేస్తాం. వాటికి నువ్వు సరైన సమాధానాలు చెబితే మేమే నీకు సహాయం చేస్తాం. లేదా నువ్వు మాకు ఆహారం కావాలి. సరేనా?" అని యశోధరుడిని అడిగాడు చిన్న రాక్షసుడు.

"సరే, పందానికి నేను సిద్ధం," కంచులా ధ్వనించింది యశోధరుడి కంఠం.

"అన్నం, క్షీరం, ధనం – ఈ మూడింటిలో ఉన్నతమైనది ఏది?" అని అడిగాడు చిన్న రాక్షసుడు.

"ఆకలిగొన్నవాడికి పెట్టే అన్నం, శివలింగాన్ని అభిషేకించేటప్పుడు క్షీరం, సత్పురుషునికి ఇచ్చేటప్పుడు ధనం ఉన్నతమైనవి. లోకంలో వస్తువుల విలువ సమయాసమయాలతో మారుతుంది," స్థిరంగా చెప్పాడు యశోధరుడు.

"పోరాడి ఓడటం, పోరాడి చావటం, పోరాడి గెలవటం ఈ మూడింటిలో

ధీరునికి ఒప్పునది ఏది?" రెండవ ప్రశ్నగా అడిగాడు పెద్ద రాక్షసుడు.

"ధీరునకి అన్ని వేళలా ఒప్పునది పోరాటమే. పోరాటం మాత్రమే ధీరలక్షణం. గెలుపు, ఓటములు దైవాధీనం," అని పలికాడు యశోధరుడు గంభీరంగా.

ఇద్దరు రాక్షసులు ఒకరి వంక ఒకరు చూసుకున్నారు. యశోధరుడికి దగ్గరగా వచ్చారు,

"భళా! నువ్వు బుద్ధిశాలివి, ధీరుడివిరా," ఇద్దరూ ఒక్క స్వరంగా పలికి అభినందించారు.

"ఇంతటి బుద్ధి కలిగిన ప్రశ్నలు రాక్షసులకు సాధ్యమా? నమ్మలేకున్నాను. మీరు ఎవరు మహాత్ములారా? ఎందుకు ఈ రూపంలో సంచరిస్తున్నారు? మీ వృత్తాంతం ఏమిటి?" అని నెమ్మదిగా ప్రశ్నించాడు యశోధరుడు.

"మేము మయూరుడు, మంజీరుడు అనే యక్షులం. శ్రీశిఖరపుర మహానగర వైభవం విని అది చూడాలని ఈ లోకానికి వచ్చాం. శ్రీశిఖర మహారాజు చిత్రసేనుడు మాకు అత్యంత వైభవమైన ఆతిథ్యం ఇచ్చాడు. విశ్రాంతి మందిరంలో రుచికరమైన విందుని ఆరగించి, మదిరను సేవించి పురవీధులలో తిరుగుతున్న మాకు అతిలోక సౌందర్యవంతులైన యువతులు కనిపించారు. అదేమి నగరమో, అదేమి మాయో తెలియదు కానీ ఆ నగరంలో అందంగాలేని ఒక్క స్త్రీ కూడా కనపడలేదు. మదిర మత్తు తలకెక్కి వివేకాన్ని కోల్పోయిన మేము ఒక యువతిని నిర్బంధించి, మా విశ్రాంతి మందిరానికి తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నించాం. ఆ స్త్రీ ఒక్క ఉదుటన మమ్మల్ని విదిలించుకొని తీవ్రమైన కోపంతో, అరుణారుణమైన కళ్ళతో తీక్షణంగా చూసి "రాక్షసులారా," అని పలికింది. అంతే మరుక్షణం మా రూపాలు మారి పోయాయి. ఆ నగరానికున్న వర ప్రభావంతో శాపగ్రస్థులు, రాజానుమతిలేని వారు ఆ నగరంలో ఉండలేరు. ఎవరో విసిరివేసినట్టుగా వచ్చి ఈ అడవిలో పడ్డాం. అప్పటి నుండీ ఈ అడవిలో సంచరిస్తూ, మనుషుల్ని చంపి తింటూ దుర్భరమైన జీవనం సాగిస్తున్నాం. ఇదీ మా వృత్తాంతం," అని పలికారు రాక్షసులు.

"యక్షులారా, మరి మీ శాపవిమోచనానికి మార్గం లేదా?" అని అడిగాడు యశోధరుడు.

"శ్రీశిఖరపుర రాజవంశంలో పుట్టిన రాకుమారి క్షమించి మాపై మంత్రజలాన్ని చల్లితే మా పూర్వరూపాలు మాకు సిద్ధిస్తాయి. కానీ ఎవరు ఆమెకు మా విచారాన్ని తెలియబరచి ఒప్పిస్తారు?" అని విషాదంగా పలికాడు చిన్న రాక్షసుడు.

"నేను ఆ శ్రీశిఖరపురానికే వెళుతున్నాను. దానినే మహానగరం అని పిలుస్తుంటారు. నేను మీ విచారాన్ని రాకుమారికి తెలియజేసి మీ చింత తీరుస్తాను," అని పలికాడు యశోధరుడు.

"శ్రీశిఖరపురానికి నువ్వు వెళుతున్నావా?" ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి చూస్తూ ఉండిపోయారు ఇద్దరు రాక్షసులు.

* * *

రాక్షసుల మొహాల్లో కలిగిన ఆందోళనను చూసి యశోధరుడు ఆశ్చర్యపోయాడు. రాక్షసులే భయపడేలా ఆ నగరంలో ఏముంది అని మనసులోనే అనుకుని ఒకసారి ఆ నగరాన్ని సందర్శించిన వీరే నాకు సరైన మార్గదర్శకులు అనుకున్నాడు. మంచిగా కనిపిస్తున్న ఈ తరుణంలోనే వీరి నుండి వివరాలు రాబట్టాలి అనుకున్నాడు.

"యక్షులారా, ఎందుకు మీ వదనాల్లో ఆందోళనకనిపిస్తోంది? ఆ మహానగరం అంటే భయపడుతున్నారా ఏమిటి? నేను ఆ నగరానికే బయలు దేరాను. నాకు ఆ నగరానికి చేరుకునే దారిని వివరించగలరా?" అని వినయంగా అడిగాడు.

రాక్షసులిద్దరూ మండపంలో కూర్చుని యశోధరుడిని కూడా వచ్చి కూర్చోమని చెప్పారు.

"ఓ మనిషి, నువ్వెవరు? ఎందుకా మహానగరం వెళ్ళాలనుకుంటున్నావు? నీ వివరాలు చెప్పు," అని అడిగారు.

"యక్షులారా, తప్పక చెబుతాను. నా పేరు యశోధరుడు. ఈ అడవికి మూడు క్రోసుల దూరంలో ఉన్న భైరవగూడెం మా ఊరు. గూడెం పెద్ద నక్కలదొర మా తండ్రి. మా గూడాన్ని ఆనుకుని బిల్వకముని ఆశ్రమం ఉంది. బిల్వక మునీంద్రులు నాకు సకల విద్యలు నేర్పారు. గురుదక్షిణ సమర్పించుకునే

అవకాశాన్ని కలిగించమని ప్రార్థించగా, ఆయన శీఘ్రమే మహానగరానికి వెళ్ళి మహారాజుని వెంటబెట్టుకుని రమ్మన్నారు. అందుకే నేను మహానగరానికి వెళుతున్నాను," అని చెప్పాడు యశోధరుడు.

"మునీంద్రులకు మహారాజుతో ఏమి పని?" యశోధరుడిని అడిగారు రాక్షసులు.

"గురువుగారి ఆశ్రమంలో అతి ప్రాచీనమైన మహాశివలింగం ఉంది. అది రత్నరాసులకు ధీటుగా, అమావాస్య చీకటిలో సహితం పున్నమి కాంతులకు సమానంగా ప్రకాశిస్తుంది. ఆ మహాలింగానికి ప్రతి ఇరవయ్యేళ్ళకి ఒకసారి ఉత్సవం నిర్వహిస్తారు. ఆ ఉత్సవంలో ఆ మహాలింగానికి ఆరు రోజులపాటు వివిధ అభిషేకాలు జరిపిస్తారు. ఆ ఉత్సవం మహానగర రాజవంశీకుల చేతుల మీదుగా జరపటం ఆనవాయితీగా వస్తోందంట. ఈ ఏడాది జరగవలసిన ఉత్సవానికి మహారాజు నుండి ఏ వర్తమానం అందలేదు. అందుకే గురువుగారు ఈ కార్యంపై నన్ను పంపించారు," అని మొత్తం వృత్తాంతాన్ని వివరించాడు యశోధరుడు.

"మరి మీ గురువుగారు ఆ మహానగరానికి వెళ్ళే దారి, ఆ మహానగర విశేషాలు వివరించలేదా?" అడిగారు రాక్షసులు.

"నా కార్యదక్షతకు, సమర్థతకు ఇదే పరీక్ష అని చెప్పారు. తూర్పు దిక్కుగా ప్రయాణించమని, వివరాలు వాటంతట అవే తెలుస్తాయని అన్నారు," అని రాక్షసులతో చెప్పాడు యశోధరుడు.

"మీ గురువులు త్రికాలజ్ఞులని తెలుస్తూనే ఉంది. నీకు ఆ మహానగర విశేషాలు మేం చెబుతాం," అని రాక్షసులు వివరాలు చెప్పటం మొదలుపెట్టారు.

"ఓ యశోధరా, విను. ఒక వేయి సంవత్సరాల పూర్వం జరిగిన కథ ఇది. ఇక్కడ నుండి అయిదు యోజనాల దూరంలో గజముఖపర్వతం ఉంది. ఆ పర్వతం పైనున్న గుహలో ఒకనాడు పరమశివుడు ధ్యానంలో ఉన్నాడు. ఆ పర్వత సానువుల్లో ఉండే గోపాలురు అనుదినం ఆవులను తోలుకొని పర్వతంపైకి వచ్చేవారు. అలా వచ్చిన ఒక గోపాల బాలుడు తప్పిపోయిన తన లేగదూడను వెతుకుతూ ఆ గుహలోకి ప్రవేశించాడు. మేరు పర్వతంలాగా ఘనమైన రూపంతో, మహాసర్పాలను మెడలో ధరించి, జడలతో ఉన్న శివుని రూపాన్ని చూడగానే ఆ




బాలకుడు భయంతో అరుస్తూ పరుగందుకొన్నాడు.

ధ్యానం భగ్నమైన పరమశివుడు రౌద్ర నేత్రాలు తెరచి చూడగా, ఆ బాలకుడు అక్కడే బూడిద కుప్పలా మారిపోయాడు. జరిగినదంతా గ్రహించి స్వామి వాత్సల్యంతో ఆ బూడిద కుప్పను స్పృశించాడు. స్వామి కరుణ ఆ బూడిదకి ప్రాణం పోసింది. మునుపటికంటే సౌందర్యమైన, దృఢమైన రూపంతో ఒక బాలుడు ఆవిర్భవించాడు. వాత్సల్యంతో ఏం కావాలో కోరుకోమని బాలుడిని అడిగాడు స్వామి.

"నీ రూపాన్ని దర్శించిన నాకు వేరే కోరికలు ఏముంటాయి స్వామీ," అని పలికాడు బాలుడు. వరమివ్వాలనుకున్న శివుడు తక్షణమే విశ్వకర్మను రప్పించాడు. స్వామి ఆదేశంతో విశ్వకర్మ ఆ గజముఖ పర్వతంపై ఒక మహానగరాన్ని నిర్మించాడు. సప్త సముద్రాల నీటిని విశ్వకర్మ తన దోసిలితో తెచ్చి ఆ పర్వతం

చుట్టూ జలకందకాన్ని నిర్మించాడు. అనేక అగడ్తలతో, కందకాలతో శత్రు దుర్భేద్యంగా నిర్మించిన ఆ నగరమే శ్రీశిఖరపురం. పరమశివుడు బాలకుడిని ఆ మహానగరానికి రాజుగా చేశాడు. ఆ బాలకుడే శివదత్తుడు. శివదత్తునికి ఒక ఆత్మలింగాన్ని ఇచ్చి ఆ ఆత్మలింగం అతని ఇంట ఉన్నంత కాలం అతని వంశానికి గానీ, ఆ నగరానికి గానీ ఎటువంటి ఆపద కలగదని వరమిచ్చి స్వామి అంతర్ధానమయ్యాడు.

శివుని ఆజ్ఞతో దేవలోకం నుండి కొందరు శివదత్తుని పరివారంగా మహానగరానికి వచ్చారు. అందుకే ఆ మహానగరంలో దివ్యలోకవాసులకే కానీ సామాన్యులకు ప్రవేశం లేదు. పరిజనుల ద్వారా ముల్లోకాలలో సౌందర్యవతి అయిన హరిణిలోచన అనే దేవకాంత అందచందాలను విని శివదత్తుడు ఆమెను మోహించాడు. తన పరివారాన్ని రాయబారులుగా పంపి ఆమె అంగీకారాన్ని పొందాడు. ఆమెను వివాహం చేసుకొని పట్టమహిషిగా చేశాడు. నాటి నుండి నేటి వరకు శివదత్తుని వంశాంకురాలే ఆ మహానగరాన్ని పరిపాలిస్తున్నారు," అని ఆ మహానగర వృత్తాంతం అంతా వివరించారు రాక్షసులు.

అంతా విని మౌనంగా ఉన్న యశోధరుడితో తిరిగి చిన్న రాక్షసుడు "ఆ నగరానికి సామన్య మానవుడవైన నువ్వు ఎట్లా వెళతావు?" అని ప్రశ్నించాడు.

మౌనంగా ఉన్న యశోధరుడు చిన్న రాక్షసుడి ప్రశ్నకు స్పందిస్తూ "అన్నీ తెలిసిన మా గురువులు నన్ను పంపించటానికి కారణం లేకపోదు. ఏదో మార్గం ఉండే ఉంటుంది. నేనిప్పుడు ఆలోచించవలసింది వెళ్ళాలా, లేదా అని కాదు. ఎలా వెళ్ళాలని మాత్రమే," అని పలికాడు.

ఇద్దరు రాక్షసులు యశోధరుడి ఆత్మస్థైర్యాన్ని అభినందించారు.

"మనిషి! ఇప్పుడు మహానగర రాజెవరో? వారసులున్నారో, లేరో? తెలియకుండా మనం ఏ ఉపాయాన్ని ఆలోచించినా అది వ్యర్థం అవుతుంది. ఈ అడవిలో ఒక మంత్రాల మర్రి ఉంది. ఆ మంత్రాల మర్రి మాత్రమే ఇప్పుడు నీకు సహాయం చెయ్యగలదు," అని చెప్పారు రాక్షసులు.

"యక్షులారా! నన్ను ఆ మర్రిచెట్టు వద్దకి త్వరగా తీసుకుని వెళ్ళండి," అని యశోధరుడు తన ఆతృతని ప్రదర్శించాడు.

రాక్షసులు కూడా యశోధరుడి ఆతృతని గుర్తించి లేచి నడవటం మొదలు

పెట్టారు. మార్గంలో అనేక మృగాలు, విషసర్పాలు ఎదురుపడుతున్నాయి. రాక్షసులు వాటిని తమ చేతులతో దూరంగా విసిరేస్తూ యశోధరుడిని క్షేమంగా తీసుకుని వెళుతున్నారు. యశోధరుడికి కూడా వాళ్ళు చూపిస్తున్న ఆదరణకు వాళ్ళ మీద అభిమానం కలుగుతోంది. రూపం భయంకరంగా ఉన్న వీరిలో ఎంత గొప్ప మనసున్నదో కదా అనుకున్నాడు. అలా కొంతదూరం దట్టమైన అడవిలోకి నడిచాక ఆ మర్రిచెట్టుని చేరుకున్నారు. ఆ మర్రిచెట్టు శాఖోపశాఖలుగా విస్తరించి నేలను తాకుతున్న ఊడలతో అతి భయంకరంగా కనిపిస్తోంది. ముగ్గురూ మర్రిచెట్టు మొదలు దగ్గరికి చేరుకున్నారు.

* * *

యశోధరుడికి చెట్టుని చూపిస్తూ "మనిషి! ఇదే మంత్రాల మర్రి. ఏన్నో వేల సంవత్సరాలుగా ఈ అడవిలో ఉంది. ఈ చెట్టుకి తెలియని విషయాలు, రహస్యాలు లేవు. ముందుగా ఈ చెట్టుని ప్రసన్నం చేసుకోవాలి. అందుకు రెండు మార్గాలున్నాయి. మొదటిది క్షుద్ర మార్గం. అంటే నీ కుడిచేతి బొటనవేలు నుండి పది చుక్కల రక్తాన్ని తర్పణగా ఇవ్వాలి. రెండోది సాధుమార్గం, నీ ఇష్ట దైవాన్ని తలుచుకుని నీకు అత్యంత ప్రీతిపాత్రమైన వస్తువుని మర్రికి సమర్పించాలి. నువ్వు ఏ మార్గాన్ని ఎన్నుకున్నా సరే నీ ఇష్టం," అని చెప్పాడు చిన్న రాక్షసుడు.

"నేను దైవకార్యం కోసం చేస్తున్న ఈ ప్రయత్నంలో క్షుద్రమార్గం ఏదయినా అనుచితమే. నేను సాధు మార్గాన్నే ఎన్నుకుంటున్నాను," అని పలికి యశోధరుడు తన చేతికున్న బంగారు ఉంగరాన్ని తీశాడు. నవరత్నాలతో అమూల్యమైనదిగా కనబడుతున్న ఆ ఉంగరాన్ని రాక్షసులకు చూపి "గురువుగారు ఇచ్చిన ఈ ఉంగరం నాకు అత్యంత ప్రీతికరమయినప్పటికీ గురు కార్యార్థం దీనిని మర్రిచెట్టుకి ఇవ్వటానికి నేను సిద్ధంగా ఉన్నాను," అని పలికాడు.

"నీ సదాచారం, మీ గురువుల ఆశీస్సులే నీకు రక్ష. నీ ఇష్ట దైవాన్ని తలుచుకుని ఆ ఉంగరాన్ని కనిపిస్తున్న తొర్రలో వెయ్యి," అని చెప్పారు రాక్షసులు.

పరమేశ్వరుడిని మనసులో తలుచుకుని యశోధరుడు తన ఉంగరాన్ని ఆ తొర్రలో వేశాడు.

వెంటనే పెద్ద ఉరుములతో, పిడుగుల పడిన శబ్దంతో మర్రి చెట్టులో

చలనం మొదలయ్యింది. పెద్ద గాలి వచ్చినట్లుగా ఊడలు ఊగటం మొదలయ్యింది. కొమ్మలు విరిగిపడుతున్నాయేమో అన్నట్లు పెళపెళ శబ్దాలు చేశాయి. ఇద్దరు రాక్షసులు మఱ్రిచెట్టు ముందు మోకరిల్లి, యశోధరుడిని కూడా అలానే చెయ్యమన్నారు. యశోధరుడు కూడా వారి సరసన మోకరిల్లాడు. కాసేపటికి శబ్దాలు ఆగి మామూలయ్యింది.

చిన్న రాక్షసుడు మఱ్రిచెట్టుకి మొక్కుతూ "అన్నీ ఎరిగిన మంత్రాల మఱ్రి, ఈ మనిషి నీ ముందు మోకరిల్లాడు. శరణం అంటున్నాడు," అని గట్టిగా అరిచాడు.

"నా గొప్పతనం ఎరిగిన మీకు శుభమగుగాక. ఏం సహాయం కావాలో చెప్పండి," అన్న మాటలు మఱ్రిమాను నుండి వినిపించాయి. యశోధరుడు ఆశ్చర్యంగా ఆలా చూస్తూనే ఉన్నాడు. చిన్న రాక్షసుడు చెప్పమని సైగచేశాడు. రాక్షసులకు చెప్పినట్టే తన వృత్తాంతాన్ని మఱ్రిమానుకు చెప్పాడు యశోధరుడు.

ఆ తరువాత "మంత్రాల మఱ్రి, నేను మహానగరం చేరుకోగలనా? నాకు మహానగరంలో ప్రవేశించే అవకాశం ఉందా?" అంటూ తనకు సహాయం చెయ్యమని ప్రాధేయపడ్డాడు.

"నాయనా, యశోధరా! నీది ఉత్తమమైన జన్మ. నీ జన్మకి పరమార్థం నువ్విప్పుడు చేస్తున్న ప్రయాణమే. నీకు మహానగరంలో ప్రవేశించే అర్హత ఉంది. కానీ ప్రస్తుత సమయంలో అది అంత సులభతరం కాదు," అని ప్రసన్నమైన గొంతుతో మఱ్రిచెట్టు పలికింది.

"గురుకార్యార్థినై వెళుతున్న నాకు కష్టతరమైనా వేరే మార్గం లేదు. నాకు ఉపాయాన్ని ఉపదేశించమని నిన్ను ప్రార్థిస్తున్నాను," అని యశోధరుడు ప్రార్థించాడు. "నీ గురుభక్తి, వినయం ముచ్చట కలిగిస్తున్నాయి. మహానగరంలో ఇప్పుడు చోటు చేసుకున్న పరిణామాలను వివరిస్తాను, విను," అని పలికింది మఱ్రి.

రాక్షసులిద్దరూ చలనం లేకుండా ఆ సంభాషణను వింటున్నారు.

మహానగరం విషయాలను వివరించటం మొదలుపెట్టింది మంత్రాల మఱ్రి.

"యశోధరా! మహానగరాన్ని ఇప్పుడు పరిపాలిస్తున్న మహారాజు ఫణిభూషణుడు. శివదత్తుని వంశంలో పుట్టిన పన్నెండో తరం వారసుడు. ఆ

వంశానికి సహజంగానే ఉన్న వరాలతో, శివుని అనుగ్రహంతో అత్యంత సౌందర్యవంతుడిగా జన్మించాడు. సకల విద్యలను అభ్యసించి శక్తి, యుక్తులను పెంచుకున్నాడు. ఒకనాడు అతడు శివుని అభిషేకం కోసం మానససరోవర జలాన్ని తీసుకురాటానికి హిమాలయాలకు వెళ్ళాడు. అక్కడి సుందర ఉద్యానవనంలో ఒక దేవకాంత పూల మొక్కలతో, జింకలతో ముచ్చటలాడటం చూసి, పరవశించి తానొచ్చిన కార్యం మరిచి నిలిచిపోయాడు. అంతలో ఫణిభూషణుడి ఎదుటకు ఒక పరాక్రమవంతుడైన గంధర్వుడు వచ్చి "ఓరీ ఉన్మాది! పరాయికాంతను పారవశ్యంతో చూడటం యుక్తం కాదని తెలియదా. నీకు తగిన శాస్తి చేస్తాను," అని మీదకి వచ్చాడు.

ఫణిభూషణుడు వినయంగా అతనికి నమస్కరించి "మహానుభావా! తామెవరో మహా పురుషులలాగా కనపడుతున్నారు. ఆగ్రహించకండి. నేను మహానగర పట్టణానికి భావి రాజును. తండ్రిగారి ఆదేశంతో మానససరోవర జలాన్ని తీసుకుని వెళ్ళటానికి వచ్చాను. అత్యంత సౌందర్యవతి అయిన ఈమె నా మనసుని ఆకర్షించగా, ఇక్కడే నిలిచిపోయాను. ఆమె అంగీకరిస్తే వివాహం చేసుకోవాలని ఆశిస్తున్నాను," అని చెప్పాడు.

"ఆమె అంగీకారం కాదు, నా అంగీకారం తీసుకోవాలి. ఆమె నా కుమార్తె మృదుభాషిణి. మానవుడవైన నువ్వు దేవకాంతతో వివాహాన్ని ఎలా కాంక్షిస్తున్నావు?" అని గంధర్వుడు కఠిన స్వరంతో పలికాడు. ఫణిభూషణుడు తమ వంశ ఔన్నత్యం వివరించి, తమ వంశంలో అందరూ దేవకాంతలనే వివాహమాడారని పలికాడు. జరుగుతున్న సంవాదం విని మృదుభాషిణి కూడా అక్కడకు వచ్చి ఫణిభూషణుని చూసింది. సౌందర్యవంతుడు, ఆజానుబాహుడు అయిన అతడిని తొలిచూపులోనే మోహించింది. అయినా తండ్రి ఆగ్రహాన్ని చూసి మౌనంగా నిలుచుని ఉండిపోయింది.

"వంశం, పెద్దల పరాక్రమం కాదు వివాహార్హతను నిర్ణయించేది. నాతో పోరి గెలిస్తే నా కుమార్తెను నీకిచ్చి వివాహం జరిపిస్తాను. సిద్ధమా?" అని సవాలుచేశాడు గంధర్వుడు.

"క్షమించండి. ఆమెను వివాహమాడితే నాకు మీరు పితృసమానులు. మీపైన ఆయుధం ప్రయోగించటం నాకు సమ్మతం కాదు. మరేదైనా పరీక్ష పెట్టండి,"



అని అడిగాడు ఫణిభూషణుడు.

"సరే. కనబడుతున్న ఆ మహావృక్షాన్ని చూడు. ఆ చెట్టు చిటారుకొమ్మన ఉన్న పుష్పాన్ని మన ఇద్దరిలో ఎవరు ఛేదించగలిగితే వారు గెలిచినట్టు," అని చెప్పాడు గంధర్వుడు.

ఆ తోటలో ఉన్న మిగిలిన గంధర్వులు కూడా అక్కడకి వచ్చి పోటీని ఆసక్తిగా చూస్తున్నారు. ఆ మహావృక్షం వంద అడుగులపైన ఎత్తు ఉండి చిటారుకొమ్మ మేఘాలను తాకుతున్నట్టు ఉంది. ఇద్దరూ తమ తమ ధనస్సులను అందుకుని నారి సారించి ఎక్కుపెట్టారు. ఒకరినొకరు చూసుకున్నారు. గంధర్వరాజు శరప్రయోగం చేశాడు. ఫణిభూషణుడు శరాన్ని విడువలేదు. అందరూ ఆశ్చర్యంగా అతడినే చూస్తున్నారు. అతను చిరునవ్వుతో ప్రశాంతంగా ఉన్నాడు. గంధర్వరాజు సహితం నివ్వెరపోయాడు. సరిగ్గా మహావృక్షానికి సగం ఎత్తుకు గంధర్వుని బాణం చేరుకున్నాక శరప్రయోగం చేశాడు ఫణిభూషణుడు.

క్షణకాలంలో మెరిసి మాయమయ్యే విద్యుల్లతలా శరం దూసుకుపోయింది. గంధర్వరాజు విడిచిన శరాన్ని దాటుకుని వెళ్ళి పుష్పాన్ని ఛేదించింది. ఫణిభూషణుడు మరో శరాన్ని సంధించి కిందపడుతున్న పుష్పాన్ని మృదుభాషిణి చేతిలో పడేలా చేశాడు.

గంధర్వరాజు మిక్కిలి ఆనందంతో ఫణిభూషణుడిని అభినందించి, మృదుభాషిణి చేతిని అతడికి అందించాడు. దేవతలంతా వారిపై పుష్పాలను కురిపించారు. అక్కడే ఉన్న గంధర్వరాజు పెద్ద కుమార్తె శ్రీభాషిణి తండ్రితో తాను కూడా ఫణిభూషణుడిని వివాహమాడాలనుకుంటున్నానని పలికింది. గంధర్వరాజు క్షణకాలం ఆశ్చర్యానికి లోనై ఫణిభూషణుని వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ఫణిభూషణుడు "మృదుభాషిణిని తప్ప ఈ జన్మకు అన్యకాంతను గ్రహించలేను," అని సున్నితంగా తిరస్కరించి, కలశంలో సరోవర ఉదకం నింపుకుని మహానగరానికి వచ్చేశాడు.

తిరస్కరణావమానంతో రగిలిపోయిన శ్రీభాషిణి కుటిలబుద్ధితో తన తండ్రిని ఒక్క వరం అడిగింది. బాధలో ఉన్న కూతురితో ఏకాదశి రోజున ఉపవాసదీక్ష చేసి ఏదయినా ఒక వరం కోరుకోమని, అది సిద్ధించేలా తన శక్తిని ఉపయోగిస్తానని గంధర్వరాజు చెప్పాడు. కానీ ఫణిభూషణుడిని వివాహం చేసుకోవాలని కోరుకుంటే జరగదని హెచ్చరించాడు. తండ్రి చెప్పినట్టే ఏకాదశి రోజున పవిత్రంగా ఉపవాసదీక్ష చేసి తండ్రి వద్దకు వచ్చింది శ్రీభాషిణి. మనసులోని కోరిక కోరుకొమ్మని తండ్రి చెప్పాడు. ఫణిభూషణుని వంశం అంతరించాలని ఆమె కోరుకుంది. కూతురి దుష్టబుద్ధిని గ్రహించినా ఇచ్చినమాట కాదనలేక తండ్రి సరే అన్నాడు. ఫణిభూషణునికి, మృదుభాషిణికి కుమార్తె కలిగేలా అనుగ్రహించి శ్రీభాషిణి వరం నెరవేరేలా చూశాడు.

ఫణిభూషణునికి మహాలక్ష్మి కళతో ఒక కూమర్తె పుట్టింది. శివుని అనుగ్రహంతో ప్రతీ తరంలోనూ మగసంతానమే కలిగిన వంశంలో మొట్టమొదటిసారిగా అమ్మాయి పుట్టింది. శ్రీభాషిణికి ఇచ్చిన వరం వల్లనే ఇలా జరిగింది అని ఫణిభూషణునికి గంధర్వరాజు వివరించాడు. ఫణిభూషణుడు నవ్వి "శివుడాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదు, మా ఇంటికి మహాలక్ష్మిని పంపటమే మహాదేవుని నిర్ణయమేమో. అందుకే ఇలా జరిగింది," అని సంతోషించి

నగరమంతా సంబరాలు జరిపించాడు. ఎన్నో తరాలకి పుట్టిన మొదటి ఆడపిల్ల కావటంతో అల్లారుముద్దుగా పెంచారు. ఆమెకు అమృతస్మిత అని నామకరణం చేశారు. మహానగరవాసులకి అమృత అంటే వల్లమాలిన ప్రేమ. రోజూ ఆమెను చూడటానికి వాళ్ళు వచ్చేవారు. ఆమె ఆటపాటలతో, అల్లరితో, ఆలనా పాలనతో రోజంతా సందడిగా సాగిపోయేది.

జరుగుతున్నవి చూసి శ్రీభాషిణి మరింత రగిలిపోయింది. గంధర్వలోకం వదిలి భూలోకం చేరుకుంది. ఏం చెయ్యాలో, ఎలా చెయ్యలో దిక్కుతోచక తిరుగుతూ మహానగరానికి దగ్గరలో ఉన్న ఒక అరణ్యం చేరుకుంది. అక్కడ ఆమెను కపాలధ్వజుడనే మాంత్రికుడు చూశాడు. ఆమెను చూసి వలచి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నాడు. తనని వివాహం చేసుకుంటే ఆమె పగని తీరుస్తానని మాట ఇచ్చాడు. కపాలధ్వజుడి శక్తిని పరీక్షించటానికి ఫణిభూషణుడికి తండ్రి పెట్టిన పరీక్షనే ఆమె పెట్టింది. కపాలధ్వజుడు ఒకే శరంతో వందల పుష్పాలు ఆమెను అభిషేకించేలా చేశాడు. ఆమె అతని శక్తికి అబ్బురపడి అతడిని వరించింది. పెళ్ళినాడు కానుకగా మహానగర నాశనాన్ని కోరింది. ఆ కోరిక నెరవేరుస్తానని కపాలధ్వజుడు ప్రమాణం చేశాడు. తన శిష్యులను మహానగర విశేషాలు తెలుసుకుని రావాల్సిందిగా పంపాడు. వారు తమ మంత్ర, తంత్ర శక్తులన్నీ ఉపయోగించి కూడా మహానగరంలో ప్రవేశించ లేకపోయారు.

అదే రోజు మీ గురువుగారి ఆశ్రమంలో ఉన్న శివలింగానికి అభిషేకం కోసం మహానగరమంతా తరలివచ్చింది. అలా సందడిగా వెళుతున్న నగరవాసుల్లో ప్రవేశించిన కపాలధ్వజుని శిష్యులు కొందరిని మచ్చికచేసుకుని, తాము సమీప గ్రామస్థులమని చెప్పి మహానగర విశేషాలను తెలుసుకున్నారు. శివలింగానికి అభిషేకం చేసేటప్పుడు అక్కడ పూజలో ఉంచిన ఆత్మలింగాన్ని చూశారు. దాని శక్తి తెలుసు కున్నారు. తిరిగి కపాలధ్వజుని దగ్గరకు వెళ్ళి తాము తెలుసుకున్న వివరాలన్నీ చెప్పారు. ఆ ఆత్మలింగాన్ని సంగ్రహించగలిగితే మహానగరం తమ వశమవుతుందని చెప్పారు. శిష్యులను మహానగర సమీపంలో పొంచి ఉండి అనుకూలమైన సమయంలో తనకి వర్తమానం పంపవలసిందని చెప్పాడు కపాలధ్వజుడు. శిష్యులిద్దరూ మహానగర ఆనుపానులను పరికించేందుకు వీలున్న చోట నివాసం ఏర్పరుచుకుని నిరంతరం గమనిస్తూ ఉండేవారు.

* * *

ఒకనాడు అమృత మీ గురువుగారి దర్శనానికని కొంత పరివారంతో బయలుదేరింది. అది గమనించిన కపాలధ్వజుని శిష్యులు వారిని అనుసరించారు. ఆమె తనతో ఆత్మలింగాన్ని తీసుకుని వస్తుందని గ్రహించి తమ గురువుగారికి మంత్రశక్తి ద్వారా తెలియజేశారు. కపాలధ్వజుడు తక్షణమే శ్రీభాషిణిని వెంటబెట్టుకుని అక్కడికి చేరుకున్నాడు. తన మంత్ర విద్యతో పెద్ద గాలి తుఫానుని సృష్టించాడు. దానితో పరివారమంతా భీతి చెంది చెల్లా చెదురవుతుంటే అమృత ఆత్మలింగ శక్తితో దానిని నివారించింది. ఇది కేవలం ప్రకృతి వైపరీత్యమేనని భావించి ముందుకు సాగింది. కపాలధ్వజుడు తన శక్తి విఫలమవ్వటం చూసి నివ్వెరపోయాడు. ఒక బాలిక చేతిలో ఓడిపోవటమా అని క్రోధంతో కార్చిచ్చు రగిలించాడు. అరణ్యమంతా మంటలు వ్యాపించాయి. చుట్టూ పొగ, మంట కమ్మేయటంతో పరివారమంతా ఏం చెయ్యాలో తోచని స్థితిలో భగవంతుని ప్రార్థిస్తూ విలపించారు.

అమృత భక్తితో ఆత్మలింగాన్ని ప్రార్థించింది. మంటలన్నీ మాయమై చల్లనిగాలి అందరి శరీరాలని తాకి ఆహ్లాదపరిచింది. ఇదంతా ఏదో దుష్టశక్తి ప్రభావమని, వెనుతిరిగిపోవటం మంచిదని అందరూ అన్నారు. కానీ ఆత్మలింగం తమచెంత ఉండగా భయపడాల్సింది లేదనీ, ప్రయాణం కొనసాగిద్దామనీ అమృత దృఢంగా చెప్పింది. జీవితంలో మొదటిసారి తన శక్తి చిన్నబోవటాన్ని కపాలధ్వజుడు జీర్ణించు కోలేకపోయాడు. తానే ఆయుధం పట్టుకుని యుద్ధానికి వెళ్ళడానికి సిద్ధపడ్డాడు. శ్రీభాషిణి వారించింది.

"ఇదంతా ఆత్మలింగ మహిమ. ఇప్పుడు శక్తి కాదు యుక్తితో కార్యం సిద్ధింప చేసుకోవాలి," అని పలికి అతడిని అక్కడే ఉండమని శ్రీభాషిణి ముందుకు వెళ్ళింది. అమృత వెళుతున్న మార్గంలో ఒక చిన్న మాయా కుటీరాన్ని సృష్టించింది. కుటీరం బయట నారవస్త్రాలు ధరించి కూర్చుంది. ప్రయాణ బడలికతో అలసిన పరివారం కుటీరాన్ని చూసి మునుల ఆశ్రమంగా తలచి కాసేపు విశ్రమించుదామని అక్కడకి వచ్చారు. వచ్చిన వారందరినీ శ్రీభాషిణి నవ్వుతూ పలకరించి తాగేందుకు చల్లని నీరు, తినేందుకు కొన్ని ఫలాలు ఇచ్చింది.

నార వస్త్రాల్లో ఉన్న శ్రీభాషిణికి అమృత నమస్కరించి "అమ్మా తమరెవరు? ఇక్కడ ఒంటరిగా ఉంటున్నారా? అలసిన మా పరివారానికి మీరు ఎంతో

మేలు చేశారు. నేను బదులుగా మీకు ఏమి చేయగలనో చెప్పండి," అని వినయంగా పలికింది.

"కుమారీ, నీ ముఖవర్చస్సు నువ్వు సాధారణ కాంతవు కావని తెలియజేస్తోంది. నువ్వెవరు? ఈ పరివారంతో ఎక్కడికి వెళుతున్నావు?" ఏమీ తెలియని అమాయకురాలి వలె అడిగింది శ్రీభాషిణి.

"అమ్మా, నా పేరు అమృత. నేను మహానగర పాలకులు ఫణిభూషణుల వారి కుమార్తెను. భైరవకోనలోని బిల్వక మునీంద్రుల దర్శనానికి వెళుతున్నాను," అని చెప్పింది అమృత.

"ఇది కదా సర్వేశ్వరుని లీలావిలాసం. పెదతల్లిని ఎరుగని కుమార్తె, కుమార్తెను ఎరుగని పెదతల్లి. ఎంతటి విపరీతమో కదా ఇది," అని బాధ నటించింది శ్రీభాషిణి.

"అమ్మా తమరు నా పెదతల్లా? నా తెలియనితనాన్ని మన్నించండి. నాకు ఊహ తెలిసిన నాటి నుండి ఆమె మాతాపితురల గురించి మా తల్లి చెప్పగా వినలేదు. అజ్ఞానంతో నేనూ ఏనాడు అడగలేదు. నాపై దయ ఉంచి ఈ వివరాలు నాకు చెప్పండి," అని ప్రాధేయపడింది అమృత.

"సమయం వచ్చినంతనే నీకన్నీ తెలుస్తాయి. ఇప్పటికి మాత్రం నీకు ఒక్క విషయం చెపుతాను. నా పేరు శ్రీభాషిణి. నేనూ, మా సోదరి మృదుభాషిణి నీ తండ్రి ఫణిభూషణుని వరించాం. కానీ నీ తండ్రి మృదుభాషిణిని మాత్రం స్వీకరించి నన్ను తిరస్కరించారు. వలచిన వ్యక్తి దొరకని వ్యథతో ఈ అరణ్యంలో సాధుజీవితం గడుపుతున్నాను. ఇన్నాళ్ళకు నా అనే వారొకరు నీ రూపంలో కనిపించారు. నువ్వు తప్పక ఈ పెదతల్లి దగ్గర ఒక్క దినమయినా గడపాల్సిందే," అని కపట ప్రేమను నటించింది శ్రీభాషిణి.

పెదతల్లి ప్రేమకు ఆనందపడిన అమృత సరేనని అంగీకరించి, పరివారాన్ని విశ్రాంతి తీసుకోమని చెప్పింది.

శ్రీభాషిణి మరింత ప్రేమను నటిస్తూ తనచేతితో అమృతకు గోరుముద్దలు తినిపించింది. ఫణిభూషణుడు, మృదుభాషిణల గురించి క్షేమసమాచారాలు తరచి తరచి అడిగి తెలుసుకుంది. కుమార్తెను ఇలా కలుసుకోవటం తనకి ఎంతో సంబరం కలిగించిందని పదేపదే చెప్పింది. పెదతల్లి చెప్పిన ఊసులన్నీ వింటూ

ఊకొడుతూ అమృత అమాయకంగా ఆమె ఒడిలోనే నిద్రపోయింది. ఆత్మలింగాన్ని తన చేతుల్లోనే పొదవిపట్టుకుని అమృత నిద్రలోకి జారుకుంది.

అమృతకు నిద్రపట్టగానే ఆత్మలింగాన్ని సొంతంచేసుకోటానికి అక్కడికి వచ్చాడు కపాలధ్వజుడు. ఆత్మలింగాన్ని అందుకోవటానికి చెయ్యి చాపగానే అమాంతం సుడిగాలి పట్టి విసిరినట్టుగా దూరంగా ఎగిరిపడ్డాడు కపాలధ్వజుడు. ఎన్నిసార్లు ప్రయత్నించినా అతడు ఆత్మలింగాన్ని తాకలేకపోయాడు. వెంటనే తన మంత్రశక్తితో తన మాయా కపాలాన్ని పిలిచాడు. మాయాకపాలం వచ్చి ఆత్మలింగాన్ని తాకే శక్తి కపాలధ్వజునికి లేదని, శ్రీభాషిణికి మాత్రం ఆ అర్హత ఉందని చెప్పింది. అమృత తనంత తానుగా ఇస్తేనే అది ఆమె చేతికి వస్తుందని చెప్పింది.

ఆ అలికిడికి అమృత లేచింది. అమృత చూడక ముందే కపాలధ్వజుడు అదృశ్యమయ్యాడు. అమృత కనులు తెరిచేసరికి శ్రీభాషిణి నవ్వుతూ ప్రశాంతంగా ఉంది. అయోమయంగా చూసిన అమృతకు అలజడేమీ కనిపించక తాను కలగన్నానేమో అనుకుని మళ్ళీ నిద్రకు ఉపక్రమించింది. అంతలోనే అమృతను లేపి "ఏంటమ్మా, ఇది చేతిలోనే పట్టుకుని పడుకున్నావ్?" అని శ్రీభాషిణి అడిగింది. "ఇది ఆత్మలింగం. మా వంశానికి పరమేశ్వర ప్రసాదం. దీనిని ఎప్పుడూ, ఎక్కడా వదిలిపెట్టకూడదని నాన్నగారి ఆజ్ఞ," అని చెప్పింది అమృత.

"పవిత్రమైన ఆత్మలింగాన్ని అలా నిర్లక్ష్యంగా ఉంచకూడదమ్మా. నా చేతికివ్వు, దేవుని మందిరంలో భద్రపరుస్తాను," అని అడిగింది శ్రీభాషిణి. కపటం తెలియని అమృత శ్రీభాషిణి చేతికి ఆత్మలింగాన్ని ఇచ్చింది.

ఆత్మలింగం శ్రీభాషిణి చేతిలో పడగానే భరించలేని బరువు మీద పడినట్టుగా తూలిపడింది. అదృశ్యరూపంలో అక్కడే ఉండి అంతా గమనిస్తున్న కపాలధ్వజుడు వెంటనే ప్రత్యక్షమయ్యాడు. శ్రీభాషిణికి చేయి అందించి ఆమెను లేపాడు. శ్రీభాషిణి నారవస్త్రాలనుండి తన సహజరూపంలోకి మారింది. కపాలధ్వజునితో కలసి వికటాట్టహాసం చేసింది. "శక్తితో దొరకని దానిని యుక్తితో ఎలా సాధించానో చూశావా," అని పిచ్చి పట్టినదానిలా అరుస్తూ ఆనందంతో గట్టిగా విరగబడి నవ్వింది. "ఇన్నేళ్ళ నా పగ తీరే అవకాశం నేటికి చిక్కింది. అహంకారంతో నన్ను అవమానించిన ఆ నీచుడి వంశనాశనం ఇక తప్పదు," అని బిగ్గరగా అరిచింది.

అయోమయంగా బిత్తరచూపులు చూస్తూ, భయంతో వణుకుతూ నిలబడింది అమృత. ఎంత రాచకన్య అయినా, దైవాంశంతో పుట్టినదే అయినా తల్లిలా ప్రేమగా అప్పటి వరకూ లాలించిన పెదతల్లి ఇలా విలయం సృష్టించటాన్ని అర్థం చేసుకోలేక పోతోంది. పక్కనే భయంకరాకారంలో జడలు కట్టిన జుత్తుతో మంత్రదండంతో కపాలధ్వజుడిని చూసి బిక్కచచ్చిపోయింది. పరివారమంతా లేచి ఇది కలో, నిజమో అర్థంకాక కొయ్యబొమ్మల్లా నిలుచుండిపోయారు. అక్కడున్న ఆశ్రమం మాయమయ్యింది. చుట్టూ చిమ్మ చీకటి, అరణ్యం మధ్యలో ఉన్నామని గుర్తించారు అందరూ.



కాస్త ధైర్యం తెచ్చుకున్న అమృత "అమ్మా, ఏమి జరుగుతోంది? ఈ మాంత్రికుడు ఎవరు? నువ్విలా ప్రవర్తిస్తున్నావేమిటి? భయంతో నీ బిడ్డకు దిక్కుతోచటం లేదు," అని మెల్లగా శ్రీభాషిణిని అడిగింది.

"ఎవరే నీకు తల్లి? నన్ను దారుణంగా అవమానించి తీవ్ర మానసిక క్షోభ కలిగించిన వారికి పుట్టిన నువ్వు నాకు బిడ్డా? నేటితో మీ వైభవమెల్ల చెల్లు. ఈ ఆత్మలింగం అండతో ఇన్నాళ్ళూ అనుభవించిన మీ భోగభాగ్యాలు ఇక చెల్లు. ఈ అవకాశం కోసమే అహోరాత్రులు ఎదురు చూశాను. నేను ఎన్ని రోజులు క్షోభను అనుభవించానో అంతకు పదింతల క్షోభకు మిమ్మల్ని గురిచేస్తాను," అని అరిచింది శ్రీభాషిణి.

జరుగుతున్నది అర్థంకాగానే పరివారం కత్తులు దూసి కపాలధ్వజుని మీదకు వచ్చారు. కపాలధ్వజుడు తన మంత్రదండంతో భూతాల్ని సృష్టించి వదిలాడు. ఆ భూతాలు పరివారం మీద పడ్డాయి. వారి చేతుల్లోని కత్తుల్ని విరిచేశాయి. బల్లాలని, శూలాలని నులిపి ఉండచుట్టి పడేశాయి. విల్లంబులు ఎక్కుపెట్టి శరవర్షం కురిపించారు పరిజనం. ఈగలదండుని విసిరి కొట్టినట్టు ఒక్క చేత్తో విసిరి కొట్టాయి భూతాలు. ఏం చెయ్యాలో పాలుపోక అంతా నిలబడిపోయారు. అందరూ చూస్తుండగానే కపాలధ్వజుడు అమృతని బంధించి శ్రీభాషిణితో సహా అక్కడ నుండి అదృశ్యమయ్యాడు. వెంటనే అందరూ హాహాకారాలు చేస్తూ మహానగరం వైపు పరుగు మొదలుపెట్టారు.

* * *

ఆత్మలింగం అమృత చెయ్యిదాటిన క్షణంలో అక్కడ మహానగరంలో ఒక పెద్ద మెరుపు మెరిసినట్టుగా ఆకాశంలో కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతి వెలిగి దేవలోకం వైపు సాగిపోయింది. అర్ధరాత్రి ఆ కాంతికి కారణామేమిటో తెలియక ప్రజలందరూ భయంతో రాజప్రాసాదం వైపు పరుగులు తీశారు. ఫణిభూషణుడు ఆచార్యులను, ఆస్థాన పండితులని, జ్యోతిష్యశాస్త్ర నిపుణులను పిలిచి విచారించటం మొదలుపెట్టాడు. ఇంతలో అమృతకు సహాయంగా వెళ్ళిన పరివారమంతా పరుగున వచ్చి సభలో కూలిపడ్డారు. ఆందోళనతో ఫణిభూషణుడు "ఏం జరిగింది? మా చిన్నారి అమృత ఎక్కడ?" అని అడిగాడు. పరివారమంతా

ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక భయంతో సతమతమవుతూ నోరు మెదపలేదు. ఫణిభూషణుడు వారి భయాన్ని గ్రహించి అభయమిచ్చి జరిగిన విషయం చెప్పమని అడిగాడు. కాస్త ధైర్యం చిక్కాక అందరూ కూడబలుక్కుని జరిగిన విషయం చెప్పారు.

కాలి కింద భూమి బద్దలైనదన్నట్టు ఫణిభూషణుడు కుప్పకూలిపోయాడు. ఆచార్య, మంత్రి, దండనాధులు పరుగున వచ్చి ఫణిభూషణుడిని లేపి సింహాసనంపైన కూర్చోబెట్టి వింజామరలు విసరుతూ ఉండమని సేవకులకు చెప్పి ఆస్థాన వైద్యులకు కబురుచేశారు. జరిగిన విషయం తెలిసి ఆందోళనతో సభాస్థలికి చేరుకుంది మృదుభాషిణి. కళ్ళముందు ఫణిభూషణుని స్థితి చూస్తూ, అపహరణకు గురైన కూతురిని తలుచుకుని ఆమె హృదయ విదారకంగా విలపించింది. ఎన్నడూ చూడని ఈ విపత్కర సంఘటనలకు సాక్షులుగా మహానగర ప్రజలంతా మౌనంగా విచార వదనంతో కూర్చుండిపోయారు. రాజప్రాసాదం కళతప్పింది. ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. మొత్తం నగరమంతా స్తంభించిపోయింది. కొండెక్కిన దీపాలని ఎవరూ వెలిగించలేదు. కొడగట్టి కొట్టుకుంటున్న వత్తులని సరి చేయలేదు. అంతటా చీకటి ఆవరించింది.

ఆస్థానవైద్యులు వచ్చారు. ఫణిభూషణుడిని పరీక్షించి వైద్యం చేశారు. ఫణిభూషణుడు స్పృహలోకి వచ్చాడు. చుట్టూ చూస్తే విచార వదనాలతో ప్రజలంతా నిద్రాహారాలు మాని కూర్చున్నారు. మృదుభాషిణి ఏడ్చి ఏడ్చి నీరసించి ఉలుకుపలుకు లేకుండా కూర్చుంది. నగరమంతా చీకటి ఆవరించి ఉంది. మహానగర శోభ, కళ మచ్చుకైనా కానరాలేదు. ఘనీభవించిన విషాదంలా నగరమంతా నిశ్శబ్దంగా ఉంది. ఒక మూల మహామంత్రి, దండనాధులు ఆస్థాన జ్యోతిష్యులతో సమావేశమై ఉన్నారు. జ్యోతిష్యులు అంజనం వేసి రాకుమారి జాడ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫణిభూషణుడు మెల్లగా కదిలి వారి వద్దకు వచ్చాడు. జ్యోతిష్యులు పెదవి విరిచారు.

"మహారాజా! ఈ దుష్ట మాంత్రికుడు మహా శక్తిమంతుడల్లే ఉన్నాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రాకుమారి జాడ తెలియటంలేదు," అని చెప్పారు.

మహామంత్రి విచారంతో "మహారాజా, వేగులను అరణ్యంలోకి పంపాం. ప్రయోజనం ఉండకపోవచ్చు. కానీ మానవ ప్రయత్నం చేస్తున్నాం," అని చెప్పాడు.

ఫణిభూషణునికి అంతా అయోమయంగా ఉంది. వందల ఏళ్ళుగా ఏనాడు జరగని ఈ దుస్సంఘటనలు అతడిని కలవరపెడుతున్నాయి. తన వంశ నాశనానికి తానే కారణమవుతున్నానేమో అనే భయం అధికమయ్యింది.

రాజగురువు వచ్చి "నాయనా ఫణిభూషణా, ఈ విపత్తు కేవలం మానవ ప్రయత్నంతోనే ఎదుర్కొనాలి. ఇప్పుడు దేవలోకానికి వెళ్ళటానికి గానీ, వారిని ఇక్కడకు పిలవటానికి గానీ మనకి అర్హత లేదు. మీ వంశ మూలపురుషునకు పరమేశ్వరుడు తన ఆత్మలింగాన్ని ఇచ్చేటప్పుడే చెప్పాడు, ఆ ఆత్మలింగం మీ వారసుల చేతిలో ఉన్నంత వరకే ఈ వైభవమని. కాబట్టి వీలైనంత త్వరగా ఆత్మలింగాన్ని మనం తిరిగి సాధించాలి. ఆత్మలింగంతో కూడి భైరవకోనకి వెళ్ళి బిల్వకమునీంద్రుల ఆశ్రమంలో మహాలింగానికి అభిషేకం జరిపించి తీరాలి. ఇది జరగకపోతే మహానగరం మిగలదు. మీ వంశ నాశనమూ తప్పదు," అని చెప్పారు.

"ఆచార్యా, నేను దిక్కుతోచని సంకటస్థితిలో ఉన్నాను. తరుణోపాయం మీరే సెలవివ్వండి," అని దీనంగా అడిగాడు ఫణిభూషణుడు. రాజగురువు వెంటనే అక్కడున్న ప్రజలను ఉద్దేశించి "మహాజనులారా, విచారం వీడి అందరూ నేటికి మీ గృహాలకు వెళ్ళండి. మహారాజు చేపెట్టే కార్యానికి శుభం కలగాలని దేవుడిని పూజించండి," అని పలికాడు. అందరూ నిశ్శబ్దంగా అక్కడ నుండి వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిపోయాక రాజగురువు ఫణిభూషణునితో "నాయనా నేను సమస్త రాజ్యాల్లో ఉన్న మునులను, ఆచార్యులను పిలిపిస్తాను. నేటికి విశ్రాంతి తీసుకో. రాకుమారి అమృత ఘడియల్లో పుట్టింది. ఆమె గొప్ప జాతకురాలు. ఆమెకు ఏ కీడూ జరగదు," అని చెప్పి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఫణిభూషణుడు కూడా మృదుభాషిణిని తీసుకుని విశ్రాంతి మందిరానికి వెళ్ళాడు.

* * *

మరుసటిరోజు వేగులు అన్ని దిక్కులూ వెతికి, రాకుమారి జాడ తెలియక నిస్పృహతో తిరిగి వచ్చారు. ప్రజలు దేవాలయాల్లో అహోరాత్రులు పూజలు చేస్తున్నారు. బ్రాహ్మణులు రాజవంశ శ్రేయస్సుకోరి యాగాలు మొదలుపెట్టారు. రెండు రోజులు గడిచాయి. ఎటువంటి పురోగతి కనిపించలేదు. రెండో రోజు

ఆచార్యుల విన్నపం మేర కొంతమంది మునులు, మహర్షులు మహానగరానికి వచ్చారు. వారిని చూశాక ఫణిభూషణునికి కాస్త ధైర్యం వచ్చింది. రాజగురువు చెప్పినదంతా ఆ మహర్షులు విని వారిలో వారు తర్కించుకున్నాక "మహారాజా, మాకు ఒక రోజు గడువు ఇవ్వండి. మేం పూర్తిగా చర్చించుకుని ఒక మార్గాన్ని అన్వేషించి చెబుతాం," అని చెప్పారు.

మహర్షులు విశ్రాంతి తీసుకోవటానికి అన్ని ఏర్పాట్లు చేశాడు ఫణిభూషణుడు. రాత్రి మహానగరమంతా నిద్రిస్తూ ఉంది. అమావాస్య కావటంతో చిమ్మ చీకటి ఆవరించి ఉంది. ఒక్కసారిగా పెద్ద పెద్ద శబ్దాలు రావటంతో ప్రజలు భయంతో ఇళ్ళనుండి బయటకి వచ్చారు. ఆకాశంలో ఏవో పెద్ద పెద్ద ఆకారాలు ఎగురుతూ కనిపించాయి. ఆ పెద్ద రెక్కల విసురుకి వచ్చే శబ్దం భయంకరంగా ఉంది. ఆ రెక్కలగాలికి ప్రజలు తూలి కింద పడ్డారు. ఆ ఎగురుతున్న వాటిలో అన్నింటికంటే పెద్దగా కనిపిస్తున్న ఆకారం వచ్చి కోట గుమ్మంపైన వాలింది. ఆ ఊపుకి తాళలేని కోట గుమ్మం విరిగి కింద ప్రజలపైన పడింది. ఆ ఆకారం కోటగోడపైన నిలుచుని ప్రజలవైపు తిరిగింది. కోటగోడకి కట్టి ఉన్న కాగడా వెలుతురులో ఆ ఆకారం ముఖాన్ని చూశారు. అది భల్లూకం. "రెక్కల భల్లూకం, రెక్కల భల్లూకం," అని ప్రజలు భయంతో హాహాకారాలు చేశారు. రెక్కల భల్లూకం ఆకాశం వైపు చూస్తూ దిక్కులు పిక్కటిల్లేలా గట్టిగా అరిచింది. ఆ అరుపుకి ప్రజల చెవులు పగిలి చెవుల వెంట రక్తం కారటం మొదలయ్యింది.

ఆకాశంలో ఎగురుతున్న భల్లూకాలన్నీ ఒకేసారి అరుచుకుంటూ కిందకు దూసుకువచ్చాయి. దొరికిన వాళ్ళను పంజాలతో కొట్టి గాయపరిచాయి. కొందరిని కాళ్ళతో తన్నుకుపోయాయి. భయంతో ప్రజలంతా ఇళ్ళలోకి పారిపోయి తలుపులు వేసుకున్నారు. భల్లూకాలు ఇళ్ళ పైకప్పులపై దూకాయి, పెద్ద పెద్ద శబ్దాలు చేశాయి. ఇళ్ళ పైకప్పులను విరగ్గొట్టాయి. ప్రజలు భయంతో బిక్కుబిక్కుమంటూ ఇంటిలోనే ఒక మూల దాక్కున్నారు. భల్లూకాలన్నీ మునులు విశ్రాంతి తీసుకుంటున్న మందిరం పైన దాడిచేశాయి. నిద్రలో ఉన్న మునులందరినీ కాళ్ళతో పట్టుకుని ఆకాశంలోకి తీసుకుపోయాయి. జరుగుతున్న కల్లోలానికి ఫణిభూషణుడు నిద్రలేచి బయటకి వచ్చాడు. సేవకులని అడిగి జరిగిన విషయం




తెలుసుకున్నాడు. సమయం మించి పోతోందని ఆయుధాలు ధరించి బయటకి వచ్చాడు.

ఆకాశంలో ఎగురుతున్న భల్లూకాలపై శరాలను ప్రయోగించాడు. భల్లూకాలు ఒక్కటొక్కటిగా అదృశ్యమయ్యాయి. మునులను కూడా తమతో తీసుకుని పోయాయి. ఫణిభూషణుడు తన వైఫల్యాన్ని నిందించుకుంటూ కూలబడ్డాడు. ఆచార్యులు, మంత్రి అక్కడికి చేరుకుని ఫణిభూషణుడిని అనునయించారు.

"ఆచార్యా, నా అపార అస్త్రసంపద నేడు నిర్వీర్యమయ్యింది. ఈ రాజ్య రక్షణకు వచ్చిన మునులను సహితం కాపాడలేని నేను రాజుగా అనర్హుడను.

నాలాంటి చేతకాని ప్రభువు వల్లనే ప్రజలకు ఈ కష్టాలు. నాకు ఆనతినివ్వండి. నేను అన్నింటినీ పరిత్యజించి అరణ్యవాసానికి వెళ్ళిపోతాను," అని దుఃఖితుడయ్యాడు.

"నాయనా, నైరాశ్యం కూడదు. శ్రీరాముడంతటి వాడికే కష్టాలు తప్పలేదు. విధిరాతను ఎవరూ తప్పించలేరు. నువ్వు అరణ్యవాసానికి వెళ్ళినంత మాత్రాన ఈ సమస్యలు సమసిపోతాయా? రాకుమారిని తీసుకు రావాల్సిన భాద్యత మన మీదనే ఉంది అని మరువకు. ఇన్నాళ్ళుగా మీ వంశానికి రక్షణగా నిలిచిన సర్వేశ్వరుడు ఏదో ఒక మార్గం చూపకపోడు," అని రాజగురువు హితబోధ చేశారు. ఫణిభూషణుడు తిరిగి ఇంటికి చేరి నిరాశ, నిస్పృహలతో రోజులు గడుపుతున్నాడు. ప్రజలంతా ఏమి జరగబోతోందో అని ఆందోళనతో ఉన్నారు.

* * *

ఒక రోజు ఫణిభూషణుడు మృదుభాషిణితో కలిసి రాజసభలో ఆచార్య, మంత్రులు, దండనాధులతో సమాలోచనలో ఉన్నాడు. హఠాత్తుగా ఒక గబ్బిలాల గుంపు రాజసభలోకి దూరింది. అవి అరుస్తూ ఎగరుతూ అందరి తలలపై తన్న సాగాయి, ముఖాలను రక్కసాగాయి. ఫణిభూషణుడు లేచి అదిలించేంతలో గుంపంతా ఒక్కసారిగా ఎగురుతూ బయటకి వెళ్ళిపోయింది. సభలో ఉన్నవారంతా గబ్బిలాలు లోనికి ప్రవేశించటం అపశకునం అని భయపడ్డారు. గబ్బిలాల గుంపు ఎగిరి వెళుతున్న వైపే చూస్తూ నిలబడ్డాడు ఫణిభూషణుడు.

దూరంగా ఒక రథం ఆకాశంలో ఎగురుతూ రావటం కనిపించింది. రథానికి పూన్చినవి అశ్వాలు కావు. భయంకరమైన రూపంతో, భారీ పరిమాణంలో ఉన్న అయిదు రాబందులు. వాటి రెక్కల విసురుకి గాలి సుడులు తిరుగుతూ, నేల నుండి దుమ్ములేచి ఆకాశం వరకూ ఎగిరి కళ్ళ ముందు ఏమీ కనిపించటంలేదు. ఆ రథంలో ఎవరో ఇద్దరు మనుషులున్నారని తెలుస్తున్నా, దుమ్ములో వారెవరో గుర్తించలేకపోయాడు ఫణిభూషణుడు. ఆ రథం నేరుగా రాజసభ వైపే దూసుకు వచ్చింది. గాలిధాటికి సభలో ఉన్నవాళ్ళంతా చెల్లా చెదురయ్యారు. ఫణిభూషణుడు ఎగిరి ఒక మూలనపడ్డాడు. రథం వచ్చి రాజసభలో దిగింది.

ఆ రథంలో శ్రీభాషిణి, కపాలధ్వజుడు ఉన్నారు. ఫణిభూషణుడు, మృదుభాషిణి ఇద్దరూ శ్రీభాషిణిని చూశారు. మృదుభాషిణి "సోదరీ, నువ్వే నా కుమార్తెను అదృశ్యం చేశావని సేవకులు చెప్పారు. ఆ పసిబిడ్డ నీకు ఏం అన్యాయం చేసింది? మాపైన నీకు కోపం ఉంటే మమ్మల్ని హింసించు. నా చిన్నారిని విడిచిపెట్టు. నా చిన్నారిని చూడక ఎన్నో రోజులు గడిచిపోయాయి. నీకు మాత్రం కుమార్తె కాదా?" అని ఏడుస్తూ ప్రాధేయపడింది.

శ్రీభాషిణి హేళనగా నవ్వి "మీకు కుమార్తెగా పుట్టడమే అమృత తప్పు. అందుకే నా చెరలో తగిన శిక్ష అనుభవిస్తూ ఉంది. మిమ్మల్ని మాత్రం హింసించనని ఎందుకు అనుకున్నావు? కుమార్తె జాడ తెలియక కొన్ని రోజులు మానసిక క్షోభ అనుభవించాలనే ఇన్ని రోజులు మిమ్ములను వదిలిపెట్టాను. ఇకపైన మీకూ అదే గతి," అని వ్యంగ్యంగా పలికింది.

ఫణిభూషణుడు తన అస్త్రాలను అందుకున్నాడు. శరాన్ని ఎక్కుపెట్టగానే కపాలధ్వజుడు తన మాయతో అస్త్రాలను అదృశ్యం చేశాడు. శ్రీభాషిణి బిగ్గరగా నవ్వుతూ "చూశావా ఫణిభూషణా, వీరుడవని విర్రవీగి నన్ను తిరస్కరించావు. నీకంటే వీరుడిని నేను చేపట్టాను," అని హేళన చేసింది.

"మాయల మాంత్రికుడా వీరుడు? చేతనైతే ధర్మ యుద్ధంలో నన్ను గెలవమను నీ వీరపతిని," అని సవాలు చేశాడు ఫణిభూషణుడు.

కపాలధ్వజుడు కోపంతో ఊగిపోతూ "ఆపు నీ వాచాలత," అని గద్దించి తన మంత్రదండంతో తోడేలు, మకర, శునక మొహాలు కలిగిన వేల సైన్యాన్ని సృష్టించాడు. వారు అక్కడ సభలో ఉన్నవారందరినీ బంధించి చెరసాలలో పడేశారు. కపాలధ్వజుడు, శ్రీభాషిణి కోట బయటకు వచ్చి ప్రజలందరిని పిలిచారు. జనులంతా భయంగా వచ్చి నిలుచున్నారు. కపాలధ్వజుడు వారితో "ఇకపై నేనే మహానగర ప్రభువును. ఈమె మీ మహారాణి. మేం చెప్పినదే శాసనం. కాదని ఎదిరించినవారికి మరణ దండన," అని ప్రకటించాడు.

మహానగరానికి పట్టిన దుస్థితిని అంతవరకూ చెప్పిన మంత్రాలమర్రి కాసేపు మౌనం వహించింది. యశోధరుడు, ఇద్దరు రాక్షసులు కూడా మౌనంగా మంత్రాల మర్రి వైపే చూస్తున్నారు. మంత్రాలమర్రి తిరిగి చెప్పటం మొదలుపెట్టింది.

"యశోధరా! శత్రు దుర్భేద్యమయిన ఆ మహానగరానికి నువ్విప్పుడు వెళ్ళటం

సాధ్యం కాదు. కాబట్టి నువ్వు వెనుదిరిగి పోయి నీ ఆచార్యులకు జరిగిన వృత్తాంతాన్ని వివరించు," అని చెప్పింది మంత్రాలమర్రి.

యశోధరుడు గంభీరమైన గొంతుతో "మంత్రాలమర్రీ! ఇంతవరకూ ఇది కేవలం గురువాక్య పరిపాలనగా భావించాను. కానీ ఈ వృత్తాంతం విన్నాక ఒక రాజ్యం, రాజ్యంలోని ప్రజలు ఆపదలో ఉన్నారని తెలిసి మిక్కిలి విచారం కలుగుతోంది. ఆపదలో ఉన్నవారిని కాపాడటమే కదా వీరలక్షణం. అలా కాకుంటే వీరత్వానికి గల ప్రయోజనం ఏమిటి? అదీగాక ఆపదలో ఉన్నవారిని వదిలిపెట్టి వెళ్ళటం నాకు గానీ, మా గురువులకు గానీ యశస్సును చేకూర్చదు. సర్వజ్ఞులయిన మా గురువులు అన్నీ తెలిసే నన్ను పంపించారేమో. నన్ను వెనకకు వెళ్ళమని చెప్పకుండా ముందుకు వెళ్ళే మార్గాన్ని చెప్పండి," అని పలికాడు యశోధరుడు.

"నీ వీరత్వం, గురుభక్తి ప్రశంసనీయం. కానున్నది కాకమానదు. నీ కార్యసాధనకు పరమేశ్వరుడే అండ. మహానగర ఆనుపానులు చెపుతాను విను," అని పలికింది మంత్రాలమర్రి.

"మాయాశక్తితో కపాలధ్వజుడు తన బానిసగా ఉన్న పాతాళ రాక్షసుడిని వంద అడుగుల సర్పంగా మార్చివేశాడు. ఆ సర్పరూప రాక్షసుడు మహానగరం చుట్టూ ఉన్న జలకందకంలో నివసిస్తూ రక్షణగా నిలిచాడు. ఆ సర్పం విషం చిమ్మితే ఆ విషపుఘాటు చుట్టుపక్కల ఒక మైలుదూరం వరకూ వ్యాపిస్తుంది. ఆ గాలి సోకితేనే ఏ జీవి అయినా రక్తం కక్కుతూ ప్రాణాలు విడవవలసిందే. మహానగర కోట చుట్టూ తోడేలు, మకర, శునక మోహాలు కలిగిన వేలాది రాక్షస సైనికులు కాపలాగా ఉన్నారు. రెక్కలు కలిగిన భల్లూకాలు, వివిధ పక్షుల ఆకారంలో ఉన్న రాక్షసులు ఆకాశంలో ఎగురుతూ నిరంతరం పహారా కాస్తున్నారు. మహానగర ముఖద్వారం వద్ద ఒక గంట ఉంది. నగరంలో కొత్త ప్రాణి ఏది ప్రవేశించినా అది మోగుతుంది. వెంటనే రాక్షసులంతా వచ్చి మీద పడతారు. ఈ గండాలన్నీ దాటి లోపలికి వెళితే నగర ప్రజల సహాయంతో కార్యాన్ని సాధించవచ్చు," అని మహానగర ఆనుపానులను చెప్పింది మంత్రాలమర్రి.

మంత్రాలమర్రికి కృతజ్ఞతలు చెప్పి ఆశీర్వాదం పొంది యశోధరుడు, రాక్షసులు తిరిగి అరణ్యం మధ్యలో ఉన్న మంటపానికి చేరుకున్నారు. ఆ రాత్రికి ముగ్గురూ మంటపంలో విశ్రాంతి తీసుకున్నారు.

* * *

మరునాటి ఉదయం యశోధరుడు మహానగరానికి బయలుదేరటానికి సిద్ధమౌతున్నాడు. యశోధరుడికి రాక్షసులు తమ వద్ద ఉన్న ఒక నీలమణిని, ఒక లేహ్యాన్ని ఇచ్చారు.

“నరుడా, ఈ మణిని నీ నుదుటిపై ఉంచుకుని ముమ్మారు ‘నీలమణి చెయ్ చెయ్, దృశ్యాన్ని అదృశ్యం చెయ్’ అనే మంత్రాన్ని పలికితే నీకు అదృశ్య రూపాన్ని ఇస్తుంది. నరుల రక్తం వాసన జంతువులకు, రాక్షసులకు తెలుస్తుంది. ఆ వాసనను బట్టి నరులను పసిగడతారు. ఈ లేహ్యాన్ని శరీరానికి రాసుకుంటే నిన్నెవరూ గుర్తించలేరు. వీటిని తీసుకో, నీకు ఉపయోగపడతాయి,” అని చెప్పారు రాక్షసులు.

“యక్షులారా! మీరు నాకు చేసిన ఉపకారం, చూపించిన ఆదరణ నేను ఎన్నటికీ మరువలేను. నేను బయలుదేరిన కార్యంలో విజయం సాధించిన తరువాత మొదట మీ వద్దకే వస్తాను. మీకు శాపవిమోచన కలిగించి మీ రుణం తీర్చుకుంటాను,” అని పలికి యశోధరుడు వారి వద్ద సెలవు తీసుకుని ప్రయాణమయ్యాడు.

ఆకలిదప్పులు మరచి యశోధరుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. సాయంత్రమయ్యేసరికి చాలా యోజనాల దూరం ప్రయాణించాడు. చీకటిపడుతూ ఉండగా యశోధరుడికి ఒక సరస్సు కనిపించింది. దాహం తీర్చుకునేందుకు ఆ సరస్సును సమీపించాడు. దోసిలితో నీటిని తీసుకునేందుకు వంగాడు. కానీ ఏదో జంతువు మృత కళేబరం నీటిలో తేలుతూ కనిపించింది. యశోధరుడు చుట్టూ చూశాడు. ఆ సరస్సు చుట్టూ చాలా జంతువులు, పక్షులు చచ్చిపడి ఉన్నాయి. యశోధరుడు దాపులనున్న ప్రాంతాలను పరికిస్తుంటే దూరంగా గజముఖ పర్వతం కనిపించింది. ఆ పర్వతంపై మసక మసకగా మహానగర ఆకృతి తెలుస్తోంది యశోధరుడికి.

చచ్చిపడి ఉన్న జీవులన్నీ సర్ప రూపంలో ఉన్న రాక్షసుని విష ప్రభావానికి మరణించాయని యశోధరుడికి అర్థమయ్యింది. యక్షులు చెప్పినట్టుగా ఆ సర్పరాక్షసుడు వాసన ద్వారా తన ఉనికిని గ్రహిస్తే తిరిగి ఇటు వైపుగా విషం చిమ్ముతాడని అనుమానించాడు యశోధరుడు. తక్షణం యక్షులిచ్చిన లేహ్యాన్ని తన సంచి నుండి బయటకు తీసి వంటికి రాసుకున్నాడు. మహానగరానికి




కాపలాగా ఉన్న వారంతా రాక్షసులే. రాత్రిపూట రాక్షసులు అధిక శక్తిమంతులుగా ఉంటారు కాబట్టి ఆ రాత్రికి అక్కడే విశ్రమించటం మేలనుకున్నాడు యశోధరుడు. శరీరానికి లేహ్యం ఉండటం మూలాన రాత్రికి క్రూర జంతువుల భయంలేదు. అసలు అదృశ్య రూపంలో ఉంటే మంచిదని భావించాడు.

యక్షులిచ్చిన మణిని తీసి నుదుటిపై ఉంచుకుని ముమ్మారు 'నీలమణి చెయ్ చెయ్, దృశ్యాన్ని అదృశ్యం చెయ్' అనే మంత్రాన్ని జపించాడు. ఆ రాత్రికి ఎక్కడ ఉండాలా అని చుట్టూ అనువైన ప్రదేశం కోసం వెతకటం ప్రారంభించాడు. ఇంతలో భయంకరమైన పులి గాండ్రింపు వినిపించింది. తనకి సమీపంలోనే పులి ఉందని గ్రహించి భయంతో చుట్టూ చూశాడు. హఠాత్తుగా పొదలమాటు నుండి పులి యశోధరుడికి ఎదురుగా దూకింది. యశోధరుడు ప్రాణరక్షణ

కోసం తన కత్తిని తీశాడు. పులి తన వైపే వస్తూ ఉండటంతో పోరుకి సిద్ధంగా నిలబడ్డాడు. యశోధరుడి వైపే వేగంగా పరిగెట్టుకుంటూ వచ్చిన పులి ఎగిరి యశోధరుడికి పక్కనే ఉన్న పొదలోకి దూకింది. పొదలో ఏదో జంతువు పులి నోటికి చిక్కింది. అప్పుడు తాను అదృశ్య రూపంలో ఉన్నానని యశోధరుడు గ్రహించి, మణి శక్తిని రూఢి చేసుకున్నాడు.

కత్తిని వరలో దోపుకుని నడుస్తూ ముందుకు సాగాడు. కాస్త దూరంలో పెద్ద రావిచెట్టు కనిపించింది. ఆ చెట్టుకింద పందిరి వేసి కనిపించింది. 'నట్టడవిలో పందిరి ఎందుకు ఉందా?' అని ఆలోచిస్తూ అక్కడకి చేరుకున్నాడు. ఆ పందిరి కింద ఒక శివలింగం కనిపించింది. లింగం పైన రాలిన ఆకులు, వాడిన పూలు పేరుకుని అశుభ్రంగా కనిపించింది. యశోధరుడు శివలింగాన్ని, పరిసరాలను శుభ్రం చేశాడు. తన సంచిలో ఉన్న విభూదితో శివలింగాన్ని అలంకరించాడు. చుట్టుపక్కల దొరికిన ఫలాలు తెచ్చి స్వామి ముందు ఉంచి కాసేపు స్వామిని తదేక దీక్షతో ధ్యానం చేశాడు. ధ్యానం పూర్తయ్యాక పరమేశ్వరునికి నమస్కరించి ఆ ఫలాలను ఆరగించి అక్కడే నిద్రపోయాడు.

అలసి ఉండటంతో త్వరగానే నిద్రపట్టేసింది. గాఢనిద్రలో ఉండగా "మూర్ఖుడా, ఎవర్రా నువ్వు? నా ప్రదేశానికి వచ్చి నా అనుమతి లేకుండా స్వామి వారి ముందు నిద్రపోతున్నావు?" అని గద్దిస్తున్న స్వరం వినిపించి యశోధరుడికి మెలకువ వచ్చింది. కానీ అతడికి ఎవరూ కనిపించలేదు. మరి మాటలు ఎక్కడ నుండి వచ్చాయో అర్థంకాలేదు. తాను అదృశ్యరూపంలో ఉన్నాడు, ఎవరికీ కనిపించడు కదా అని ఆలోచిస్తూ ఉన్నాడు. ఇంతలో యశోధరుడికి ఎదురుగా ఒక మహర్షి ప్రత్యక్షమయ్యాడు. ఆ మహర్షి నవ్వుతూ "నా ప్రదేశంలో కొత్త వ్యక్తిని చూసి ఆగ్రహించాను. కానీ నువ్వు నా స్వామిని శుభ్రపరిచి ఆరాధించావు. నాకు సంతోషం కలిగించావు. ఎవరు నాయనా నువ్వు?" అని ప్రశ్నించాడు.

యశోధరుడు చేతులు జోడించి తన వృత్తాంతాన్ని చెప్పి "స్వామీ నేను అదృశ్యరూపంలో ఉన్నాను. మీకెలా కనిపించాను?" అని అడిగాడు.

"నాయనా, సాధారణ మానవ దృష్టిని మాత్రమే ఈ మాయలు మోసం చేయగలవు. జ్ఞానదృష్టి కలిగిన వాడిని ఈ మాయ ఏమీ చేయలేదు. అధైర్యపడకు

నాయనా. పరమేశ్వరునిలో భక్తి ఉన్నవానికి ఓటమి లేదు. నేటికి సేదతీరి రేపు నీ ప్రయాణం కొనసాగించు," అని చెప్పి మహర్షి అంతర్ధానమయ్యాడు.

* * *

మరుసటి రోజు ఉదయమే యశోధరుడు లేచి దగ్గరలో ఉన్న కొలను వద్దకిపోయి శుచిగా స్నానం చేసి పుష్పాలు, ఫలాలు పట్టుకుని శివలింగం వద్దకు వచ్చాడు. శివలింగాన్ని శుభ్రపరుస్తుంటే ఒక రావి ఆకు మీద అక్షరాలు కనపడ్డాయి. "కుమారా! ఆపత్కర సమయంలో నన్ను ధ్యానించు. నీకు సహాయం చేస్తాను" అని దానిమీద రాసి ఉంది. మనసులోనే మహర్షికి నమస్కరించి, పరమేశ్వరునికి పూజచేసి తన ప్రయాణం తిరిగి కొనసాగించాడు.

సూర్యుని ఉదయకాంతి సోకి గజముఖపర్వతం అరుణవర్ణంలో అల్లంత దూరాన కనిపిస్తోంది యశోధరుడికి. నగరంలోకి ఎలా ప్రవేశించాలి? ఫణిభూషణ మహారాజుని ఎలా కలుసుకోవాలి? ఈ ఆపదల నుండి వారిని ఎలా రక్షించాలి అని పరిపరి విధాలుగా ఆలోచిస్తూ పర్వతం వైపే నడక సాగిస్తున్నాడు. నగరంలో ఉన్న రాక్షసులంతా నిరంతరం పెద్దగా అరుస్తూ ప్రజలకు భయం కలిగిస్తూ ఉన్నారు. నగరంలో ఉన్న అన్ని దేవాలయాల్లోనూ ధూపదీప నైవేద్యాలు నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్ళ నుండి బయటకి రావటం తగ్గిపోయింది. ఇంట ఉన్నదేదో తిని బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారు. రాక్షసులు ఉండుండీ చేస్తున్న వికటాట్టహాసాలు యశోధరుడికి వినిపిస్తున్నాయి. మహానగరానికి దగ్గరవుతున్నాననే విషయాన్ని గ్రహించగానే యశోధరుడిలో పరాక్రమం అతన్ని మరింత ఉత్సాహపరిచింది. తాను నేర్చుకున్న విద్యలకు, తన జన్మకు ఒక సార్ధకత దొరకబోతోందని అతను సంతోషపడుతున్నాడు.

గజముఖ పర్వతం వద్దకు వచ్చేసరికి యశోధరుడికి పర్వతం చుట్టూ నీటితో నిండిన లోతైన కందకం కనిపించింది. దాన్ని దాటే మార్గమేమిటా అని ఆలోచిస్తూ యశోధరుడు అక్కడే నిలబడ్డాడు. ఒక్కపెట్టున శబ్దం చేస్తూ మాహాసర్పం లేచి అతని ముందే పడగ విప్పి బుసలు కొట్టడం మొదలయ్యింది. పర్వతమంత ఎత్తు ఉండి భయంకరమైన రూపంతో ఉన్న ఆ సర్పాన్ని చూసి ధీరోదాత్తుడైన యశోధరుడు కూడా ఒక్క క్షణం తడబాటుకి లోనయ్యాడు. సర్పం

చుట్టూ కలయ చూడటాన్ని అతడు గమనించాడు. ఆ కందకం చుట్టూ అనేక జంతు కళేబరాలు పడి ఉన్నాయి. అదృశ్యరూపంలో ఉన్న తనని సర్పం గమనించలేదన్న విషయం యశోధరుడికి అర్థం అయ్యింది. కానీ సర్పానికి ఏదో అనుమానం కలిగినట్టుగా అతనికి తోచింది. అనుమానంతో ఈ సర్పం విషం చిమ్మితే తనకు మరణం తప్పదని అతనికి తెలుసు. ఈ పరిస్థితిని తప్పించుకోవటం ఎలా అని ఆలోచిస్తున్న యశోధరుడికి రావి ఆకు మీద మహర్షి రాసిన మాటలు గుర్తుకు వచ్చాయి.

క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా కళ్ళు మూసుకుని మహర్షిని మనసులోనే తలచుకున్నాడు.

"నాయనా యశోధరా! ఏం కావాలో చెప్పు," అన్నమాటలు వినిపించాయి.

యశోధరుడు కళ్ళు విప్పి చూస్తే ఎవరూ కనిపించలేదు. మహాశక్తిమంతులైన మహర్షి తాను ఎక్కడో ఉండి ఇక్కడ తనతో సంభాషిస్తున్నారని అర్థంచేసుకున్నాడు.

"మహానుభావా! ఈ కందకాన్ని మానవప్రయత్నంతో దాటగలను కానీ ఈ సర్పం కక్కే విషం నుండి మానవుడన్నవాడు తప్పించుకోలేడు. ఈ విపత్కర పరిస్థితిలో మీ సహాయం అర్థించి మిమ్మల్ని మనసులో ధ్యానించాను," అని వినయంతో చెప్పాడు యశోధరుడు.

"నాయనా! నువ్వు ఊరికే సహాయం అడిగే దుర్బలుడవు కాదని తెలుసు. నా శక్తితో నిన్ను మహానగర ద్వారం వద్దకు చేరుస్తాను," అన్నాడు మహర్షి వాత్సల్యంగా.

"స్వామీ! నాతో పాటుగా ఒక జంతు మృతకళేబరాన్ని కూడా అక్కడకు చేర్చండి," అని ప్రార్థించాడు యశోధరుడు.

మహర్షి నవ్వుతూ "తథాస్తు!" అన్నాడు.

మరుక్షణంలో ఉన్నచోట మాయమై మహానగర ద్వారం వద్ద ప్రత్యక్ష మయ్యాడు యశోధరుడు. అతని పక్కనే ఒక కళేబరం పడి ఉంది. ముఖద్వారం వద్ద కొందరు రాక్షసులు పహారా కాస్తున్నారు. ముఖద్వారానికి పైన రెండువైపులా రెక్కల భల్లూకాలు కూర్చుని అల్లంత దూరాన ఉన్న అడవిలోని అలికిడిని గమనిస్తున్నాయి. తన చేతిలోని మృత కళేబరం మీద వాటి దృష్టి పడక ముందే యశోధరుడు ఒక్క ఉదుటన ముఖద్వారం నుండి లోనికి ప్రవేశించాడు.



కొత్తవారి రాకను పసిగట్టేందుకు ముఖద్వారం వద్ద కపాలధ్వజుడు ఉంచిన గంట ఒక్కసారిగా గట్టిగా మోగటం మొదలయ్యింది. ఆ శబ్దానికి నగరంలో ఉన్న రాక్షసులంతా ద్వారం వద్దకు చేరుకున్నారు. ఆకాశంలో ఎగురుతున్న భల్లూకాలన్నీ వచ్చి నేల మీద వాలాయి. నగరంలో కలకలం మొదలయ్యింది. రాజమందిరంలో పూలపాన్పు పైన శ్రీభాషిణి చెంత నిద్రిస్తున్న కపాలధ్వజుడు ఒక్క ఉదుటన మంచం మీద నుండి లేచి పరుగులాంటి నడకతో గంట వద్దకు చేరుకున్నాడు.

కపాలధ్వజుడు వస్తూనే అందరినీ చూస్తూ “ఎవడా మూర్ఖుడు? నా అనుమతి లేకుండా ఈ నగరంలో ప్రవేశించిన ఆ అర్ధాయుష్కుడెవడు? ఇంతమంది ఉండి ఏం చేస్తున్నారిక్కడ?” అని ఆగ్రహంతో ఊగిపోతూ అరిచాడు.

అక్కడే ఉన్న కపాలధ్వజుని సైన్యం భయంతో గజగజ వణుకుతూ నోట మాటరాక, అతని ఎర్రని కన్నులు చూడలేక తలదించుకుని నిలుచున్నారు. ఇంతలో ఒక భల్లూక రాక్షసుడు రెండు చేతులతో ఒక మరణించిన జింకపిల్లను తెచ్చి తమ ఏలిక ముందు పెట్టి “నాయకా, ముఖద్వారం వద్ద పైనుండి ఈ మరణించిన జింక పడింది. మన గంటలు చేసిన సంకేతానికి ఇదే కారణం కావచ్చు. నిరంతరం పహారా కాస్తున్న నాకు మరే జీవి ఈ దాపుల్లో కనపడలేదు,” అని వంగి వినయంగా చెప్పుకున్నాడు.

కపాలధ్వజుడు ఆ మాటలు విని, ఆ మృత హరిణాన్ని చూసి కాస్త శాంతించాడు. “మన వాళ్ళే ఎవరో ఆహారం కోసం తెచ్చుకుని ఉంటారు. ఆకాశంలో ఎగురుతూ ఉండగా పట్టుదప్పి ఉంటుంది. సరి సరి. ఇక మీదట ఇలాంటి ఆందోళనకర సంఘటనలు పునరావృతం కాకుండా చూడండి,” అని చెప్పి తిరిగి తన విశ్రాంతి మందిరం వైపు నడిచాడు.

* * *

అదృశ్యరూపంలో ఉండి జరిగినదంతా చూస్తున్న యశోధరుడు ప్రమాదం తప్పినందుకు తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు. ‘నగరంలో అయితే ప్రవేశించాను. కానీ ఎవరినీ ఎరుగను. నా తక్షణ కర్తవ్యమేమిటో? నేను అనుకున్న కార్యం ఎలా సాధించగలనో?’ అని మనసులో మధనపడుతూ నగరం మొత్తం తిరగటం మొదలుపెట్టాడు.

రాక్షసరూపంలో ఉన్న గంధర్వులు తనకి చెప్పిన మహానగర గొప్పదనం ఆనవాలుకైనా మిగల్లేదు. ఎటు చూసినా నిర్మానుష్యంగా ఉంది. సందడి లేదు, అందమైన పడుచుపిల్లల నవ్వుల గలగలలు లేవు, చిన్నారుల ఆటల్లేవు, పెద్దల మందలింపులు లేవు, జ్ఞానవృద్ధుల బోధలు లేవు, బ్రాహ్మణుల వేదఘోషలేదు, ఇళ్ళ ముందు ముగ్గుల్లేవు, రాజమందిరాలకి తోరణాల్లేవు. సూర్యుడు ప్రకాశిస్తున్నా నగరం మొత్తం కాంతివిహీనంగా ఉంది. అనేక ఇళ్ళు దాటుకుంటూ అతడు చాలా దూరం వచ్చాడు.

నివాసాలకి దూరంగా ఉన్న ఒక నిర్జన ప్రదేశానికి వచ్చాడు. అక్కడ శిథిలావస్థలో ఉన్న ఒక పెద్ద శివాలయం కనిపించింది. ఈ రాక్షస సైన్యం ఉన్మాదంతో దాడిచేసి నాశనం చేయటంతో శిథిలమై అవశేషాలు మాత్రం మిగిలి ఉన్నాయి. ఆ గుడి ప్రాంగణంలో ఒక పెద్ద రావి వృక్షం కనబడింది. యశోధరుడు వృక్షం నీడలో కూర్చుని తిరిగి తన మనస్సులోని ప్రశ్నలను మననం చేసు కుంటున్నాడు. 'నగరంలో అయితే ప్రవేశించాను కానీ ఎవరినీ ఎరుగను. నా తక్షణ కర్తవ్యమేమిటి? మహారాజు, అతని పరివారం ఎక్కడ బంధింపబడి ఉన్నారు? నేను ఈ మహత్కార్యం సాధించగలనా? గురువుగారి మాట నెగ్గించగలనా?'

హఠాత్తుగా యశోధరుడికి చెట్టు పైనుండి ఒక గంభీరమైన స్వరం వినపడింది. "అవశ్యం. కార్యశూరుని మదిలో శంక కూడదు. సంకల్ప బలం ఉన్నవాడి మార్గంలో ఓటమి నిలిచే అవకాశంలేదు. క్లిష్ట సమస్యను ఛేదించటంలోనే సమర్థుని దక్షత వెల్లడి అవుతుంది," అన్న మాటలు వినిపించాయి. తన మదిలో ప్రశ్నలు ఎవరో మహాత్ముడు గుర్తించాడు అని గ్రహించిన యశోధరుడు ఒక్క ఉదుటన లేచి చెట్టు పైకి చూశాడు.

చెట్టు పైన భయంకరాకారంలో ఉన్న ఒక గరుడపక్షి కనిపించింది. ఆ ఆకారాన్ని చూసిన యశోధరుడు ఒక్క క్షణం చేష్టలుడిగిపోయాడు. తేరుకుని చప్పున తన కరవాలాన్ని అందుకున్నాడు. కాని అతని మదిలో లక్ష ప్రశ్నలు. 'అదృశ్యరూపంలో ఉన్న నన్ను ఈ పక్షి చూడగలుగుతోందా? చూసినా నా మనస్సులో మెదిలే సందేహాలను ఎలా తెలుసుకోగలిగింది? మానవభాషలో ఎలా మాట్లాడగలిగింది? ఇదంతా ఆ కపాలధ్వజుని మాయలా ఉంది. నా కరవాలంతో ఈ పక్షి శిరస్సు ఖండించి తగిన శాస్తి చేస్తాను,' అనుకున్నాడు.

"అంత శ్రమ తీసుకోకు నాయనా. వయసుడిగి శక్తిలేని నాపై నీ వీరత్వాన్ని ప్రదర్శించి నీ శక్తి వృథా చేసుకోకు," అని కాస్త బలహీనమైన స్వరంతో పలికింది గరుడపక్షి. పెద్ద శబ్దం చేస్తూ గరుడపక్షి అతని పక్కనే నేల మీదపడింది. పక్షి కళ్ళు నిస్తేజంగా, నిస్సత్తువగా కనిపిస్తున్నాయి. చూస్తుండగానే ఆ పక్షి ఒక ముని రూపంలోకి మారిపోయింది.

ఆ హఠాత్పరిణామానికి యశోధరుడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. "దాహం, దాహం," అని ఆ మహాముని యశోధరుడికి సైగ చేశాడు. వెంటనే తేరుకున్న

యశోధరుడు దగ్గరలోనే ఉన్న కొలను వద్దకు పరుగున వెళ్ళి నీటిని తీసుకుని వచ్చాడు. మహాముని తలని తన ఒడిలో పెట్టుకుని ఆ నీళ్ళు తాగించాడు. మహాముని దాహం తీరి కాస్త తెప్పరిల్లి యశోధరుడి వైపు ప్రసన్నంగా చూశాడు.

యశోధరుడు చేతులు జోడించి "మునీంద్రా, తమరెవరు? జరిగినదంతా చిత్రంగా తోస్తోంది," అని వినమ్రంగా అడిగాడు.

"నేను సర్వసిద్ధి అనే పేరు గల మహామునిని. పూర్వజన్మ ప్రారబ్ధంతో ఆ మహామాంత్రికుని చేతికి చిక్కి నా యోగశక్తులన్నింటిని కోల్పోయి ఇలా నీచంగా రోజులు వెళ్ళదీస్తున్నాను. నేటితో నా కర్మఫలం తీరిపోయింది. ఆ శివుని ఆజ్ఞ అయ్యింది. ఈ బంధనాలన్నీ తెంచుకుని శివైక్యం చెందబోతున్నాను. ఈ చివరి క్షణాల్లో నిన్ను నా వద్దకు చేర్చటం కూడా ఆ శివలీలే. నీకు మార్గోపదేశం చేస్తాను, శ్రద్ధగా విను. ఈ కపాలధ్వజుడు నీవనుకున్నంత శక్తిహీనుడు కాదు. కఠిన యోగశక్తులెన్నింటినో వశం చేసుకున్నవాడు. భల్లూకలోక మహామాత కపాలినిని ప్రసన్నం చేసుకున్న క్షుద్రోపాసకుడు. అందుకే ఎంతో తపస్సంపన్నులు కూడా వాడి ముందు నిలవలేకపోతున్నారు," అని ఆగి యశోధరుడి వైపు చూశాడు.

"స్వామీ! కఠినమైనా, ప్రాణాంతకమే అయినా ఆపదలో ఉన్న వారిని వదిలి వెనకకు తిరిగేది లేదు. కానున్నది కాక మానదు. ఈ కార్యంలో నా ప్రాణాలే విడవ వలిసి వచ్చినా, అది ఈశ్వరేచ్ఛగా భావిస్తాను. మీరు సంకోచించక మార్గాంతరం సెలవియ్యండి," అని యశోధరుడు శ్రద్ధగా ప్రార్థించాడు.

యశోధరుడిని కళ్ళతోనే అభినందించిన మహాముని "లోకకళ్యాణం కోసం సంకల్పించినప్పుడు మానవ ప్రయత్నానికి దైవశక్తి తోడై నిలుస్తుంది. నీకు తప్పక విజయం లభిస్తుంది," అని ఆశీర్వదించి, "యశోధరా, ఈ మహానగరానికి దక్షిణ దిక్కున నూరు యోజనాల దూరంలో ఒక సముద్రతీరం ఉంది. ఆ సముద్రంలో నీరు నీలి రంగు నుండి పచ్చని రంగులోకి మారుతుతున్న స్థలంలో నీటి అడుగున పగడాల లోయ ఉంది. ఆ లోయలో ముత్యపు చిప్పలతో, స్ఫటికాలతో నిర్మితమైన ఒక గొప్ప రాజమందిరం ఉంది. ఆ మందిరాన్ని ఎందరో విషకన్యలు నిత్యం పహారా కాస్తూ ఉంటారు. అక్కడే అమృతను కపాలధ్వజుడు బంధించి ఉంచాడు. దుర్భేధ్యమైన ఆ మందిరాన్ని ఛేదించి అమృతను తీసుకు వస్తే ఈ మహానగరం తిరిగి పూర్వవైభవాన్ని పొందుతుంది. నీ శౌర్యం సమస్త

లోకాలకు ప్రకటితమవుతుంది," అని చెప్పాడు సర్వసిద్ధి మహాముని.

అంతా శ్రద్ధగా విన్న యశోధరుడు "స్వామీ, మరి మహానగర ప్రభువులైన ఫణిభూషణుడు, ఆయన పట్టమహిషి క్షేమమేనా? వారు ఎక్కడ నిర్బంధించబడ్డారు?" అని అడిగాడు.

"ఇప్పటికయితే రాజదంపతులకొచ్చిన ఆపదేమీ లేదు. వారిని కపాలధ్వజుడు భల్లూకదీవిలో ఉన్న కపాలదుర్గంలో బంధించాడు. పరమేశ్వర ప్రసాదమైన ఆత్మలింగాన్ని కూడా ఆ కోటలోనే దాచాడు. రానున్న అమావాస్య రోజు అర్ధరాత్రి ఒక దుర్ముహూర్తం ఉంది. కొన్ని ఘడియలపాటు సమస్త లోకాలలో ఉన్న దైవ, దానవ శక్తులన్నీ నిర్వీర్యమైపోతాయి. ఆ శక్తులన్నింటినీ ఒక్కటి చేస్తూ నల్లనిరంగులో చండాలిక అనే మహాశక్తి పుట్టుకుని వస్తుంది. ఆమె రూపం మిక్కిలి భీతి గొలుపుతూ, భూమ్యాకాశాలను దాటిపోయే మహాకాయంతో భీకరంగా ఉంటుంది. స్మశానంలోని బూడిదను, పుర్రెలను ధరించి ఆమె విలయతాండవం చేస్తుంది. ఆ తాండవానికి సమస్త సాగరాలు అల్లకల్లోలమై పెద్ద పెద్ద అలలు ఎగసిపడతాయి. అగ్నిపర్వతాలు బద్దలై నిప్పులు విరజిమ్ముతాయి. భూమి భీతితో కంపించిపోతుంది. గ్రహాలన్నీ పరుగులు పెడతాయి. దేవ, దానవులంతా చెట్టుకొకరు, పుట్టకొకరు పోయి తలదాచుకొంటారు. ఆ క్షణంలో ఆమెను వశం చేసుకున్నవాడికింక లోకంలో ఎదురులేదు. సాక్షాత్తు ఇంద్రుడు సహితం వచ్చి అతని ముందు మోకరిల్లాల్సిందే.

"ఆ మహాయోగాన్ని పొందాలని కపాలధ్వజుడు వేచి ఉన్నాడు. మానవాతీతులైన రాజదంపతులను ఆ మహాశక్తికి బలి ఇవ్వటం ద్వారా తన ఆశయాన్ని సిద్ధించుకోవాలని వాడి కపట ఆలోచన. మొదట నువ్వు అమృతను విడిపించి, కపాలదుర్గంలో ఉన్న ఆత్మలింగాన్ని సాధించగలిగితే నీకు విజయం సిద్ధించినట్టే. ఇక నాకు సెలవు. శుభమస్తు," అని ఆశీర్వదించి ముని అదృశ్యమయ్యాడు.

* * *

మునికి మనస్సులోనే నమస్కరించిన యశోధరుడికి సమీపంలోనే రాక్షసమూక చేస్తున్న శబ్దాలు వినపడ్డాయి. అదృశ్యరూపంలో ఉన్న యశోధరుడు

వారు మాట్లాడుకుంటున్న మాటలు వినాలని దగ్గరగా వెళ్ళాడు.

ఆ మూకలో ఒక రాక్షసుడు అప్పుడే భల్లూకదీవి నుండి వచ్చాడు. అక్కడ శ్రీభాషిణినీ, మహారాజు ఫణిభూషణుడినీ ఎన్ని విధాలుగా చిత్రహింసలు పెడుతున్నదీ, మృదుభాషిణితో ఏవిధంగా ఊడిగం చేయిస్తున్నదీ వివరిస్తూ ఉంటే అక్కడున్న గుంపంతా “భళిభళి, భళిభళి,” అంటూ తమ ఏలిక అయిన కపాలధ్వజుడిని కీర్తిస్తూ ఉన్నారు. యశోధరుడికి ఆ గుంపుపై విపరీతమైన కోపం వచ్చింది. ఒక్కొక్కరిని పిండి పిండిగా కొట్టి, కాళ్ళు, చేతులూ విరిచేయాలన్నంత ఆవేశం కలిగింది. కానీ దాని వల్ల తన ఉనికి బహిర్గతమవుతుంది. మహానగరం లోపలికి కొత్త వ్యక్తి వచ్చాడనే విషయం కపాలధ్వజుడికి తెలిస్తే వెంటనే అప్రమత్తమవుతాడు. అప్పుడు మొత్తం కార్యమంతా దుస్సాధ్యమవుతుంది. ఆ విషయం స్ఫురణకు రాగానే యశోధరుడు తన ఆవేశాన్ని తగ్గించుకున్నాడు.

రాక్షసమూక మాటలను బట్టి కార్యసాధనకు ఎక్కువ వ్యవధి లేదని తెలుసు కున్నాడు యశోధరుడు. ముని చెప్పిన మాటలు మననం చేసుకున్నాడు. తాను ముందుగా అమృతను కాపాడి తీసుకుని రావాలి. అంటే ఎవరికీ తన ఉనికి తెలియక ముందే తాను మహానగరం వీడి దక్షిణ దిక్కుగా సాగాలి. తక్షణమే అడవిలో చెట్టు కింద తనకి ప్రసన్నుడైన మహర్షిని తలుచుకున్నాడు. మహర్షి తన మాయతో యశోధరుడిని మహానగరానికి దక్షిణ దిక్కుగా ఉన్న అడవికి చేర్చాడు. యశోధరుడు కృతజ్ఞతతో మహర్షికి అంజలి ఘటించి తన పయనం మొదలుపెట్టాడు.

ముందుకు సాగుతున్న కొద్దీ అరణ్యం చిక్కబడుతోంది. వందల అడుగుల ఎత్తుకు పెరిగిన చెట్లతో సూర్యుని ఉనికే తెలియకుండా నీడ పడుతోంది. పట్ట పగలే అడవంతా చీకటిగా ఉంది. ఏన్నో ఏళ్ళపాటు ఎండపొడ ఎరగని నేల చిత్తడిగా ఉంది. యశోధరుడికి ఆ చిత్తడి నేలపై నడక చికాకు కలిగిస్తూ ఉంది. దారంతా ఇలానే ఉంటే తాను అన్ని యోజనాలు సాగటానికి ఎన్ని రోజులు పడుతుందో అని మనస్సులోనే మధనపడుతున్నాడు. దూరంగా నక్కలు, క్రూరమృగాల అరుపులు వినిపిస్తూ గుండెల్లో దడపుట్టిస్తున్నాయి. యశోధరుడు మాత్రం చలించకుండా ముందుకు సాగిపోతున్నాడు.

అలా చాలా దూరం నడిచాడు. యశోధరుడికి కొద్దిగా ఆకలి మొదలయ్యింది. సూర్యకాంతి లేకపోవటంతో తాను ఎంతసేపు నడిచిందీ తెలియటం లేదు. అది పగలో, రాత్రో కూడా తెలియటం లేదు. దప్పికతో నాలుక పిడచ కట్టుకుపోయింది. యశోధరుడు చుట్టూ చూశాడు. దగ్గరలో ఏదైనా సరస్సుగానీ కనిపిస్తే కాస్త దాహం తీర్చుకోవాలని భావించాడు. కాస్త ముందుకు నడిచాక పొదల చాటు నుండి అతనికి నీటి చప్పుడు వినిపించింది. ఆ నీటి శబ్దం విన్నాక యశోధరుడికి ప్రాణం కాస్త లేచి వచ్చింది. ఆ శబ్దం వచ్చిన వైపు కదిలాడు. ఆ పొదల దగ్గరకు రాగానే చెట్ల మాటున ఏదో జంతువు నీరు తాగుతున్నట్టుగా అనిపించింది. వెంటనే తన నడుముకి ధరించిన దుప్పికొమ్ము పిడిబాకును చేతిలోకి తీసుకుని పొదలమాటున దాగి తొంగిచూశాడు.

పొదలకు ఆవల ఒక విశాలమైన నీటి మడుగు కనిపించింది. నీరంతా చాలా స్వచ్ఛంగా కనిపించింది. 'ఆహా, ఇలాంటి చీకటి అడవిలో ఇంత స్వచ్ఛమైన సరస్సా,' అని ఆశ్చర్యపడ్డాడు యశోధరుడు. ఆ మడుగులో నీరు తాగుతోంది జంతువు కాదు. జంతుచర్మాన్ని ధరించిన ఒక మనిషి నీరు తాగుతూ కనిపించాడు. మరో మనిషి ఉనికిని గుర్తించాక యశోధరుడు బాకుని దించి ప్రసన్నంగా ముందుకు కదిలాడు.

యశోధరుడి అలికిడికి ఒక్కసారిగా తుళ్ళిపడి భయంగా అటువైపు చూశాడు ఆ యువకుడు. యశోధరుడు ఆ యువకుని సమీపించేంతలో పెద్ద శబ్దం చేస్తూ సరస్సులోని నీరంతా పైకి ఎగసి పడింది. ఎవరో కాళ్ళతో కొడుతున్నట్టుగా నీరంతా ఎగిరిపడుతూ ఉంది. యశోధరుడు ఆశ్చర్యంతో అలానే నిలిచిపోయాడు. అంతలో నీటి అడుగు నుండి ఇరవై అడుగుల ఎత్తు, భారీకాయం కలిగిన ఒక జలరాక్షసుడు బయటకి వచ్చాడు. ఆ రాక్షసుడి ముఖం మిక్కిలి భయంకరంగా ఉంది. వాడికి ఒక కన్ను తులసి ఆకంత చిన్నదిగానూ, మరొక కన్ను రావి ఆకంత పెద్దదిగానూ ఉంది. అతడి తలపై నుండి ఒక శిఖలా నీరు ధారగా పడుతూ ఉంది. పెద్ద పెద్ద చెవులు, పెద్ద కోరలతో వాడి రూపం చూసేవారికి గగుర్పాటు కలిగిస్తూ ఉంది. వాడు బయటకి రావటంతోనే ఆ బోయ యువకుని పైకి దూకి పిడికిట బంధించాడు. ఆహారం దొరికింది అన్న ఆనందంతో వికటాట్టహాసం చేశాడు. ఆ యువకుడు భయంతో బిక్క చచ్చిపోయాడు.



"నన్నొదిలెయ్, నన్నొదిలెయ్," అని బిగ్గరగా ఏడ్వటం మొదలు పెట్టాడు.

క్షణకాలం నివ్వెరపోయిన యశోధరుడు ఆపదలో ఉన్న ఆ యువకుని కాపాడటం తన కర్తవ్యం అని భావించి ఆ రాక్షసుడి ముందుకి దూకాడు. "ఓరీ, జలరాక్షసుడా! ఆ యువకుడిని తక్షణం విడిచిపెట్టు. నీటి అడుగున దాగి దాహార్తితో వచ్చే జీవుల్ని మాటు వేసి ఆరగిస్తున్న నీ కపటం నేటితో చెల్లు," అని తన చేతిలో ఉన్న పిడి బాకుతో ఆ రాక్షసుడి కాలుపై పొడిచాడు. ఆ దెబ్బకి రాక్షసుడి కాలి నుండి రక్తం చివ్వున బయటకు పొంగింది. బాధతో వాడు ఆ యువకుడిని వదిలేసి తన కాలిని పట్టుకున్నాడు. ఆ యువకుడు రాక్షసుడి చేతి నుండి నీటిలో పడ్డాడు. వెంటనే యశోధరుడున్న వైపు ఈదుతూ ఒడ్డుకు

చేరుకున్నాడు. ఆ యువకుడి చెయ్యిపట్టి సరస్సు బయటకి లాగాడు యశోధరుడు.

బాధ నుండి తేరుకున్న రాక్షసుడు "ఒరేయ్ అర్భకుడా, ఈ అడవిలో ఉన్న ఏ ప్రాణైనా నన్ను చూసినంతనే భయపడి గుండె ఆగి మరణిస్తుంది. అలాంటిది నన్ను గాయపరిచేటంత ధైర్యమా? నరులెవరూ చావని వికృత చావు కోరుకునే ఇంతకు తెగించావ్. కాస్కో," అంటూ యశోధరుడి వైపుకి దూకాడు. యువకుడిని పొదల మాటుకి నెట్టి, యశోధరుడు చెంగున పక్కనే ఉన్న మర్రిచెట్టు పైకి ఎగిరాడు. రాక్షసుడు మర్రిచెట్టుని సమీపించేంతలో, యశోధరుడు పైకొమ్మకి ఎగబాకాడు. రాక్షసుడు చెట్టుపైకి కలియజూసి, యశోధరుడు కనిపించకపోవటంతో ఆ చెట్టుని పెళ్ళగించటం మొదలుపెట్టాడు. ఆ కుదుపుకి యశోధరుడు పట్టు తప్పుతున్నాడు. యశోధరుడు కొమ్మలమాటున దాగి రాక్షసుడి వైపే చూస్తున్నాడు. రాక్షసుడు బలంగా చెట్టుని ఒక్క ఊపుతో పెళ్ళగించాడు. ఆ ఊపుకి పట్టుదప్పి కిందపడుతున్న యశోధరుడు రాక్షసుడి తలపైకి దూకాడు.

రాక్షసుడు తన చేతితో యశోధరుడిని అందుకోబోయాడు. యశోధరుడికి రాక్షసుడి తలపై ఒక ఎర్రని బొడిప కనిపించింది. యశోధరుడు తన బాకుతో ఆ బొడిపపై ఒక్క పోటు పొడిచాడు. అంతే, ఒక్కసారిగా ఆకాశంలోకి నీటిని పిచికారి చేసినట్టు నీటి ధార ఎగిసిపడింది. పట్టుతప్పి కిందపడబోతున్న రాక్షసుడి మీద నుండి యశోధరుడు ఒక చెట్టు పైకి దూకాడు. రాక్షసుడు సరస్సులో కుప్ప కూలిపోయాడు. కాసేపటి వరకు నీటిలో కాళ్ళు, చేతులు కొట్టుకుని నిర్జీవుడయ్యాడు. అంతలో ఆకాశవాణి "యశోధరా! జయము, జయము. ఈ జలరాక్షసుడి వల్ల అడవికి పట్టిన పీడ తొలగించావు. ఈ సరస్సుపైన ఆధారపడిన ప్రాణులన్నింటికీ ఆనందం కలిగించావు. నీ సకల కార్యాలు జయప్రదమగు గాక," అని పలికింది. యశోధరుడు ఆకాశవాణికి కైమోడ్చి ఆ యువకుని వైపు తిరిగాడు. జరిగిన పోరాటమంతా చూస్తూ ఆ యువకుడు అలానే బిగుసుకుపోయాడు.

యశోధరుడు అతని దగ్గరకు వచ్చి "సోదరా, ఎవరు నువ్వు? ఎక్కడి వాడివి? దాహంతో నేను సరైన సమయానికే వచ్చాను," అని పలికాడు. ఆ యువకుడు కృతజ్ఞతాపూర్వకంగా యశోధరుడి చేతులు పట్టుకుని "వీరుడా, నువ్వు నాకు ప్రాణదానం చేశావు. సరైన సమయానికి నువ్వు రాకుంటే నేను ఆ

రాక్షసుడి పాలబడి దిక్కులేని చావు చచ్చేవాడిని. మా వాళ్ళంతా నేనేమైపోయానో తెలియక నాకోసం ఎదురుచూస్తూ మెతుకైనా ముట్టక ఆకలితో చనిపోయేవారు," అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"ఆపదలో ఉన్న సాటి మనిషిని కాపాడటం నా బాధ్యత. సరే, నాకు మిక్కిలి ఆకలిగా, అలసటగా ఉంది. ఇక్కడ మధుర ఫలాలేమైనా దొరుకుతాయా?" అని అడిగాడు. "నాకింత మేలు చేసిన నువ్వు మా ఆతిథ్యం తప్పక స్వీకరించాలి. ఈ దాపులనే మా గూడెం ఉంది. మాటకొట్టక నాపై దయచూపు వీరుడా," అని ఆ యువకుడు ప్రాధేయపూర్వకంగా అడిగాడు. యశోధరుడు అతని మాటను కాదనలేక చిరునవ్వుతో అంగీకరించి అతని వెంట నడిచాడు. దారిలో ఆ యువకుడు తన గురించి వివరాలు చెప్పి, యశోధరుడి వివరాలు తెలుసుకున్నాడు. బడలిక తెలియకుండా అలా మాట్లాడుకుంటూ ఇద్దరూ గూడేనికి చేరుకున్నారు.

* * *

దట్టమైన అడవికి కాస్త దూరంగా మైదానంలా ఉన్న ప్రదేశంలో ఉందా గూడెం. దూర దూరంగా చిన్న చిన్న గుడిసెలు, గుడెసెల్లో వెలుగుతున్న దీపాలతో ప్రశాంతంగా ఉంది. గూడేనికి మధ్యలో క్రూరజంతువులను దగ్గరకు రాకుండా భయపెట్టేందుకు వేసిన పెద్దమంట చాలా దూరం వరకు కనిపిస్తోంది. గూడెం పెద్ద గట్టయ్య ఆ మంట పక్కనే ఉన్న రచ్చబండపై కూర్చుని ఉన్నాడు. ఆ యువకుడు, యశోధరుడు గూడెం చేరుకుంటూ ఉండగా ఎవరా కొత్త వ్యక్తి అని పరిశీలనగా చూశాడు గట్టయ్య. గూడెంలో ప్రజలంతా గుంపులుగా చేరి యశోధరుడిని చూడసాగారు. ఆ యువకుడు యశోధరుడిని గట్టయ్య దగ్గరకు తీసుకుని వెళ్ళి అతడు తనకు చేసిన సహాయం, జలరాక్షసుడితో పోరాడినప్పుడు అతడు చూపించిన తెగువ పూసగుచ్చినట్టు వర్ణించి చెప్పాడు. జరిగిన వృత్తాంతాన్ని విని అక్కడున్న వారంతా జయజయధ్వానాలు చేశారు.

గట్టయ్య లేచి యశోధరుడి చేతులు పట్టుకుని "మా గూడెపు బిడ్డను కాపాడిన వీరుడా! మాకు ఎంతో మేలు చేశావు. నీకివే మా జోతలు," అని బిగ్గరగా ప్రకటించాడు. అక్కడున్న జనాలంతా "జోత, జోత," అంటూ గట్టయ్యకు వంతపాడారు. గట్టయ్య తన అనుచరులను పిలిపించి యశోధరుడి కోసం నీరు

తెప్పించాడు. “వీరుడా, అలసిపోయి ఉన్నావు. బడలిక పోయేలా హాయిగా స్నానమాడు,” అని కావాల్సిన ఏర్పాట్లు చేశాడు.

యశోధరుడు స్నానం చేసి రాగానే అడవిలో దొరికే మధుర ఫలాలతో, పుట్ట తేనెతో, రకరకాల పళ్ళరసాలతో కమ్మని విందు ఏర్పాటు చేశారు. ఎన్నో గంటలపాటు నడిచిన శ్రమ వల్ల, జలరాక్షసుడితో జరిపిన పోరువల్ల యశోధరుడికి విపరీతమైన ఆకలి పుట్టింది. ఆ విందు ఏర్పాట్లు చూడగానే ఆకలి మరింత పెరిగింది. అందుకే ఏమాత్రం కాదనకుండా కడుపునిండా ఆరగించాడు.

భోజనాలయ్యాక జనమంతా గూడెం మధ్యలో ఉన్న మంట చుట్టూ చేరారు. అక్కడ ఎత్తైన రచ్చబండ పైన యశోధరుడు, గట్టయ్య కూర్చుని ఉన్నారు. ఆకలి తీరటంతో యశోధరుడు కాస్త స్థిమితపడి “గట్టయ్య దొర, ఆకలితో ఉన్న నాలాంటి ఒక బాటసారికి మీరు చూపిన ఆదరణకు ఏమిస్తే ఋణం తీరుతుంది. ఈ జన్మకు నేను మీ గూడేన్ని, మీ ఆతిథ్యాన్ని మరువలేను,” అని కృతజ్ఞతగా చెప్పాడు. గట్టయ్య సంతోషంతో “వీరుడా, నువ్వు తప్పక మాతో మరికొన్ని రోజులు గడిపి తీరాలి,” అని అడిగాడు. యశోధరుడు సాలోచనగా “నాకు కూడా మీతో గడపాలనే ఉన్నా, నాకిప్పుడు వ్యవధి లేదు. నేనొక అవసర కార్యం మీద వెళుతున్నాను. వీలుంటే తిరుగు ప్రయాణంలో తప్పక మీ గూడేనికి వస్తాను,” అని చెప్పాడు. గట్టయ్య నిరాశ చెందగా ఆ యువకుడు వచ్చి యశోధరుడి వృత్తాంతమంతా వివరించి చెప్పాడు. గట్టయ్య కాసేపు ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు.

గట్టయ్య మౌనాన్ని గమనించాడు యశోధరుడు. తటాలున ఏదో ఆలోచన వచ్చినట్లు గట్టయ్య లేచి, “వీరుడా, నీ గురించి విన్నాక మా పెద్దలు నాకు చెప్పిన ఒక రహస్యం నీకు చెప్పాలనిపిస్తోంది. ఈ రహస్యాన్ని ఎన్నో తరాలుగా మాలోనే ఉంచుకున్నాం. మా గూడెపు ప్రజలకు కూడా తెలియదు,” అని అగాడు. ప్రజలంతా ఆశ్చర్యంగా చూస్తూ, గుసగుసలాడుకుంటున్నారు. గట్టయ్య తిరిగి చెప్పటం మొదలు పెట్టేసరికి అందరూ మాటలు ఆపి నిశ్శబ్దంగా వింటూ కూర్చున్నారు.

“వీరుడా, కనిపిస్తున్న ఆ దట్టమైన అడవి మధ్యలో ఒక పెద్ద కాళికాలయం ఉంది. అక్కడొక ఆలయం ఉన్నట్టు నరమానవుడెవరికీ తెలిసే అవకాశం లేదు.

రాతితో నిర్మించిన ఆ ఆలయం చుట్టూ దట్టమైన పొదలు, వృక్షాలు వ్యాపించి ఉండటం వల్ల ఆ ఆలయం ఎవరికీ కనిపించదు. ఆ ఆలయంలో ఉన్న అమ్మోరు మా గూడేనికి ఇలవేల్పు. గూడెపు పెద్దలకు మాత్రమే తెలిసిన ఆ ఆలయానికి మా తాతలకి తాతలు ప్రతి పున్నమి నాడు పూజలు చెయ్యటానికి మూడో కంటికి తెలియకుండా వెళ్ళేవారట. అంత రహస్యం ఎందుకంటే అక్కడ ఇంద్రుని ఆయుధం దాచిపెట్టి ఉంది," అని చెప్పి ఆగాడు. యశోధరుడు ఆశ్చర్యపోయి గట్టయ్యనే చూస్తూ ఉండిపోయాడు. జనాల్లో గోల మొదలయ్యింది. "ఉష్షు," అంటూ జనాల్ని ఆపి గట్టయ్య తన మాటలను కొనసాగించాడు.

"ఇదొక గొప్ప దేవరహస్యం. తండ్రుల నుండి కొడుకులకు మాకు ఈ రహస్యం తరతరాలుగా వస్తోంది. పూర్వమెప్పుడో దేవతలకు, రాక్షసులకు తీవ్ర యుద్ధం జరుగుతున్న సమయమది. రాక్షసుల దండు ఘోర తపస్సులు చేసి బ్రహ్మ వల్ల, పరమేశ్వరుని వల్ల అనేక వరాలు పొంది దేవలోకంపై దండెత్తారు. దేవతలు కూడా తమ శక్తికొద్దీ వారిని ఎదిరించారు. యుద్ధం ఏళ్ళ కొద్దీ జరుగుతూనే ఉంది. కానీ ఏ ఒక్క పక్షం ఆధిక్యం సాధించలేదు. ఇరు పక్షాల సేనల్లో ఇసుమంతైనా పట్టుదల తగ్గలేదు. ఆలాంటి సమయంలో ఒకనాడు ఇంద్రునికి ఒక గండం ఏర్పడింది. గ్రహబలం రీత్యా ఆ రోజు ఇంద్రునికి మిక్కిలి గడ్డు రోజు. తన ఇంద్ర పదవి పోయే సమయం వచ్చిందని భయపడ్డ ఇంద్రుడు యుద్ధరంగం నుండి పారిపోయి రహస్యంగా ఈ కాళికాలయంలో తలదాచుకున్నాడు.

"ఇంద్రుడు పారిపోయాడని తెలిస్తే రాక్షసులు మరింత విజృంభిస్తారని, దేవతల సైన్యం నీరుగారిపోతే కూడగట్టలేమని గ్రహించిన కొందరు దేవ సేనానాయకులకు ఒక ఉపాయం తట్టింది. బ్రహ్మను ప్రార్థించి ఒక మాయా ఇంద్రుడిని, విశ్వకర్మను ప్రార్థించి ఒక మాయా వజ్రాయుధాన్ని సృష్టించారు. రాక్షసులకు ఈ విషయం తెలియకుండా జాగ్రత్త పడ్డారు. గడ్డుకాలం గడిచిన తరువాత ఇంద్రుడు రెట్టించిన ఉత్సాహంతో వెళ్ళి, రాక్షసుల దండుని తరిమి కొట్టాడు. యుద్ధం ముగిశాక ఆ మాయా ఇంద్రుడు, ఇంద్రుని ఛాయలో ఐక్యమైపోయాడు. ఆ మాయా వజ్రాయుధాన్ని ఇంద్రుడు కాళికాలయంలో దాచిపెట్టాడు. మా వంశ పెద్దలకు ఒకనాడు కలలో కనిపించిన అమ్మోరు ఈ

రహస్యం చెప్పి ఏదో ఒకనాడు ఒక గొప్ప కార్యానికి ఆ ఆయుధం ఉపయోగపడుతుందని. అంతవరకూ దానిని జాగ్రత్తగా కాపాడమని చెప్పింది," అని చెప్పి యశోధరుడి వైపు చూశాడు గట్టయ్య.

యశోధరుడికి మిక్కిలి ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. ఆ ఆయుధం తనకు లభిస్తే తన కార్యం సులభతరమవుతుందన్న అభిప్రాయం కలిగింది. ఆనందంగా గట్టయ్య వైపు చూస్తూ "ఈ మానవ ప్రయాణంలో ఏ చిన్న పరిచయం, ఏ చిన్న సంఘటన వృథాకాదు కదా. భగవంతుడు నడుపుతున్న ఈ జగన్నాటకంలో ప్రతి చిన్న కలయిక అర్థవంతమే. నా వల్ల మీరు పొందిన సహాయం కంటే మీరు నాకు చెప్పిన ఈ రహస్యం ఎంతో విలువైనది. మీకు జన్మజన్మలకు రుణపడి ఉంటాను. ఆ కాళికాలయం ఎక్కడ ఉంది? నన్ను అక్కడకు తీసుకుని వెళ్ళగలరా?" అని అడిగాడు.

గట్టయ్య నిరుత్సాహంగా ముఖం పెట్టి "వీరుడా, దేవరహస్యం విని నువ్వు ఉత్సాహపడుతున్నావు. కానీ ఆ ఆలయ ప్రస్తుత పరిస్థితి నీకు తెలియదు. ఇప్పుడు ఆ ఆలయం మా అధీనంలో లేదు. అమ్మ మాపై ఉంచిన బాధ్యతను మేం నిలబెట్టుకోలేకపోయాం," అని విచారంతో కూర్చుండిపోయాడు. యశోధరుడు కాస్త కంగారుగా "గట్టయ్య దొరా! ఆలయానికి ఏం జరిగింది? ఎందుకు ఇలా విచారపడుతున్నావు?" అని అడిగాడు.

గట్టయ్య విచారం కూడిన గొంతుతో "వీరుడా, ఈ దురదృష్టకర సంఘటన ఎప్పుడూ ఎవరికీ చెప్పలేదు. ఆదుకునే నాథుడు, ఈ ఆపద తీర్చే వీరుడొకడు ఏదో ఒక రోజు రాకపోతాడా అని తరాలుగా ఎదురుచూస్తున్నాం. ఇన్నాళ్ళకు నువ్వొచ్చావు. జలరాక్షసుడిని నువ్వు ఒంటి చేత్తో చంపావంటే, నువ్వే ఈ ఆపద తీర్చగల వాడివని నాకు గురి కుదిరింది," అని చెప్పి గూడేనికి తూర్పున ఉన్న అమ్మోరి విగ్రహానికి చేతులెత్తి దండంపెట్టాడు గట్టయ్య. అక్కడున్న జనమంతా బిక్కుబిక్కుమంటూ జరుగుతున్నదంతా చూస్తూ నిలబడ్డారు.

"అప్పుడు నేను పసికూనగా ఉన్న రోజులు. కార్తీక పున్నమి రోజున మా తాత అమ్మోరి పూజ కోసం మా నాయనని వెంట తీసుకుని ఆలయానికి వెళ్ళాడు. మా నాయనని ఆలయానికి కాస్త దూరంలో ఆపి మా తాత ఒక్కడే పూజ చేయటానికి ఆలయం లోపలికి వెళ్ళాడు. రాత్రి కావస్తున్నా తాత తిరిగి

రాకపోవటంతో మా నాయన ఆలయానికి వెళ్ళి బయట నుండే తొంగి చూశాడు. ఎక్కడినుండి వచ్చాడో కాని ఒక మాంత్రికుడు వందమంది రాచకన్యలతో సహా అక్కడకి వచ్చాడు. ఆ వందమంది కన్యలని సమ్మోహన శక్తితో బంధించి తీసుకు వచ్చాడు. పూజ చేస్తున్న మా తాత ఆ మాంత్రికుడితో తలపడ్డాడు. కానీ వాడు భుజబలంతో కాక తనకున్న మంత్రబలంతో మా తాతను ఓడించి అక్కడే బంధించాడు. ఆ కన్యలందరినీ శిలలుగా మార్చేసి ఆ ఆలయంలోనే బంధించి వాడి అనుచరులను కాపలా ఉంచి ఎక్కడికో వెళ్ళిపోయాడు. చాటు నుండి అంతా చూసిన మా నాయన ఆ అనుచరుల కళ్ళుగప్పి మా తాతను విడిపించి ఎలాగో గూడేనికి తీసుకు వచ్చాడు. ఆ ఆలయాన్ని కాపాడలేకపోయిన దిగులుతోనే మా తాత మంచంపట్టి చనిపోయాడు. నాటి నుండి మేమెవరం ఆ ఆలయం వైపు కన్నెత్తైనా చూడలేదు," అని చెప్పి గట్టయ్య కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

యశోధరుడు గట్టయ్యను అనునయించి "విచారపడకు పెద్దయ్యా, ఇకనుండి ఇది మీ సమస్య మాత్రమే కాదు. ఆ మాంత్రికుడు ఎంతటి బలవంతుడైనా, మాయా సంపన్నుడైనా వాడి పీడ వదిలించి ఆలయాన్ని రక్షించి మీకు అప్పగించే బాధ్యత నాది. ఇక మీరు విచారాన్ని వీడండి," అని ధైర్యం చెప్పాడు. గట్టయ్య ఆ మాటలు విని కాస్త కుదుటపడ్డాడు. "వీరుడా, నాకు నీ మీద పూర్తిగా గురి కుదిరింది. తెల్లవారగానే ఆలయానికి ప్రయాణమవుదాం. ఇప్పటికే చాలా రాత్రి అయ్యింది. ఇక విశ్రాంతి తీసుకో," అని యశోధరుడితో చెప్పాడు. తగిన ఏర్పాట్లు చెయ్యమని తన అనుచరులను ఆదేశించాడు గట్టయ్య. గూడెం జనమందరినీ ఇళ్ళకు పంపేశాడు. ఆ రాత్రి అందరూ ప్రశాంతంగా నిద్రపోయారు.

* * *

ఆ మరునాడు తెల్లవారటంతోనే యశోధరుడు ఎంతో ఉత్సాహంగా లేచి గూడేనికి దగ్గరలో ఉన్న సరస్సులో స్నానం చేసి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అక్కడి ప్రజలు ఎంతో అభిమానంతో యశోధరుడి కోసం రుచికరమైన ఫలాలను తెచ్చారు. యశోధరుడు ఆ అభిమానానికి సంతసించి వాటిని స్వీకరించాడు. ఇంతలో బాహుబలానికి, ధైర్యానికి ఆ గూడెంలో పేరుబడ్డ నలుగురు యోధులను వెంట బెట్టుకుని గట్టయ్య అక్కడకు వచ్చాడు. వారంతా నల్లని ఛాయతో, కండలు

మెలితిరిగి, పొడవుగా, దృఢంగా ఉన్నారు. అందరూ పదునైన ఈటెలు పట్టుకున్నారు. యశోధరుడు తనను ఆదరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపి, వారి దగ్గర సెలవు తీసుకున్నాడు. విజయుడై తిరిగిరావాలని వాళ్ళు ఆశీర్వదించారు.

గట్టయ్య దారి చూపిస్తూ ముందు నడుస్తుండగా మిగిలినవారు అతడిని అనుసరించారు. యశోధరుడు నడుస్తూనే మాంత్రికుడి శక్తియుక్తులను అంచనా వేసే ప్రయత్నం చేస్తున్నాడు. రక్షణగా వచ్చిన నలుగురు బిల్లయువకులు దారిలో గట్టయ్యకు గానీ, యశోధరుడికి గానీ ఏ క్రూరమృగం వల్ల ఎటువంటి ఆపద రాకుండా చుట్టూ పరికిస్తూ ముందుకుసాగుతున్నారు. అలా కొన్ని గంటల నడక తర్వాత ఒక దట్టమైన అటవీ ప్రాంతం చేరుకున్నారు. గట్టయ్య తన పెద్దల ద్వారా తాను విన్న దట్టమైన అటవీప్రదేశం ఇదేనని, ఆలయానికి చేరువగా వచ్చామని గ్రహించి ఆ విషయమే అందరికీ చెప్పాడు. తనకి తెలిసిన కొండగుర్తులు సరిపోల్చుకుంటూ ముందుకు అడుగేసాడు. కాస్త గుబురుగా ఉన్న పొదలను ఈటెలతో తొలగిస్తూ కొంచెం దూరం వెళ్ళగానే చెట్ల చాటు నుండి ఒక పెద్ద రాతి నిర్మాణం కనిపించింది.

"అదే మా పెద్దలు చెప్పిన కాళికాలయం," అని సంభ్రమంగా ఆలయాన్నే చూస్తూ అక్కడే నిలబడిపోయాడు గట్టయ్య. బిల్ల యువకులు కూడా ఆశ్చర్యంగా పరిశీలిస్తూ అక్కడే ఆగిపోయారు. యశోధరుడు క్షణకాలం పాటు ఆలయాన్ని నిశితంగా పరిశీలించాడు. గోడలనిండా అమ్మవారు ఎందరినో వధిస్తున్నట్టు, నాలుక భయంకరంగా బయటకుపెట్టి, మొండెంలేని తలలను చేతబట్టిన బొమ్మలు చెక్కి ఉన్నాయి. ఆలయ నిర్మాణశైలి, ఆకృతి పరికిస్తే ఏవరో తంత్ర ఉపాసకులు నిర్మించిన ఆలయంలా అనిపిస్తోంది. పురాతనమైనది కావటం వల్ల శిధిలమై, శిధిలాల నుండి చెట్ల వేళ్ళు పొడుచుకొచ్చాయి. చెట్ల ఊడలు భూతాల జడల్లా వేలాడుతూ భయం కలిగిస్తున్నాయి. గబ్బిలాలు ఒక కొమ్మ నుండి మరొక కొమ్మకు ఎగురుతూ కనిపిస్తున్నాయి. ఆలయం ఆవరణలో చీకటిగా ఉన్న ఒక మూల ఒక తోడేలు అప్పుడే పట్టి తెంచిన జింక శరీరాన్ని చీల్చుకుని తింటూ కనిపించింది. ఆ జింక వేడి రక్తం వాసన దూరంగా ఉన్న బిల్ల యువకులకు తెలిసింది. ఆలయాన్ని చూడాలని ఉత్సాహంగా వచ్చిన వారిలో కించిత్ భయం

ప్రవేశించింది. అక్కడున్న వారిలో ఎవరికీ అడుగు ముందుకు పడటం లేదు.

కాసేపటికి ధైర్యం కూడగట్టుకున్న గట్టయ్య "పదండి ఆలయంలోకి వెళ్దాం," అన్నాడు. బిల్ల యువకులు భయం భయంగా ముందుకు కదిలారు. యశోధరుడు అందరినీ వారించి, "పెద్దయ్యా, నా మీద నమ్మకంతో మీరంతా ఇక్కడివరకూ వచ్చారు. ఇకపైన ఈ పని నాకు వదిలిపెట్టండి. నా కోసం మీరు ఆపదలు కొనితెచ్చుకోవద్దు. ఆలయంలోకి నేను వెళతాను. మీరు దూరంగా ఉండి గమనించండి. నేనా మాంత్రికుడిని సంహరించగలిగితే అందరూ లోపలికి వచ్చి అమ్మవారికి పూజలు చేయవచ్చు. అలాకాకుండా నాకేదైనా ప్రమాదం జరిగినట్టనిపిస్తే మీరంతా గూడేనికి తిరిగి వెళ్ళిపోండి. నన్ను నమ్మి వచ్చిన మీకు ఏ హాని జరిగినా అది నాకు చాలా బాధ కలిగిస్తుంది," అని చెప్పాడు. తనను ఒంటరిగా పంపటానికి తటపటాయిస్తున్న గట్టయ్యను ఒప్పించి యశోధరుడు ముందుకు కదిలాడు.

ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన యశోధరుడిని చూడగానే మూలన ఉన్న తోడేలు పైకి చూస్తూ పెద్దగా అరవసాగింది. యశోధరుడు ఆగి చప్పున అటుగా చూశాడు. అప్పటికే మీదకు దూకటానికి సిద్ధంగా ఉన్న తోడేలు అతడి దృఢమైన శరీరాన్ని, చురుకైన చూపుని చూసి తోకముడిచి, ఆలయం వెనక వైపుకి పరుగుతీసింది. ఆ అలజడికి చెట్లపైన వేలాడుతున్న గబ్బిలాల గుంపు ఒక్కసారిగా యశోధరుడి వైపుకి దూసుకు వచ్చింది. అతడు మెరుపులా కదిలి ఆ దాడిని తప్పించుకున్నాడు. ఆలయంలో కాపలా ఉన్న మాంత్రికుని సేవకులకు అలికిడి వినిపించి ఆయుధాలతో వచ్చి యశోధరుడి మీద పడ్డారు.

వాళ్ళంతా ఏడడుగుల పొడవుతో బలిష్టంగా ఉన్నారు. అందరూ ముళ్ళ కత్తులతో యశోధరుడి మీద దాడిచేశారు. ఆ ఆకస్మిక దాడిని ఊహించని అతను నివ్వెర పోయాడు. వెంటనే తేరుకుని ఆ కింకరుల కత్తుల నుండి ఒడుపుగా తప్పుకుని తన మీదకి వస్తున్న ఒక్కొక్కడి ముఖం మీద తన బలమైన చేతులతో పిడి గుద్దులు కురిపించాడు, డొక్కల్లో బలంగా తన్నాడు. ఆ దెబ్బలకి ఆ కింకరులు కూలబడ్డారు. గట్టయ్య ఆదేశంతో బిల్ల యువకులు ఒక్క ఉరుకులో యశోధరుడికి తోడు వచ్చారు. చేతిలో ఉన్న ఈటెలతో ఆ కింకరుల మీద దాడి చేశారు. ఆ దెబ్బలకి రక్తమోడుతున్న కింకరులను బంధించమని బిల్ల యువకులకు అప్పగించి



యశోధరుడు ఆలయంలోకి ప్రవేశించాడు.

ఆలయం లోపల చీకటిగా ఉంది. అక్కడక్కడ కొన్ని కాగడాలు మాత్రం వెలుగుతున్నాయి. ఆ చీకటికి కాస్త అలవాటు పడ్డాక యశోధరుడు ఆలయం మొత్తం కలియజూస్తూ, జాగ్రత్తగా ఒక్కో అడుగు వేస్తూ ముందుకు కదులుతున్నాడు. ఆ చీకటిలో అదుపుతప్పి ఒక్కసారిగా పడబోయిన యశోధరుడు తన కాళ్ళ దగ్గర మెట్లు ఉన్నట్టుగా గ్రహించి, లేచి నిలబడి ఆ మెట్లదారిని అనుసరించాడు. ఆ మెట్లు ఆలయ ప్రధాన మంటపానికి దారితీశాయి. ఆ మందిరంలో అడుగుపెట్టిన యశోధరుడు నివ్వెరపోయాడు. కొన్ని వేలమంది జనానికి సరిపోయేలా ఎంతో విశాలంగా, ఎత్తుగా నిర్మించిన మంటపమది.

'ఈ కారడవిలో ఇంత పెద్ద నిర్మాణం ఎలా సాధ్యపడింది? ఇది మానవ

మాత్రులకు సాధ్యమా? ఇది ఖచ్చితంగా ఏ తంత్రవేత్తలో నిర్మించి ఉంటారు,' అని ఆలోచిస్తూ యశోధరుడు అడుగులో అడుగేసుకుంటూ నెమ్మదిగా ముందుకు కదులుతున్నాడు. కదులుతున్న అతని కాళ్ళకు ఏదో తగిలి ఉలిక్కిపడి చూశాడు. అది మనిషి పుర్రె. ఆ వైపు పరికించి చూస్తే బలిపీఠం ఒకటి కనిపించింది. దాని పక్కన ఎముకలు, పుర్రెలు గుట్టగా పడి ఉన్నాయి. అంటే ఇక్కడ నరబలులు జరుగుతున్నాయన్నమాట అని అనుకున్నాడు. "అవును సోదరా. ఇక్కడ నరబలులు జరుగుతాయి. నువ్విప్పుడు మమ్ములను కాపాడకపోతే మేమంతా బలి కావాల్సిందే," అనే మాటలు వినిపించాయి. యశోధరుడు చప్పున తన కత్తిని ఒరలో నుంచి బయటకు తీశాడు. "ఎవరక్కడ? నా మనసులో ఉన్న మాటను గ్రహించిన నువ్వు మాయావివా? అయితే నీ కపటం చాలించి నా ఎదుటపడు. భీరువులా చీకటిలో దాక్కున్నావా?" అని గద్దించాడు యశోధరుడు.

"లేదు సోదరా, లేదు. నేను దుష్టుడిని కాదు. ఒక దుష్ట మాంత్రికుని చేతిలో బందీగా పడి ఉన్నాను. వెనకకి తిరిగి చూడు," అని ఆ గొంతు ప్రాధేయపడింది. యశోధరుడు వెనకకు తిరిగి చీకటిగా ఉన్న మూలకు నడిచాడు. యశోధరుడి చేతిలో ఉన్న కాగడా వెలుగులో అక్కడ పదడుగుల ఎత్తున్న ఒక ఇనుప పంజరం కనిపించింది. ఆ పంజరంలో గారడివాడి లాగా కనిపిస్తున్న ఒక యువకుడు బందీగా ఉన్నాడు. అతని చేతిలో ఒక చిలక ఉంది. యశోధరుడు అతని వైపు పరిశీలనగా చూశాడు. అనుమానించాల్సిన వ్యక్తిలా అనిపించలేదు.

ఆ నమ్మకం కుదిరాక పంజరం దగ్గరగా వెళ్ళి "ఎవరు నువ్వు? నిన్ను ఇక్కడ ఎవరు బంధించారు? ఏమిటిదంతా? ఇక్కడ వాతావరణమంతా అగమ్యగోచరంగా ఉంది," అని అడిగాడు యశోధరుడు.

"సోదరా, నా బతుకు ఈ చీకటి గుహలోనే తెల్లారిపోతుందనుకున్నాను. రోజూ ఈ రాక్షస మూకల్ని చూస్తూ బిక్కుబిక్కుమంటూ క్షణమొక యుగంగా గడుపుతున్నాను. మా అమ్మ కడుపు చల్లగా, అత్త కడుపు చల్లగా నేటికి ఒక నర మానవుడిని చూడగలిగాను. ఏనాడు చేసిన పుణ్యఫలమో నా పాలిట దేవుడిలా వచ్చావు. నన్ను నువ్వే కాపాడాలి. నన్ను గారడి మల్లన్న అంటారు. నేను ఈ అడవికి దాపుల ఉండే పల్లెల్లో కోతులను ఆటలాడిస్తూ, పక్షులతో పాటలు పాడిస్తూ నాలుగు రూకలు సంపాదిస్తూ బతికేవాడిని. జీవితం హాయిగా

గడిచిపోయేది. కానీ కాలం ఎప్పుడూ ఒక్క రీతినుంటుందా? ముద్దకు ఎద్దడి లేనప్పుడు బుద్ధి పద్ధతిగా ఉంటుందా? పక్కదారి పట్టింది.

"ఆశ, అహంకారం దుఃఖ కారణాలంటారు. మతి చేతిలో లేని మనిషికి ఇవేం పట్టవు. గారడి చేస్తూ నిత్యం అనేక ఊర్లు తిరిగే నేను ఒక పల్లెలో రూపవతి అనే అమ్మాయిని కలిశాను. అమెది గొప్ప అందం. రాజకోటల్లో ఉండే రంగు, లావణ్యం. ఆమెని ఏ ముహూర్తాన కలిశానో గానీ అప్పటి నుండి ఆమెను వదలలేని బలహీనత నన్నావరించింది. కానీ ఆమెకు డబ్బంటే విపరీతమైన వ్యామోహం. పెళ్ళాడతావా అని అడిగితే నన్ను చూసి ఫక్కున నవ్వింది. కోతులాడించే నీకు నేను కావాలా? అని అవమానించింది.

"ఛీ అన్నా, ఛీత్కరించినా ఆమె మీద మోహం పోలేదు. ఆత్మగౌరవం, అభిమానం వదిలేసుకున్నాను. చేతిలో ఉన్న పని కూడా వదిలేసి ఆమె కోసం మధనపడ్డాను. ఆమెకోసం ఏం కావలన్నా చేస్తాను అని మాట ఇచ్చాను. అప్పుడు రూపవతి ఈ గారడి విద్యల బతుకూ ఒక బతుకేనా, అడవిలో ఏదో కాళికాలయం ఉందంట. ఆ ఆలయంలో దేవిని మెప్పిస్తే మంత్ర విద్యలొస్తాయంట. పోయి ఆ మంత్రవిద్యలు సాధించుకునిరా. ఆ మాయలతో మనం కావాల్సినవన్ని పొందొచ్చు. అలా కాదంటే నా మీద ఆశ వదులుకో అని షరతు పెట్టి వెళ్ళిపోయింది. రూపవతి మీదున్న మోహావేశంతో ముంచుకొచ్చే ప్రమాదాల్ని ఊహించక సాహసం చేసి, ఇదిగో ఇలా చిక్కుల్లో పడ్డాను," అని నిట్టూరూస్తూ చెప్పాడు గారడివాడు.

అంతా శ్రద్ధగా విన్న యశోధరుడు "మల్లన్నా, మంత్రాలు మాత్రమే మనిషికి మేలుచేస్తాయన్నదే సత్యమైతే ఊరూరా మనుషులు కాక మంత్రగాళ్ళే ఉండేవారు. తిండిపెట్టే ఏ విద్య అయినా మహిమగలదే. అలాంటి విద్యను ఒక దీక్షలా ఆచరించాలే తప్ప చులకన చేయకూడదు. పేరాశగల వాళ్ళు తమ చుట్టూ ఉన్న వారికి చేటు తెస్తారు. ఈ విషయాలు మరిచి నువ్వు తొందరపడ్డావు. ఇప్పటికైనా సత్యం బోధపడింది. ఇక ముందు తప్పు చేయకుండా ఈ అనుభవాలు దోహదపడతాయి," అని సాలోచనగా పలికి "ఇంతకీ ఇక్కడి పరిస్థితులు వివరించావు కాదు. నిన్ను ఇలా ఎవరు బంధించారు? ఈ ఆలయం వ్యవహారం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

"ఆ విషయమే చెబుతున్నాను విను. రూపవతి మాటలు నమ్మి చెట్లు, పుట్టలు వెతుక్కుంటూ అడవంతా ఆలయం కోసం గాలించాను. ఆ విధంగా ఏడు పగళ్ళు, ఏడు రాత్రులు వెతకగా ఈ ఆలయం కనిపించింది. ఇక నా కోరిక ఫలించినట్టే అని ఆనందపడుతూ ఈ ఆలయంలో అడుగుపెట్టాను. అడవిలో ఉన్న ఈ ఆలయం నిర్మానుష్యంగా ఉంటుందని భావించాను. కానీ ఆలయమంతా కోలాహలంగా ఉంది. పెక్కుమంది స్త్రీలు ఏడుస్తున్నట్టుగా శబ్దాలు వినపడ్డాయి. ఆలయమంతా ఏవో మంత్రాలతో దద్దరిల్లిపోతుంటే, లోపలికి తొంగి చూశాను.

"అదిగో ఆ కాళికామాత విగ్రహం ముందు ఆజానుబాహుడైన ఒక మాంత్రికుడు నిలబడి ఉన్నాడు. చూడగానే వళ్ళంతా గుగుర్పొడిచే భయంకరమైన రూపం వాడిది. వాడి మెడలో పుర్రెలమాల వేలాడుతూ ఉంది. తలంతా జడలుకట్టి ఉంది. చేతిలో ఒక మంత్రదండం ఉంది. అదిగో, కనిపిస్తున్న ఆ హోమగుండం ముందు వాడు నిలబడి ఉన్నాడు. ఆ హోమగుండంలో మంటలు నిలువెత్తున ఎగసిపడుతున్నాయి. ఆ మాంత్రికునికి ఎదురుగా అద్భుతమైన సౌందర్యరాశులైన రాకుమార్తెలు ఉన్నారు. వారి చూట్టూ వలయంగా కింకరులున్నారు.

"ఆ మాంత్రికుడు తన మంత్రదండాన్ని గాలిలో తిప్పుతూ ఏవో మంత్రాలు చదువుతున్నాడు. ఆ దృశ్యం చూడగానే నా పైప్రాణాలు పైనే పోయాయి. వెనక్కి తిరిగి పరుగందుకున్నాను. కానీ ఆ చీకటిలో మాటేసి ఒక కింకరుడున్నాడని నేను గుర్తించలేదు. వాడు నన్ను తాళ్ళతో బంధించి ఒక మూల ఉంచాడు. నేను భయంతో వణుకుతూ జరుగుతున్న వ్యవహారమంతా గమనిస్తూ ఉన్నాను.

"ఆ మాంత్రికుడు పెద్దగా మంత్రాలు చదువుతూ తన చేతిలో ఉన్న కుంకుమని ఆ హోమగుండంలో వేస్తున్నాడు. అలా పూజ కొనసాగుతుండగా హోమగుండం మంటల రంగులో మార్పు కనిపించింది. దట్టంగా లేస్తున్న పొగ కాళీమాత విగ్రహాన్ని ముంచేస్తూ ఉంది. ఆ దృశ్యం చూడగానే మాంత్రికుడు పట్టరాని ఆనందంతో వికటాట్టహాసం చేశాడు. తన నడుముకి కట్టి ఉన్న పట్టీ నుండి చప్పున ఒక చురకత్తిని తీశాడు. ఏం జరుగుతోందో అర్థం కాని సందిగ్ధావస్థలో నేను కొట్టుమిట్టాడుతూ, భయపడుతూ అంతా గమనిస్తున్నాను. ఆ మాంత్రికుడు బిగ్గరగా ఒక మంత్రం చదివి తన కుడిచేతి బొటనవేలుని

ఖండించి ఆ హోమగుండంలో పడేశాడు. అంతే, ఒక్కసారిగా మందిరం పైకప్పుని తాకేలా మంటలు ఎగసి, ఆరిపోయాయి. మాంత్రికుడి కింకరులంతా ఏవో ప్రత్యేక శబ్దాలతో జయజయధ్వానాలు పలికారు. ఆ మాంత్రికుడు కాళికామాత విగ్రహం ముందు సాగిలబడ్డాడు.

"విగ్రహంలో ఒక చలనం కలిగింది. విగ్రహం నుండి దేవి బిగ్గరగా నవ్విన శబ్దం వినిపించింది. మిక్కిలి రౌద్రంతో ముక్కుపుటాలు అదురుతున్నాయా అన్నట్టుగా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు విగ్రహం నుండి వెలువడ్డాయి. మాంత్రికుడి కింకరులంతా 'శరణు మాతా, శరణు,' అంటూ బిగ్గరగా అరిచారు. అప్పుడు కాళికామాత 'కాళభైరవా, వందల సంవత్సరాలుగా నువ్వు చేస్తున్న దీక్ష పక్వానికి వచ్చింది. నేను కోరిన బలి మాత్రం మిగిలిపోయింది. వచ్చే పౌర్ణమిలోపు ఆ బలిని నువ్వు పూర్తిచెయ్యాలి,' అని హెచ్చరించింది.

" 'మాతా సర్వం సిద్ధం చేశాను. దేశదేశాలు తిరిగి అమోఘమైన ఘడియల్లో పుట్టిన మేలుజాతి కన్యారత్నాలను నూరుగురిని బలికి సిద్ధం చేశాను,' అని బదులిచ్చాడు ఆ మాంత్రికుడు.

" 'కాళభైరవా, నరకాంతలెందరున్నా ఒక దేవకాంత, ఒక నాగిని బలి ప్రసాదంలో ఉండాలన్న నియమాన్ని మరిచావా?' అని కోపంగా అడిగింది కాళికామాత.

" 'మరువలేదు మాతా, మరువలేదు. వచ్చే పౌర్ణమి నాటికి వారిని కూడా తెచ్చి నీకు మహానైవేద్యం అర్పిస్తాను. అనుగ్రహించు తల్లీ,' అని ప్రాధేయపడ్డాడు మాంత్రికుడు.

"వెంటనే విగ్రహంలో చలనం ఆగిపోయింది.

"దీర్ఘ నిట్టూర్పుతో సాలోచనగా కాళభైరవుడు తన కింకరులను ఉద్దేశించి, 'కింకరులారా, విన్నారుగా అమ్మ మాట. మనం ప్రపంచాధిపత్యాన్ని సిద్ధింపచేసుకోవటానికి, అమరత్వాన్ని పొందటానికి ఎంతో కాలం పట్టదు. రాబోయే పౌర్ణమే మన తుది గడువు. మహా నివేదన జరిగిన మరుక్షణం మనం ఈ రహస్య జీవితాల్ని విసర్జించి స్వర్ణమయ నిర్మితమైన మందిరాల్లో, విశాలమైన నగరాల్లో విహరిస్తాం. గంధర్వుల అమరగానాన్ని ఆస్వాదిస్తూ, మధురమైన మదిరను సేవిస్తూ, అత్యంత సుందరీమణులైన అప్సరసలతో సుఖిస్తూ

ఆద్యంతాలెరుగక కాలాన్ని వెళ్ళదీస్తాం,' అని చెప్పాడు. కింకరులంతా సంతోషంతో హర్షధ్వానాలు చేస్తూ చిందులువేశారు. 'కానీ అంతవరకూ ఈ నూర్గురు కన్యలను భద్రంగా చూసుకోవాలి. అన్య ప్రాణులను ఈ మందిరం దాపులకు రాకుండా కాపుకాయాలి,' అని హెచ్చరించాడు. అందరూ మాంత్రికుడి ముందు మోకరిల్లి అతడి ఆజ్ఞలకు తమ ఆమోదం తెలిపారు.

"కాళభైరవుడు తన మంత్రశక్తితో నూర్గురు రాచకన్యలను శిలలుగా మార్చాడు. కొందరు కింకరులకు ఇక్కడి కాపలా బాధ్యతలప్పగించి మిగిలిన కింకరులతో దేవకాంతను, నాగినిని బంధించి తెచ్చేందుకు వెళ్ళిపోయాడు," అని తను చూసిన వృత్తాంతాన్ని వివరించాడు గారడి మల్లన్న. "మరి ఆ మాంత్రికుడు నిన్ను చూడలేదా?" అని అడిగాడు యశోధరుడు. "చూడకనేం, చూశాడు. కానీ నా వాలకం చూసి నా వల్ల ప్రమాదేమేమీ లేదని భావించి నన్ను చంపక ఇలా బంధించి పడేశాడు," అన్నాడు మల్లన్న.

"దేవుని సృష్టిలో జరిగే ప్రతిచర్యకు తగిన ప్రాధాన్యత ఉండే తీరుతుంది, మలన్నా. ఆ రూపవతి నిన్ను పంపకపోతే నువ్విక్కడకి వచ్చేవాడివి కాదు. ఆ మాంత్రికుడు నువ్వు ప్రమాదకారివి కాదని విడిచిపెట్టుండకపోతే నాకీ ఆలయ వృత్తాంతం తెలిసేది కాదు," అని నవ్వాడు యశోధరుడు.

యశోధరుడు ముందుకు కదిలి అక్కడున్న శిలాప్రతిమలను పరిశీలించాడు. వివిధ భంగిమల్లో చెక్కిన శిల్పాల్లా ఉన్న వారంతా రాచకన్యలని, మానవమాత్రులని నమ్మశక్యంగా అనిపించటం లేదు. ఇప్పుడు ఈ మాయనంతా ఎలా ఛేదించాలా అని ఆలోచిస్తూ ముందుకు కదిలాడు యశోధరుడు.

* * *

యశోధరుడు ఆలయమంతా జాగ్రత్తగా పరికిస్తూ కదులుతున్నాడు. హోమ గుండం దగ్గరగా వచ్చి చూశాడు. అందులో పుర్రెలు, ఎముకలు, కుంకుమ తప్ప అతనికి ఉపయోగపడేవి ఏమీ కనబడలేదు. అలా తిరిగి తిరిగి పరిశీలించి ఏ సాధనమూ కనిపించక అలసిపోయిన యశోధరుడు కాళికామాత విగ్రహం వద్దకు వచ్చి భక్తితో కైమోడ్చి "తల్లీ, లోకరక్షణకు అవతరించిన శక్తిరూపిణివి నువ్వు. ఒక క్షుద్రమాంత్రికుని తంత్రాలకు మెచ్చి అనువుగాని వరాలిస్తున్నావే,



ఇది లోకానికి కీడు కాదా? ఆ దుష్టుడి నుండి నీ చూపు మరల్చి నన్ను అనుగ్రహించు. నా కార్య సాధనకు మార్గం చూపు మాతా," అని ప్రార్థించి విగ్రహం ముందు మోకరిల్లాడు.

మోకరిల్లిన యశోధరుడి చేతికి విగ్రహం ముందు నేల డొల్లగా తగిలింది. చప్పున లేచిన యశోధరుడు చేతితో ఆ ప్రదేశంలో కొట్టి చూశాడు. డొల్ల శబ్దం స్పష్టంగా తెలిసింది. ప్రసన్న వదనంతో కాళికామాతకు నమస్కరించి ఆ డొల్ల ప్రాంతాన్ని తనకత్తితో ఛేదించి చూశాడు. లోపల ఒక పొడవైన పెట్టె కనిపించింది. యశోధరుడు ఉత్సాహంతో ఆ పెట్టెను బయటకు తీశాడు. ఆ పెట్టెను

సంరక్షించేందుకు నాగబంధం వేసినట్టుగా పెట్టె మీద సర్పముద్రలు సూచిస్తున్నాయి. నిధి నిక్షేపాలు భద్రపరిచేందుకు వేసే బంధాల్లో నాగబంధం అత్యంత ప్రమాదకరమైనది. దానిని అనుచిత మార్గంలో ఛేదించే ప్రయత్నం చేసేవారికి తక్షణ మరణం తప్పదు. ఆ విషయం గ్రహించి యశోధరుడు కాస్త నిరాశపడ్డాడు. ఇంతలోనే అతనికి తన గురువు చెప్పిన ఒక విషయం స్ఫురించింది. నాగబంధం వేసిన నిధిని సక్రమమైన మార్గంలో పొందేందుకు పాటించాల్సిన నియమాలు తప్పకుండా ఒక శాసనంపై లిఖించి ఉంటాయి. ఆ శాసనం తప్పక నిధికి చేరువలోనే ఉంటుంది.

శాసనం కోసం గాలిస్తున్న యశోధరుడికి కాళికామాత చేతిపై ఏవో అక్షరాలు కనిపించాయి. దగ్గరగా వెళ్ళి పరిశీలిస్తే విగ్రహం చేతిపై నాగబంధ శాసనం లిఖించి ఉంది. "తక్షక నాగబంధం వేసిన ఈ పేటికను తెరిచేందుకు సాహసించేవారెవరైనా క్షణాల్లో భస్మం కాక తప్పదు. ధర్మ రక్షణార్థం నిస్వార్థ కార్యానికై వచ్చి ఈ శక్తిని పొందగోరేవారు మొదట గరుడమంత్రం పఠించి గరుత్మంతుని ప్రసన్నం చేసుకోవాలి. పిదప నాగబంధాన్ని ఛేదించాలి. హెచ్చరిక! సక్రమంగా నాగబంధం ఛేదించినప్పటికీ రక్తతర్పణ తప్పదు. సర్పగండం వంశపారంపర్యంగా వెంటాడక తప్పదు!" అని శాసనంలో ఉంది.

యశోధరుడు దీర్ఘాలోచనలో పడ్డాడు. ధర్మరక్షణార్థం తనకు ఈ శక్తి ఎంతో మేలు చేస్తుంది. కాబట్టి నాగబంధాన్ని ఛేదించక తప్పదు. కానీ దీని వల్ల తన వంశమంతా సర్పగండానికి లోనవుతుంది. యశోధరుడు ఈ ఆలోచనలతో ఉండగా కాళికామాత విగ్రహంలో చలనం మొదలయ్యింది. "కుమారా యశోధరా, మార్గాంతరం చెబుతాను విను. నాగబంధాన్ని విడిపించేందుకు రక్తతర్పణ తప్పదు. దాని కోసం నువ్వో, నీ వంశస్థులో సర్పగండానికి లోనయితే అటుపైన నువ్వు చెయ్యగలిగే ధర్మరక్షణ ఇంకేముంది? అందుకే నీకోసం, ఈ లోకం కోసం ప్రాణత్యాగం చేయగలిగే ఒక మానవుడిని ఎన్నుకో. మందిరం బయట ఉన్న బోయలైనా, ఇక్కడున్న గారడివాడైనా నీకోసం ఆమాత్రం త్యాగం చెయ్యరా?" అని పలికింది కాళికామాత. ఆ మాటలు విని "దేవి ఆజ్ఞ అయ్యింది, నేను సిద్ధం సోదరా! సంకోచించకు," అని పంజరంలో ఉన్న మల్లన్న దృఢచిత్తంతో పలికాడు.

యశోధరుడు ఒక నిర్ణయానికి వచ్చి, దేవి విగ్రహం ముందు పద్మాసనం వేసుకుని స్థిరచిత్తంతో, ఏకాగ్రతతో గరుడమంత్రాన్ని ముమ్మారు జపించాడు. గరుడముద్ర చేతనమైనట్టుగా యశోధరుడికి ప్రస్ఫుటంగా తెలిసింది. సంతృప్తితో గరుత్మంతునికి మనస్సులో నమస్కరించుకుని లేచాడు యశోధరుడు. ఆ మరుక్షణమే దేవి ముందున్న హోమగుండాన్ని శుభ్రపరిచి అక్కడ చితిని ఏర్పాటు చేశాడు. ఆ చితిని వెలిగించి కాళికామాతకు నమస్కరించి “మాతా, ధర్మరక్షణకే అయినా నమ్మి వెంట నడిచిన వారిని, ఆశ్రితులను బలివ్వలేను. నేనే ఆత్మత్యాగం చేసి ఈ ఆయుధానికి విమోచన కలిగిస్తాను. అటుపైన ధర్మరక్షణార్థం ఈ ఆయుధం తగిన వీరుని చేతులలోకే వెళ్తుందన్న నమ్మకం నాకుంది,” అని చెప్పి చితిలో దూకేందుకు యశోధరుడు సిద్ధమయ్యాడు.

యశోధరుడు హోమగుండంలో దూకగానే మంటలు ఆరిపోయాయి. కాళీమాత విగ్రహం నుండి “కుమారా! నీ త్యాగనిరతి, ధర్మపాలన అమోఘం. నీకు జయమగు గాక,” అని ఆశీర్వదించింది. వెంటనే నాగబంధం విడిపోయింది. సంతోషించిన యశోధరుడు ఆ పెట్టెను తెరిచాడు. పెట్టెలో నుండి మిరుమిట్లు గొలిపే కాంతి వచ్చి ఆ మందిరం మొత్తం ప్రకాశవంతమయ్యింది. ఆ కాంతిని చూడలేక యశోధరుడు, దూరంగా పంజరంలో ఉన్న మల్లన్న కళ్ళు మూసుకున్నారు. ఆ కాంతికి అలవాటు పడ్డాక ఆయుధం వైపు చూశాడు యశోధరుడు. తను విన్న కథల్లో వర్ణనలను మించి మిక్కిలి ప్రకాశవంతంగా, ఆకర్షణీయంగా కనిపించింది వజ్రాయుధం.

యశోధరుడు ఆయుధాన్ని అందుకునేంతలో ఆ పెట్టెలో నుండి ఒక సర్పం బుస్సున పడగ విప్పింది. యశోధరుడు నిశ్చేష్టుడై చూస్తూ స్థాణువులా ఉండిపోయాడు. ఆ సర్పం మానవభాషలో “ఇది దేవతలకు ప్రభువైన ఇంద్రునికి విజయం అందించిన వజ్రాయుధ సాదృశ్యం. దైవాంశసంభూతులకే కాని అన్యులకు దీన్ని ధరించటం సాధ్యం కాదు,” అని హెచ్చరించింది.

ఆ మాటలు విన్న యశోధరుడు నీరుగారిపోయాడు. ఈ ఆయుధాన్ని వెతుక్కుంటూ ఇంత దూరం వచ్చి పడిన శ్రమంతా వృథా అయిపోయిందే అని బాధపడ్డాడు. పంజరంలో ఉన్న మల్లన్నకు అక్కడ జరుగుతున్న ఏ సంఘటన సామాన్యంగా కనిపించటం లేదు. అతని జీవితంలో అత్యంత ఉద్విగ్న క్షణాలను

అనుభవిస్తూ, క్షణానికొకటిగా ఆవిష్కృతమవుతున్న ఆ వింతలను చూస్తూ ఉండిపోయాడు.

మల్లన్నను మరింత విస్మయానికి గురిచేస్తూ, అతని భుజం మీద అంతవరకూ కూర్చున్న చిలక ఎగిరి పంజరం బయటకు వచ్చి "యశోధరా, నిశ్చింతగా ఆ ఆయుధాన్ని ధరించు. నువ్వు సామాన్య మానవుడవు కావు. అన్యులెవరూ ఎరుగని నీ జన్మ వృత్తాంతం చెబుతాను విను. శాపవశాన పక్షిగా బతుకుతున్న నేను సింహనాధుడనే గంధర్వుడను. నీ తండ్రి విద్యాధరుడు నా సహాధ్యాయి. సకల విద్యలలోనూ అమోఘమైన పాండిత్యం సాధించిన నీ తండ్రికి ఎందులోనూ సంతృప్తి దొరికేది కాదు. గంధర్వలోక కాంతలంతా తన చేయిపట్టి నడిచేందుకు ఉవ్విళ్ళూరే వారు. కానీ ఆయన అందరినీ తృణీకరించాడు. తనకి నిజమైన తృప్తి ఎక్కడ దొరుకుతుందా అని సమస్త లోకాలు గాలించేవాడు. అలా ఆయన ఒకనాడు భూమి మీదకి వచ్చాడు.

"అడవులు, అరణ్యాలు, పర్వతాలు, రాజ్యాలు గాలిస్తూ తిరుగుతున్న అతని మనుసుని ఏవీ ఆకట్టుకోలేకపొయాయి. అలా దేశసంచారం చేస్తున్న నీ తండ్రి మొట్టమొదటిసారిగా సింహళ రాజకుమారి విజయవర్ధినిని చూసి ఆకర్షణకు లోనయ్యాడు. ఈ పదునాలుగు లోకాల్లో సకల విద్యలలో, అందచందాల్లో నీ తండ్రికి సరితూగ గలిగే కాంత ఆమె మాత్రమే. ఆమె సౌందర్యానికి, తెలివితేటలకి ముగ్ధుడైన నీ తండ్రి ఆమెను వివాహం చేసుకున్నాడు.

"రాచరికపు సుఖాలపై మమకారం లేని ఆ ఇరువురు రాజ్యాన్ని విడిచి ఏ సుందర వనాల్లోనో విహరించేవారు, ఏ పర్వత సానువుల్లోనో నివసించేవారు. ఒక రోజు ఉన్నచోట మరో రోజు ఉండేవారు కాదు. నిత్యం కొత్త అందాలను అన్వేషిస్తూ ప్రకృతిని ప్రేమించి, ప్రకృతిలో మమేకమై జీవించేవారు. అలా ఏడాదిపాటు ఎంతో అందమైన జీవితాన్ని గడిపారు. వారిద్దరి ప్రణయఫలంగా నువ్వు పుట్టావు.

"కానీ నువ్వు పుట్టగానే నీ తల్లి మరణించింది. గత జన్మలలో మిగిలిన ఏ కొద్ది కర్మఫలాన్నో అనుభవించటానికి మానవజన్మనెత్తిన నీ తల్లి అత్యంత పిన్న వయస్సులోనే శివైక్యాన్ని పొందింది. తన ప్రియాతిప్రియమైన ప్రాణసఖి వియోగంతో దుఃఖితుడైన నీ తండ్రి ప్రాపంచిక విషయాలలో విరక్తి చెంది,

నిన్ను అరణ్యంలో బిల్వకముని ఆశ్రమంలో విడిచి తపోవనాలకు వెళ్ళిపోయాడు. ఆ ఆశ్రమంలో పసికూనగా పడున్న నిన్ను చూసిన బిల్వకమునీంద్రులు, పిల్లలు లేక అల్లాడుతున్న నక్కలదొరకు ఇచ్చి పెంచమన్నారు. నువ్వు తల్లిదండ్రులనుకుంటున్న వారు నిజానికి నీ పెంపుడు తల్లిదండ్రులు మాత్రమే," అని చెప్పింది. ఈ వృత్తాంతం పూర్తయిన మరుక్షణం ఆ చిలుక ఒక గంధర్వునిగా మారిపోయింది. ఆ దృశ్యాన్ని చూసి మరోమారు ఆశ్చర్యపోవటం మల్లన్న వంతయ్యింది.

* * *

యశోధరుడు వినయంగా సింహనాధునికి నమస్కరించి "నా పితృదేవుల సహాధ్యాయి అయిన మీరు నాకు పూజనీయులు. మహాత్మా, నా ప్రయాణం ఆద్యంతం ఎన్నో రహస్యాలను ఛేదిస్తూ, వింతలను ఆవిష్కరిస్తూ సాగుతోంది. నా జన్మవృత్తాంతం తెలియజేసినందుకు మీకు కృతజ్ఞుడను. మీరు నాకు ఇలా తటస్థించి ఉండకపోతే నా జన్మ వృత్తాంతం ఎప్పటికీ రహస్యంగానే మిగిలిపోయేది. మీ మేలు మరువలేను. అయినా నాకొక సందేహం. మీరు ఈ దురవస్థను ఎలా పొందారు?" అని అడిగాడు.

"యశోధరా, మానవ జీవితంలోని లోటుపాట్లు, కష్టాలు, సుఖాలు, కోరికలు, లక్ష్యాలు, వాటి కోసమే చేసే సాహసాలు- ఇన్ని అందమైన పార్శ్వాలుంటాయి. కానీ మా లోకంలో ఆద్యాంతాలుండవు, కష్టసుఖాలు ఉండవు. స్థల, కాలాల ప్రశ్న లేకుండా ప్రతినిత్యం సంగీతం, సురాపానం, నాట్యం మాత్రమే నిండి ఉంటాయి. కార్యం, కార్యసాధన ఉన్నవాడు త్రికరణ శుద్ధిగా తన కార్యంలో నిమగ్నమై ఉంటాడు. ఏ కార్యం లేనివాడు, నిత్యం మధుపానంలో మునిగేవాడు విచక్షణ లేక వర్తించి తన స్థాయిని కోల్పోతాడు. అందుకే ఎంతటి వైభవమైన జీవితం గడుపుతున్నవాడైనా తనకిష్టమైన ఏదో ఒక కార్యంలో నిమగ్నమై ఉండాలి. అప్పుడే మనసు, శరీరం స్వచ్ఛంగా ఉంటాయి. ఈ విషయాన్ని తెలియజేసే నా కథ చెబుతాను విను.

"నేను చిన్ననాటి నుండి తుంటరి పనులలో మిక్కిలి ఆసక్తి కలిగి ఉండేవాడిని. తల్లిదండ్రులకు, పరిచారికలకు శ్రమ కలిగిస్తూ ఉండేవాడిని. నా

అల్లరి భరించలేని నా తండ్రి వేదకంఠముని అనే ఒక శ్రేష్టమైన గురువు దగ్గర సకల విద్యలు అభ్యసించేందుకు నన్ను పంపించారు. ఆ మునీంద్రుల ఆశ్రమంలోనే నీ తండ్రి నాకు సహాధ్యాయి. నీ తండ్రికి విద్యపై ఆసక్తి మెండు, గురువుల పట్ల ఉన్న భక్తితో చాలా తక్కువ సమయంలో సకల విద్యలను అభ్యసించి గురుకులం నుండి వెళ్ళిపోయాడు. కానీ ఏకాగ్రత, స్థిరచిత్తం లేని నేను విద్యాభ్యాసం పూర్తి చెయ్యలేక ఆ ఆశ్రమంలోనే ఎంతోకాలం ఉండిపోయాను.

"ఆ ఆశ్రమంలో గురువుగారి ఆంతరంగికమైన పర్ణశాలల సమూహం ఒకటుంది. గురువుగారు అక్కడ నివసించేవారు. ఆ పర్ణశాలలకు దూరంగా గురుకులం ఉండేది. గురుకులంలోనే విద్యార్థులకు వసతి ఉండేది. విద్యార్థులకు గురువుగారి పర్ణశాలల వైపు వెళ్ళటం కాని, అటువైపు చూడటం కాని నిషిద్ధం. చిన్న వయస్సులో ఆ నియమాలను ఎప్పుడూ తర్కించలేదు. కానీ యుక్త వయస్సుకు వచ్చిన తర్వాత ఇందులో ఏదో రహస్యం దాగి ఉందని అనిపించింది. గురువుగారు నేర్పే విద్యలకు మూలమైన రహస్యాలు అక్కడే ఉండొచ్చని అనుకున్నాను. ఆ రహస్యం తెలుసుకుంటే కష్టపడవలసిన అవసరం లేకుండా సకల విద్యలు సునాయసంగా చేజిక్కుతాయనే కుటిల ఆలోచన కలిగింది.

"ఒకనాడు ప్రాతఃకాలమే గురువుగారు స్నానమాచరించేందుకు సరస్సుకి వెళ్ళిన సమయంలో నేను ఆ పర్ణశాలల సమీపంలో చెట్ల మాటున నక్కి గమనిస్తూ కూర్చున్నాను. స్నానమాచరించేందుకు వెళ్ళిన గురువుగారు తిరిగి వచ్చారు. ఆయన పర్ణశాలలో అడుగుపెడుతుండగా లోపల నుండి ఒక అందమైన యువతి బయటకు వచ్చింది. చేతులకు, కాళ్ళకు పూలమాలలను ధరించి ఉందామె. మెడలో పూలదండను ధరించి మునికన్యలా ఉంది. నేను ఎప్పుడూ ఆశ్రమంలో స్త్రీలను చూసి ఉండలేదు. అసలు స్త్రీలు ఆశ్రమంలో ఉన్నట్టు ఎవరికీ తెలియదు. ఎవరామె అనే కుతూహలం నాలో కలిగింది.

"అప్పటి నుండీ ప్రతిరోజూ గురువుగారు లేని సమయంలో అటుగా వెళ్ళి ఆమెను గమనిస్తూ ఉండేవాడిని. ఆమె ఎప్పుడూ పర్ణశాల దాటి బయటకు వచ్చేది కాదు. ఆమెను బయటకు రప్పించాలని నేను ఎన్నో ప్రయత్నాలు చేసేవాడిని. పక్షుల్లా, జంతువుల్లా శబ్దం చెయ్యటం, పర్ణశాల వాకిట్లో పువ్వులు, ఆకులు చల్లటం, రాళ్ళు వెయ్యటం– ఇలా ఎన్ని చేసినా ఆమె బయటకు వచ్చేది కాదు.



"ఒకనాడు గురువుగారు లేని సమయంలో సాహసించి నేను పర్ణశాలలో జొరబడ్డాను. గురువుగారి పూజకు ఏర్పాట్లు చేస్తున్న ఆమెను చూశాను. నేను అచ్చెరువొంది శిలలా నిల్చుండిపోయాను. ఆమెది అతిలోక సౌందర్యం. గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషాది లోకాల్లో ఎన్నడూ అంతటి సౌందర్యాన్ని నేను చూసి ఉండలేదు. ఆమె సాధారణ స్త్రీ కాదని, ఏ దేవకాంతో అని గ్రహించాను. ఇంతలో అమె నన్ను చూసి తత్తరపాటుకి గురయ్యింది.

"నేను వెంటనే ఆమెను క్షమించమని ప్రాధేయపడ్డాను. నేను గురువుగారి శిష్యుడనని, ఇక్కడ స్త్రీలు ఉంటారని ఊహించలేదని, కేవలం గురువుగారు మాత్రమే ఉంటారని భావించి వచ్చానని అసత్యం పలికాను. ఈ విషయం

గురువుగారికి తెలియనివ్వొద్దని అభ్యర్థించాను. ఆమె నా దీనావస్థకు జాలిపడి ఈ విషయాన్ని గురువుగారికి చెప్పనని నాకు మాట ఇచ్చింది. అలానే తన విషయం ఆశ్రమంలో ఎవరికీ తెలియనివ్వొద్దని హెచ్చరించింది.

"జాలిపడిన సున్నిత మనస్కులంటే లోకానికి ఎంత పలచనో! ఆ సున్నితత్వాన్నే తమ అవకాశంగా మలచుకొంటారు. ఆమె నాకు హాని కలగనివ్వదనే నమ్మకం కలిగి ప్రతిదినం గురువుగారు లేని సమయంలో వెళ్ళి ఆమెతో స్నేహం నటించేవాడిని. ఆమె నన్ను నమ్మి తన వృత్తాంతం చెప్పింది.

"లోకమాత అయిన పార్వతిపై పరమేశ్వరునికి ప్రణయం కలిగేందుకు పుష్పశరధారి మన్మధుడు ఒక పూలబాణాన్ని వేశాడు. ఏకాగ్రత చెదిరిన పరమశివుని ఆగ్రహానికి లోనైన మన్మధుడు భస్మమై రూపంలేనివాడిగా మిగిలాడు. దేవతలందరి సమక్షంలో మంగళకరంగా పార్వతీపరమేశ్వరుల వివాహం జరిగింది. ఆ ప్రణయానికి కారణమైన పూలబాణాన్ని పార్వతీపరమేశ్వరులు హిమాలయాల్లో ఒక సరస్సులో విడిచారు. తపోదీక్షలో ఉన్న మా గురువుగారు ఒకనాడు హిమాలయాలకు వెళ్ళి ఆ సరస్సులో సంధ్యావందనం చేస్తుండగా, ఆయన దోసిలిలోకి ఆ పూలబాణం వచ్చింది. దివ్యదృష్టితో ఆ బాణం గురించి తెలుసుకున్న మా గురువుగారు లోకేశ్వరునికి, లోకమాతకి మధ్య ప్రణయకారణమైన ఈ పూల శరం ఎంత మనోహరమైనదో అని యోచించారు. ఆయన మనస్సులో ఆ ఆలోచన కలిగిన వెంటనే ఆ బాణం ప్రాణం పోసుకుని లోకోత్తర సౌందర్యరాశిగా అవతరించింది.

"శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు కదా. ఈ చర్యకు ఎటువంటి కారణముందో అని భావించిన గురువుగారు 'కుమారీ, తల్లిదండ్రులు లేకుండా జన్మించినదానవు. నీకు ఏ శృంఖలాలూ లేవు. నువ్వు స్వేచ్ఛాజీవివి. ఈ జగమంతా నీదే. నీకు ఇష్టమైన జీవనాన్ని నువ్వు గడపవొచ్చు. నీకిష్టమైన వారిని వరించవచ్చు,' అని ఆమెను ఆశీర్వదించారు. కానీ ఆమె 'లోకేశ్వరునికి ప్రణయకారణమైన నేను వేరొకరిని వరించలేను, లోకకళ్యాణానికి సాక్షినైన నాకు వేరు వాంఛలు లేవు. నా జన్మకు కారణమైన తమను తండ్రిగా భావించి మీ సేవలోనే గడుపుతాను,' అని ప్రార్థించింది. ఆమె మాటను మన్నించి గురువుగారు ఆశ్రమానికి తీసుకుని వచ్చారు. అనితర సాధ్యమైన ఆమె సౌందర్యం బయటకు

తెలిస్తే ఆమె ఏకాంతానికి భంగమని భావించిన గురువుగారు ఆమెను ఎవరికీ కనబడనివ్వకుండా ఉంచారు.

"ఈ వృత్తాంతం తెలుసుకున్న పిమ్మట నాకు అమిత గర్వం కలిగింది. లోకోత్తర సౌందర్య రాశి రహస్యం తెలుసుకోగలిగానన్న అహంకారంతో, ఆమెకిచ్చిన మాటను మరిచి, నా గొప్పతనాన్ని చాటుకునేందుకు ఈ రహస్యం ఆశ్రమంలో ఉన్న మిగిలిన వారందరికీ చెప్పాను. అప్పటి నుండి అందరూ ఆమెను చూసేందుకు పోటిపడసాగారు. ఆమె ఏకాంతానికి భంగం కలగటం మొదలయ్యింది. విషయం తెలుసుకున్న గురువుగారు దీనికి కారణమైన నన్ను ఆశ్రమం నుండి బహిష్కరించారు.

"ఆ శిక్ష నన్ను బాధించలేదు. నన్ను విముక్తుడిని చేసింది. నేను గంధర్వలోకం చేరి భోగలాలసుడిగా జీవించటం మొదలుపెట్టాను. ఒక రోజు మదిరమత్తులో గురువుగారి ఆశ్రమానికి వెళ్ళి ఆమెను గాంధర్వ వివాహం చేసుకుంటానని అడిగాను. ఆమె తృణీకరించింది. మత్తులో విచక్షణను కోల్పోయిన నేను ఆమె చేతిని పట్టుకున్నాను. నాలాంటి నీచుడి, అల్పుడి స్పర్శకు లోనైన ఆమె ఆవేశంతో ఆ క్షణమే తన రూపాన్ని త్యజిస్తున్నట్టుగా పలికింది. నన్ను కూడా నా రూపాన్ని కోల్పోయి పక్షిగా బతకమని శపించింది.

''మత్తు వీడిన నేను ఆమెను ప్రాధేయపడ్డాను. శాపాన్ని ఉపసంహరించుకోమని అడిగాను. తప్పుకి తగిన దండన తప్పదని, శాపం తిరిగి వెనక్కి తీసుకోలేనని ఆమె చెప్పింది. కనీసం శాపవిమోచన మార్గాన్ని ఉపదేశించమని వేడుకున్నాను. లోకకళ్యాణార్థం జరిగే ఏ కార్యంలోనైనా సహాయం చెయ్యటం ద్వారా తిరిగి నా రూపాన్ని పొందగలనని చెప్పి ఆమె తిరిగి పుష్పబాణంగా మారిపోయింది.

"యశోధరుడా, నేడు నీకు సహాయం చేయటం ద్వారా నేను నా రూపాన్ని తిరిగి పొందగలిగాను," అని తన వృత్తాంతాన్ని యశోధరుడికి వివరించాడు సింహనాధుడు.

సింహనాధుడి కథ విన్నాక యశోధరుడు, మల్లన్న కాసేపు మాట్లాడలేక పోయారు. అడవిలో అమాయకులైన నేస్తాలతో ఆటలు, ఆశ్రమంలో గురువుగారి వద్ద శ్రద్ధగా నేర్చుకునే విద్యలు మాత్రమే జీవితమనుకునే యశోధరుడికి ఈ

ప్రయాణం నిండా ఎన్నో కొత్త అనుభవాలు, అనుభూతులు. ఎన్నెన్నో కథలు, ఏవేవో రహస్యాలు, బాహ్యలోకపు వృత్తాంతాలు ఎదురై ప్రపంచం, జీవితం అనే ఊహలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాయి. ఆలోచనల్లో మునిగిపోయిన యశోధరుడికి తన గురువు తనను ఈ కార్యానికి పంపటం యాదృచ్ఛికం కాదని, తన విద్యాభ్యాసంలో ఇది కూడా భాగమేనని తోచింది. నిజమైన గురువు తన శిష్యుడికి కేవలం తనకు తెలిసిన విద్యలు మాత్రం బోధించి వదిలేయడని, జీవితంలో పరిపూర్ణ విజేతగా నిలిచేంతవరకు శిక్షణనిస్తాడని అతనికి అవగతమయ్యింది. మనస్సులోనే తన గురువుకి నమస్కరించాడు.

సింహనాధుడు తన మాయతో ఆ మందిరంలో ఒక కొలను సృష్టించాడు. యశోధరుడిని ఆ పవిత్ర జలాల్లో స్నానమాచరించమని చెప్పాడు. యశోధరుడు తన స్థబ్దతను వీడి సింహనాధుడు చెప్పినట్టే ఆ కొలనులో స్నానమాచరించి పరమశివునికి, తన మాతాపితరులకు, ఆచార్యులకు, తన గమనంలో సహాయపడిన శ్రేయోభిలాషులకు అంజలి ఘటించి కొలను నుండి బయటకు వచ్చాడు. కాళికా మాతకు సాష్టాంగపడి ఆమె ఆశీస్సులు పొందాడు. సింహనాధుడు పేటికను సమీపించి వజ్రాయుధానికి నమస్కరించి, మనస్సులో ఇంద్రుడిని ధ్యానించి ఆ ఆయుధాన్ని యశోధరుడికి అందించాడు. యశోధరుడు వినమ్రంగా తన రెండు చేతులతో ఆ వజ్రాయుధాన్ని అందుకుని "మహా ప్రసాదం," అని కళ్ళకద్దుకున్నాడు.

ఆయుధం చేతిలో ఇమడగానే యశోధరుడిలో కొత్త శక్తి ప్రవేశించింది. అతడు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు. అతడిప్పుడు సామాన్య మానవుడిలా కనిపించటం లేదు. ఇలకు దిగివచ్చిన ఇంద్రుడిలా ప్రకాశిస్తున్నాడు. మహాశక్తిని పొందిన అహంకారం అతడిలో ఇసుమంతైనా లేదు. మరింత వినయశీలుడై, స్వచ్ఛమైన నవ్వుతో, పవిత్రమైన మనస్సుతో మానవరూపాన్ని పొందిన దైవాంశ సంభూతినిలా కనిపిస్తున్నాడు.

''యశోధరా, ఆపత్సమయాల్లో నన్ను స్మరించు. నీకు తప్పక సహాయపడగలను. విజయోస్తు,'' అని దీవించి సింహనాధుడు అంతర్ధానమయ్యాడు.

"విజయోస్తు సోదరా! విజయోస్తు," అని మల్లన్న పట్టలేని ఆనందంతో

అరిచాడు. ప్రసన్న వదనంతో యశోధరుడు మల్లన్న బందీగా ఉన్న పంజరం వద్దకు నడిచాడు. తన వజ్రాయుధంతో పంజరాన్ని తాకాడు. అంతే, పంజరం పెద్ద శబ్దంతో తునాతునకలయిపోయింది. పంజరం చెర నుండి బయటపడిన మల్లన్న అమితమైన ఆనందంతో, కృతజ్ఞతతో యశోధరుడి పాదాలు తాకబోయాడు. యశోధరుడు చప్పున అతడిని వారించి గాఢాలింగనం చేసుకున్నాడు.

"మిత్రమా, ఈ ఘనత నాది కాదు. పరిపూర్ణంగా నీది. నువ్వు చెప్పిన మందిర రహస్యాలు, నీ వెంట తీసుకువచ్చిన చిలుక ఈ అదృష్టాన్ని నాకు సిద్ధింపజేసాయి. నేనే నీకు కృతజ్ఞుడనై ఉండాలి. నా ఈ గమనంలో నేను వాహకాన్ని మాత్రమే. నీవంటి మిత్రులే నిజమైన కర్తలు," అని తన మనస్సులో మాటలు చెప్పాడు యశోధరుడు.

* * *

పంజరం బద్దలుకావటంతోనే మందిరంలో ఏదో విపత్తు సంభవిస్తోందన్న సంకేతం కాళభైరవునికి చేరింది. తన శిష్యగణంతో సహా మందిరంలో ప్రత్యక్షం అయ్యాడు. అతడి వెంట ఒక నాగకన్య, దేవకన్య కూడా ఉన్నారు. వారిరువురూ కాళభైరవుడి సమ్మోహనశక్తికి లోబడి బందీలుగా ఉన్నారు. జరిగినది సమస్తం అవగతం చేసుకున్నవాడై "చూడు బాలకా, నీకు కావాల్సిన కార్యం సిద్ధించింది. ఇక తక్షణం ఈ మందిరం వీడి వెళ్ళు. లేకుంటే నీ ప్రాణాలకే ప్రమాదం సుమా," అని యశోధరుడిని హెచ్చరించాడు కాళభైరవుడు.

మల్లన్న భయంతో కంపించిపోతూ యశోధరుడి వెనకకుచేరి "సోదరా, వాడే కాళభైరవుడు," అని లోగొంతుతో చెప్పాడు. మల్లన్న భయాన్ని గమనించిన యశోధరుడు చిరునవ్వు నవ్వి అభయమిచ్చాడు.

"కాళభైరవా, సృష్టి నియమాలను అతిక్రమించి అసహజమైన కోరికలతో క్షుద్రదీక్షలు చేసి ఇప్పటికే పాపం మూటకట్టుకున్నావు. ఈ వందమంది రాకుమార్తెల కుటుంబాలు ఎంత శోకం అనుభవిస్తున్నాయో. ఆ అమాయకుల కన్నీరు కార్చిచ్చుగా మారి నిన్ను దహించకముందే ఈ ఉన్మాదం వీడు. నీకు, లోకానికి శ్రేయస్సు కలుగుతుంది," అని యశోధరుడు హితవు పలికాడు.

తనని చూసి ఏమాత్రం భయపడకపోగా, తన హెచ్చరిక విని కూడా ఏ మాత్రం చలించక తనకే హితబోధ చేస్తున్న యశోధరుడి ధైర్యం చూసి కాళభైరవుడికి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. “బాలుడవని ఉపేక్షించాను. నా రహస్యాలు తెలిసిన ఏ జీవీ మనజాలదు. కాసుకో,” అని కాళభైరవుడు తన మంత్రదండంతో ఒక వికృతాకారుడైన రాక్షసుడిని సృష్టించాడు.

ఆ రాక్షసుడు తాటి చెట్టంత ఎత్తుండి, తన నల్లని భారీ శరీరంతో సరాసరి యశోధరుడి మీదకు దూకాడు. యశోధరుడు తృటిలో తప్పించుకుని పక్కనే ఉన్న ఎత్తైన మంటపం మీదకి ఎగబాకాడు. రాక్షసుడు తన ముళ్ళగదతో యశోధరుడి మీదకు దాడికి వచ్చాడు. యశోధరుడు తన చేతిలో ఉన్న వజ్రాయుధంతో ఆ దెబ్బను అడ్డుకున్నాడు. వజ్రాయుధాన్ని తాకిన వెంటనే ఆ ముళ్ళగద ముక్కలుగా విరిగిపోయింది. ఆ ఊపుకి పట్టుతప్పిన రాక్షసుడు తూలిపడ్డాడు. యశోధరుడు మెరుపులా కదిలి రాక్షసుడు తేరుకునేలోపే అతడి కంఠాన్ని ఛేదించాడు. పెద్దగా అరుస్తూ రాక్షసుడు ప్రాణాలు విడిచాడు.

ఆ దృశ్యం చూసి ఆవేశంతో ఊగిపోతూ కాళభైరవుడు తన మంత్రదండంతో పెద్ద అగ్నిగోళాల్ని సృష్టించాడు. అవి భగభగమని దొర్లుకుంటూ యశోధరుడి వైపు దూసుకువచ్చాయి. యశోధరుడు తన వజ్రాయుధంతో వాటిని సునాయసంగా నిలువరించాడు. కాళభైరవుడు ఈసారి భయంకరమైన వ్యాఘ్రాన్ని సృష్టించాడు. అది యశోధరుడి మీదకు ఒక్క ఉదుటున దూకింది. ఆసరికే అప్రమత్తుడైన యశోధరుడు తన ఖడ్గాన్ని సరాసరి వ్యాఘ్రం నుదుట నాటుకునేలా పట్టుకున్నాడు. యశోధరుడి మీదకు శక్తి మీరా ఉరికిన వ్యాఘ్రం నుదుట వజ్రాయుధం దిగబడింది. వ్యాఘ్రం కుప్పకూలింది.

దిక్కుతోచని కాళభైరవుడు కాళికను ప్రార్థించి ఆయుధమిమ్మని కోరాడు. తన ఉపాసకుడైన కాళభైరవుని కోరిక కాదనలేని కాళిక అతడికి ఒక శక్తిమంతమైన ఖడ్గాన్ని ప్రసాదించింది. కానీ ఒక షరతు విధించింది. “కాళభైరవా, నా ఉపాసకుల రక్తం మాత్రం ఈ ఖడ్గంపై చిందకూడదు. అలా జరిగితే ఆయుధం నిర్వీర్యమవుతుంది. కాబట్టి నీ రక్తం ఆయుధం మీద పడకుండా చూసుకో,” అని హెచ్చరించింది.

కాళభైరవుడు రెట్టించిన ఉత్సాహంతో యశోధరుడిపై దాడికి వచ్చాడు.

యశోధరుడు కూడా సమరోత్సాహంతో కదిలాడు. ఇద్దరి మధ్య ఘోర ద్వంద్వ యుద్ధం మొదలయ్యింది. ఖడ్గాలు రెండూ ఒకదానినొకటి తాకినంతనే నిప్పులు ఎగసి పడుతున్నాయి, మందిరం భయంకరమైన శబ్దాలతో కంపించిపోసాగింది.

ఆలయం బయట వేచి ఉన్న గట్టయ్య ఆ శబ్దాలకు ఉలిక్కిపడి, యశోధరుడిని ఒంటరిగా పంపినందుకు కించిత్ విచారించాడు. యశోధరుడికి తోడుగా లోపలకు పోవాలని అతడికి అనిపించింది. కానీ యశోధరుడు వారిని అక్కడే ఆగమన్నాడు. ఏం చెయ్యాలో తోచక సందిగ్ధావస్థలో కొట్టుమిట్టాడుతూ నిల్చుండిపోయాడు గట్టయ్య.

మందిరంలో ఉన్న మల్లన్న ఉత్కంఠతో ఆ పోరాటాన్ని చూస్తున్నాడు. యశోధరుడు, కాళభైరవుడు ఇద్దరూ మిక్కిలి తెగువతో పోరాడుతున్నారు. గంటలు గడిచిపోతున్నాయి కానీ పోరు ఆగలేదు. ఇద్దరిలోనూ శక్తి క్షీణిస్తోంది. అయినా ఎవరూ వెనకంజ వెయ్యటం లేదు. ఒక క్షణం కాళభైరవుడిదే ఆధిక్యం అనిపిస్తుంది, మరుక్షణంలో యశోధరుడు పుంజుకుని మెరుపుదాడి చేస్తున్నాడు. కాళభైరవుడి శిష్యులంతా ఊపిరి బిగబట్టి, బిక్కచచ్చిపోయి ఆ పోరుని చూస్తూ నిలబడ్డారు.

స్వేదంతో తడిసిపోయిన యశోధరుడు ఒక్క క్షణం పట్టు తప్పి కిందపడ్డాడు. అదే అదనుగా తీసుకుని కాళభైరవుడు ఖడ్గాన్ని సరాసరి యశోధరుడి గుండెల్లో పొడిచేందుకు అనువుగా పట్టుకుని మీదకు దూకాడు. క్షణంలో జరగబోతున్న పరిణామాన్ని గ్రహించిన యశోధరుడు ఒడుపుగా పక్కకు తప్పుకున్నాడు. నునుపుగా, దృఢంగా ఉన్న నేలపైకి గురిపెట్టిన ఖడ్గంతో సహా కాళభైరవుడి శరీర భారమంతా పడేసరికి ఖడ్గం పట్టు తప్పి కాళభైరవుడి చేతి నుండి జారిపోయింది. కాళభైరవుడు ఖడ్గం మీద పడ్డాడు. అతడి అరచేతికి గాయమై రక్తం చిమ్మింది. కాళభైరవుడు ఆ హఠాత్ పరిణామానికి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. కాళిక చెప్పినట్టు అతడి ఖడ్గం శక్తిహీనమై ప్రకాశాన్ని కోల్పోయింది.

యశోధరుడు క్షణకాలం పోరునిలిపి కాళభైరవునికి సమయమిచ్చాడు. ఇకనైనా పోరు ముగిస్తాడేమో అని ఆశించిన యశోధరుడికి ఆశ్చర్యాన్ని కలిగిస్తూ కాళభైరవుడు తన ఖడ్గాన్ని అందుకుని యశోధరుడి మీదకు వచ్చాడు. ఇక ఉపేక్షించి లాభం లేదని గ్రహించిన యశోధరుడు క్షణంలో కాళభైరవుని ఖడ్గాన్ని

తుత్తునియలు చేసి, కాళికామాతను మనస్సులోనే ధ్యానించి కాళభైరవుని శిరస్సుని ఖండించాడు. కాళభైరవుని శిరస్సు ఎగిరి హోమగుండంలో పడి భగ్గుమని భస్మమయ్యింది. తక్షణమే మందిరంలోని గంటలు గణగణ మోగాయి. మందిరంలోని గోడలకు తగిలించి ఉన్న కాగడాలు దేదీప్యమానంగా వెలిగాయి. చెడు నిర్మూలనకు సంకేతంగా ఆ మందిరంలోని చీకట్లను పారదోలుతూ దేవి ముందు అనేక దీపాలు వెలిగాయి. కాళభైరవుడు శిలాప్రతిమలుగా మార్చిన రాకుమార్తెలంతా తిరిగి తమతమ రూపాలను పొందారు. అందరూ ఒక్క గొంతుకతో యశోధరుడిని కీర్తిస్తూ జయజయధ్వానాలు చేశారు.

జరిగిన పరిణామాలన్నీ చూసిన కాళభైరవుని శిష్యులు దిక్కులు పిక్కటిల్లేలా హాహాకారాలు చేస్తూ మందిరం బయటకు పరుగుతీశారు. పలాయనం చిత్తగిస్తున్న కాళభైరవుని శిష్యగణాన్ని చూడగానే గట్టయ్య ముఖంపై చిరునవ్వు తాండవించింది. యశోధరుడు విజయుడయ్యాడని గ్రహించిన గట్టయ్య బోయ యువకులతో మందిరంలోకి ప్రవేశించాడు.

"వీరుడా, ఈ మందిరం చెరను విడిపించేందుకు నువ్వే తగిన వాడవని భావించిన నా నమ్మకం నిజమయ్యింది. మా గూడెంలోని రాబోయే తరాలవాళ్ళు ఆ దేవితో పాటుగా నిన్ను కూడా స్మరించుకుంటారు," అని యశోధరుడిని కీర్తించాడు గట్టయ్య.

అందరి అభినందనలూ వినమ్రంగా స్వీకరించిన యశోధరుడు, గట్టయ్యను సమీపించి "పెద్దయ్యా, నా ఈ విజయంతో మీ గూడేనికి నేను చేసిన మేలుకంటే కూడా, నాకు జరిగిన మేలే అధికం. ఇంత ఉత్కృష్టమైన వజ్రాయుధాన్ని నాలాంటి సాధారణ మానవునికి అందివ్వాలని తలచిన మీ ఉదారతకు సదా కృతజ్ఞుడను. ఇకపైన మీరు ఈ ఆలయంలో యదేచ్ఛగా పూజలు జరుపుకోవచ్చు," అని సంతోషంగా పలికాడు.

గట్టయ్య అక్కడ పెద్దజాతర జరిపించాలని సంకల్పించాడు. ఆ జాతరలో పాలుపంచుకోవాల్సిందిగా యశోధరుడిని కోరాడు. యశోధరుడు తన ముందున్న క్లిష్టమైన బాధ్యతను మనస్సులో ఉంచుకుని తన ప్రయాణాన్ని ఆ ఒక్క రాత్రికి మాత్రం వాయిదా వేసుకోగలనని చెప్పాడు. గట్టయ్య సంబరపడి అక్కడున్న బిల్ల యువకులతో తమ గూడెపు ప్రజలందరినీ తోడ్కొని రావాల్సిందిగా చెప్పి పంపాడు.

కాళభైరవుడి మరణంతో సమ్మోహన శక్తి వీడిన దేవకన్య, నాగకన్య యశోధరుడిని సమీపించి తమ కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు. "నరోత్తమా, నువ్వు చేసిన మేలుకు ప్రతిగా నేను నీకు కామరూప విద్యను కానుకగా ఇస్తున్నాను. కాదనక స్వీకరించి నాకు సంతోషం కలిగించు. నీ క్లిష్ట కార్యాల్లో ఈ విద్య నీకు అక్కరకు వస్తుంది," అని దేవకన్య యశోధరుడిని అభ్యర్థించింది. తటపటాయిస్తున్న యశోధరుడి చేతికి ఒక మణిని ఇచ్చింది. "దీనిని నుదుటిపై పెట్టుకుని స్మరించినంతనే నువ్వు కోరిన రూపాన్ని పొందుతావు," అని చెప్పింది.

"నేను సహితం చిరుకానుకగా నీకు మనోవేగంతో ప్రయాణించగలిగే శక్తినిస్తున్నాను. నువ్వు మనస్సులో తలచుకున్న తక్షణం నువ్వు కోరిన ప్రదేశానికి చేరుకుంటావు. అంతేకాదు నీరు, నిప్పు, గాలి నీ వశమై నీకు సహకరిస్తాయి," అని నాగకన్య చెప్పింది. యశోధరుడు చిరునవ్వుతో దానిని స్వీకరించాడు. వారిద్దరూ యశోధరుడి దగ్గర సెలవు తీసుకుని తమ తమ లోకాలకు వెళ్ళిపోయారు.

ఆసరికి గూడెపు ప్రజలంతా పిల్లా, పెద్ద భేదం లేకుండా సంబరంగా అక్కడకు చేరుకున్నారు. ఆలయం బయటున్న విశాలమైన ప్రదేశం మధ్యలో పెద్ద మంటను వెలిగించారు. ఆడవాళ్ళంతా రుచికరమైన వంటకాలు తయారుచెయ్యటంలో పడ్డారు. పిల్లలంతా చేరి ఆటలాడుకుంటున్నారు. గట్టయ్య, మల్లన్న, యశోధరుడు మంట దగ్గర చేరి సేదతీరుతున్నారు. రాచకన్యలంతా యశోధరుడి వద్దకు వచ్చి అతడు చేసిన మేలుకి పరిపరి విధాల కీర్తించారు. కాళభైరవుడు తమను ఎలా అపహరించాడో చెప్పుకుని బాధపడ్డారు. తమ కుటుంబాలను గుర్తు చేసుకుని కన్నీళ్ళు పెట్టుకున్నారు.

జాలితో యశోధరుడు కదిలిపోయాడు. తన శాంతవచనాలతో అందరికి స్వాంతన కలిగించాడు. వాళ్ళ కుటుంబాల వద్దకు చేరుస్తానని అభయమిచ్చాడు. గట్టయ్యను చూసి "పెద్దయ్యా, నాకు మీ సహాయం కావాలి. నేనే వీరందరినీ వారి వారి రాజ్యాల్లో దించి వచ్చేవాడిని. కాని కార్యార్థినై వెళుతున్న నాకు సమయం సహకరించదు. వీరులైన మీ గూడెపు యువకులను తోడిచ్చి వీరికి సహాయం చెయ్యగలవా?" అని అభ్యర్థించాడు యశోధరుడు.

"వీరుడా, నీ మాట మాకు అమ్మ మాటతో సమానం. నువ్వు చేసే ఈ

మంచిపనిలో ఉడతసాయం చెయ్యటం మాకు ఎంతో ఆనందం. వీరందరిని మా తోబుట్టువులుగా భావించి భద్రంగా వారి తల్లిదండ్రులకు అప్పగిస్తాం," అని మాటిచ్చాడు గట్టయ్య.

జనమంతా ఆ రాత్రి సంబరాల్లో మునిగి తేలారు. రుచికరమైన విందునారగించి, పళ్ళరసాలు తాగి సంతుష్టులయ్యారు. గూడెపు యువతీయువకులంతా ఆ మంట చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. అలసిన అందరూ ఆదమరిచి అక్కడే నిద్రపోయారు.

తెల్లవారగానే గూడెపు ప్రజలంతా తమ గూడేనికి పయనమయ్యారు. గట్టయ్య తగినంతమంది బలిష్టులైన యువకులను నియమించి, రాకుమార్తెలను తీసుకు వెళ్ళేందుకు కావాల్సిన పల్లకీలు చెయ్యమని పురమాయించాడు. రాకుమార్తెలంతా తమ ప్రయాణ ఏర్పాట్లు పూర్తయ్యేవరకూ గూడెంలో బసచేసేందుకు కదిలారు. యశోధరుడు అందరి దగ్గర సెలవు తీసుకున్నాడు. మల్లన్న మాత్రం యశోధరుడి వెంట వస్తానని అభ్యర్థించాడు. తనకు ఎంతో సహాయం చేసిన మల్లన్నను వదిలిపెట్టడం ఇష్టంలేక యశోధరుడు అంగీకరించాడు. వారిద్దరూ కాళికామాతకు నమస్కరించి అక్కడ నుండి ముందుకు కదిలారు.

* * *

యశోధరుడి స్నేహాన్ని పొందగలగిన తన అదృష్టానికి మిక్కిలి ఆనందపడుతూ సంబరంగా అతని వెంట కదిలాడు మల్లన్న. ఉత్సాహం నియంత్రించుకోలేక "సోదరా, మన ప్రయాణమెంత వరకూ?" అని అడిగాడు.

మల్లన్న అత్యుత్సాహానికి నవ్వుకుంటూ "సర్వసిద్ధి మహాముని ఉపదేశానుసారం ఈ దిక్కుగా మనం ప్రయాణం కొనసాగిస్తే సముద్ర తీరాన్ని చేరుకుంటాం. ప్రస్తుతానికి అదే మన ముందున్న గమ్యం," అని చెప్పాడు యశోధరుడు.

"ఈ దిక్కుగా అంటున్నావు, కానీ ఎంత దూరం? ఈ దాపుల సముద్రం ఉన్న మాటే నేనెప్పుడూ వినలేదే," అన్నాడు మల్లన్న. "హీనపక్షం ఒక అరవై యోజనాలు ప్రయాణించాల్సి ఉంటుందేమో," అన్నాడు యశోధరుడు.

ఆ మాట వినగానే మల్లన్న నీరసపడిపోయాడు. నడుస్తున్నవాడల్లా అక్కడే

కూలబడిపోయాడు. "అంత దూరం ఇలా కాలి నడకనే పోవాలా?" అని అడిగాడు మల్లన్న. యశోధరుడు నవ్వుతూ "మరి తప్పదుగా. అయినా నేను ముందే నిన్ను వారించాను. కానీ నువ్వే వస్తానన్నావు," అని మేళమాడాడు.

"ఆహా, నడవలేనని కాదు సుమా. కాకపోతే ఎంత సమయం పడుతుందో, ఏమో? వీలైనంత తొందరగా నువ్వు కార్యం పూర్తిచెయ్యాలిగా అందుకే అడుగుతున్నాను," అంటూ మేకపోతు గాంభీర్యం చూపాడు మల్లన్న. "అబ్బే ఎంత? రోజుకి ఇరవై యోజనాలు నడిస్తే మూడు రోజులు. అంతేగా," అన్నాడు యశోధరుడు.

ఇక బెట్టు చేస్తే కష్టమని తెలుసుకున్న మల్లన్న "సోదరా, ఆ నాగకన్య ఇచ్చిన వరాన్ని ఉపయోగించుకుందాం. మనకి సమయం, శ్రమ రెండు తప్పినట్టే. వరాలను అలా ఊరికే వృథా కానివ్వకూడదు సుమా," అని చెప్పాడు.

అతని అవస్థకు వస్తున్న నవ్వుని ఆపుకుంటూ యశోధరుడు అతని అభ్యర్థనను అంగీకరించాడు. నాగకన్యను మనసులో తలుచుకున్నాడు. ఒక కాంతిలాంటి రూపంతో నాగకన్య అతని ముందు ప్రత్యక్షమయ్యింది. ఆ రూపాన్ని మల్లన్న, యశోధరుడు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు.

"వీరాధివీర, దీనినే సూక్ష్మరూపం అంటారు. మనం ఉన్నచోటనే ఉంటూ, మనసు కోరిన ప్రదేశానికి ఈ సూక్ష్మరూపంతో ప్రయాణించవచ్చు. మీ ఇరువురిని ఎక్కడకు చేర్చాలి?" అని అడిగింది నాగకన్య.

"ఒక మహాత్ముని ఉపదేశానుసారం నేను అత్యవసర కార్యార్థినై ముందుకు సాగుతున్నాను. ఈ దిక్కున ఉన్న సముద్రం మధ్యలో నీరు నీలం రంగు నుండి పచ్చగా మారుతున్న ప్రదేశానికి వెళ్ళాలి," అని చెప్పాడు యశోధరుడు.

నాగకన్య ఏదో మంత్రం జపించి ముమ్మారు చేతిని గాలిలో తిప్పింది. మరుక్షణం ముగ్గురూ గాలిలో తేలుతూ భూమికి ఎంతో ఎత్తున ప్రయాణించసాగారు. మల్లన్న అబ్బురంగా కింద కనబడుతున్న దృశ్యాలను చూడసాగాడు. నాగకన్య తమ మార్గంలో ఎదురవుతున్న ప్రదేశాలను, అద్భుతాలను వివరించసాగింది. యశోధరుడు ఆసక్తిగా ఆమె చెబుతున్న విషయాలను వింటూ, ఎన్నో విశేషాలను తెలుసుకుంటున్నాడు.

గ్రామాలు, పట్టణాలు, కొండలు, అడవులు అలా దృశ్యాలుగా వారి ముందు



కదిలిపోతున్నాయి. ఒక గొప్ప పట్టణంలో రాజుగారి కుమార్తెకు వివాహం జరుగుతోంది. పట్టణమంతా కళ్యాణశోభతో వెలిగిపోతోంది. ప్రజలంతా పట్టలేని ఆనందంతో సంబరాలు చేసుకుంటున్నారు. ఆ దృశ్యాన్ని చూసి మల్లన్న "ఏం శోభ? ఏం వైభవం? సోదరా, గొప్పగా చేస్తున్నారు వివాహం," అన్నాడు. మరికొంత దూరం ప్రయాణించేసరికి మరో గొప్ప పట్టణం కనిపించింది. పట్టణమంతా చీకటిగా ఉంది. దీపాల వెలుగు లేదు. ప్రజలంతా ఒక నది ఒడ్డున కూర్చుని భోరున విలపిస్తున్నారు. ఒక యువకుడు చచ్చిపడి ఉన్నాడు. అతని పక్కన వృద్ధదంపతులు హృదయవిదారకంగా విలపిస్తున్నారు.

యశోధరుడు నాగకన్యను చూసి "ఈ పట్టణం ఎందుకిలా కాంతివిహీనంగా ఉంది? ఎందుకు ప్రజలంతా విచారిస్తున్నారు?" అని అడిగాడు. వారిని చూసిన నాగకన్య "దుఃఖంతో కుమిలిపోతున్న ఆ వృద్ధుడే ఆ పట్టణాన్ని పరిపాలించే ప్రభువు, అతని పక్కనే విలపిస్తున్న వృద్ధురాలు ఆతని భార్య. అతని ఒక్కగానొక్క కుమారుడు వింతవ్యాధి సోకి మరణించాడు. రాజ్యానికి వారసులే లేకుండాపోయారు. అందుకే పట్టణమంతా దుఃఖసాగరంలో మునిగింది," అని వివరించింది. యశోధరుడికి, మల్లన్నకు మనసు చెదిరింది.

ఇంకాస్త ముందుకు సాగాక సుందరమైన సరోవరం ఎదురయ్యింది. సరోవరం చుట్టూ అందమైన లతలు అల్లుకుని ఉన్నాయి. ఆ లతలకు పూచిన సుందర పుష్పాల సుగంధం ఆ గాలిలో కలిసిపోయి ఆ ప్రాంతమంతా పరిమళభరితంగా ఉంది. తుమ్మెదలు, సీతాకోక చిలుకలతో రంగులమయమైన ఆ ప్రదేశాన్ని చూసినంతనే కలతచెందిన యశోధరుడి మనస్సు కాస్త కుదుటపడింది. మల్లన్న ముఖంలో కూడా తిరిగి చిరునవ్వు వచ్చి చేరింది.

ఆ సరోవరం దాటిన కాసేపటికి ఘోర కీకారణ్యం కనిపించింది. క్రూరమృగాలు యదేచ్ఛగా సంచరిస్తున్న ఆ అరణ్యం భీతి గొలుపుతోంది. మల్లన్న భయం భయంగా చూస్తున్నాడు. ఇంతలో ఏ సింహం పదునైన పంజాదెబ్బకో కొనఊపిరితో విలవిల లాడుతున్న జింక రోదన వినిపించింది. హృదయాన్ని కదిలిస్తున్న ఆ అరుపులు వినగానే యశోధరుడు చప్పున తన ఖడ్గాన్ని తీసి కదలబోయాడు. నాగకన్య తటాలున చెయ్యిపట్టుకుని అతన్ని వారించింది.

"నరోత్తమా, ఆవేశం వద్దు. కాస్త స్థిమితపడు. సింహానికి జింక ఆహారం. అది సృష్టి ధర్మం. దానిని ఎవరూ తప్పించలేరు. ఆ జింక ఆయుష్షు తీరకుంటే అది సింహానికి చిక్కేదే కాదు. కనబడే ఈ దృశ్యాల్లాంటివే మనిషి జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలు. సమయానుసారం అవి వస్తుంటాయి. తప్పించుకునే శక్తి ఎవరికీ లేదు. అందుకే కష్టాల్లో కుంగిపోకూడదు. కష్టసుఖాలను ఒకే రీతిన చూడగలగడమే జీవిత పరమార్థం," అని అనునయ వచనాలు పలికింది. ముగ్గురూ అలా ఆకాశంలో ముందుకు సాగిపోతూనే ఉన్నారు. ఇంకెన్నో అద్భుతాలు, అనేక దృశ్యాలు వారికి ఎదురవుతూనే ఉన్నాయి.

సృష్టి ఎంత గొప్పదో, ప్రపంచమనేది ఎంత పెద్దదో కళ్ళారా చూస్తున్న

యశోధరుడికి మానవ జీవితం ఎంత సూక్ష్మమైనదో అర్థమయ్యింది. ఎప్పుడు, ఎలా పుడతామో, ఎలా చనిపోతామో తెలియని ఇంత చిన్న జీవితాన్ని రాగద్వేషాలతో నింపుకుంటూ, సుఖశాంతులను విడిచి నిత్యం పోరాడుతూ జీవితాన్ని దుర్భరం చేసుకునే వారిని గురించి ఆలోచిస్తుంటే యశోధరుడికి ఇప్పుడు జాలి కలుగుతోంది.

"సృష్టి ఎంత విచిత్రమైనదో చూశావా మల్లన్న. గొప్ప వాడైన ఒక ప్రభువు తన కుమారుడిని బతికించుకోలేకపోయాడు. ఒక పట్టణమంతా శోకసంద్రంలో మునిగిపోతే, ఇదే భూమిపై మరోచోట గొప్ప వివాహ వేడుకలు జరుగుతున్నాయి. చావు, పుట్టుకలు మన చేతిలో లేవు. ఆ రెండింటి మధ్య బతకటం మాత్రమే మన చేతిలో ఉంది. అందుకే మనం ఆనందంగా గడుపుతూ, పదిమందికి ఆనందాన్ని పంచుతూ బతకటమే జీవితానికి సార్థకత," తన మనస్సులో మెదులుతున్న ఆలోచనలను మల్లన్నతో పంచుకున్నాడు యశోధరుడు.

* * *

అలా కొంత దూరం ఆకాశమార్గంలో కొనసాగాక చల్లని గాలి వారి శరీరాలను తాకింది. సముద్రతీరం చేరువయ్యింది అనేందుకు సంకేతంగా హోరున సాగరఘోష వినిపించసాగింది. "అదిగో సముద్రం, సోదరా. వచ్చేసాం, వచ్చేసాం," అంటూ అరిచాడు మల్లన్న.

"ఈ సముద్రం మీదుగా ప్రయాణిస్తే కాసేపట్లో, నీరు పచ్చగా మారే చోటుకి చేరుకుంటాం," అని చెప్పింది నాగకన్య. ఆ మాటలు విన్న యశోధరుడు వెంటనే శత్రువులకి మన ఆనవాలు చిక్కకుండా ఉండే మార్గం ఏముందా అని ఆలోచించాడు. దేవకన్య ఇచ్చిన కామరూప విద్యతో తనని తాను సూక్ష్మ పరిమాణంలోకి మార్చుకోవటం శ్రేయస్కరమని అతనికి తోచింది.

అతని మనసులో మాటను గ్రహించిన నాగకన్య "యశోధరా, దేవకన్య నీకిచ్చిన విద్యతో మీరిద్దరూ సూక్ష్మ పరిమాణంలోకి మారండి. నా శక్తితో మీరు నీటిలో నివశించగలిగేట్టు చేస్తాను," అని చెప్పింది. యశోధరుడు దేవకన్యను తలచుకుని ఇద్దరినీ సూక్ష్మపరిమాణంలోకి మార్చమని కోరుకున్నాడు. వెంటనే ఇద్దరూ పిట్టంత పరిమాణంలోకి మారిపోయారు.

"అదిగో చూడు సోదరా, ఇంతవరకూ నీలం రంగులో ఉన్న నీరు అక్కడ పచ్చగా కనిపిస్తోంది," అని చూపించాడు మల్లన్న. నాగకన్య వారిద్దరిని హెచ్చరిస్తూ "ఈ ప్రదేశం మిక్కిలి ప్రమాదకరమైన జలచరాలకు ప్రతీతి. మీరనుకుంటున్న ఆ పగడాల లోయలోకి ప్రవేశం అంత సులభం కాదు. అనుక్షణం అప్రమత్తులై ఉండండి," అని చెప్పింది.

అంతవరకూ ఆకాశంలో సాగిన వారి ప్రయాణం ఇప్పుడు సముద్రంలో నీటి అడుగున సాగింది. సముద్రంలోని చేపలు, రకరకాల ప్రాణులు తమకంటే పరిమాణంలో ఎంతో పెద్దగా కనబడుతుంటే మల్లన్నకు కంగారుగా ఉంది. "సోదరా, ఈ దేవకన్య ఇచ్చిన విద్య మనకి సహాయం చేయటానికా లేక మనని సంహరించ టానికా? మనకి ఆహారం కావాల్సిన చేపలకు మనం ఆహారం అయ్యేట్టున్నాం," అంటూ కంగారు పడ్డాడు మల్లన్న.

అప్పటికే దీక్షగా పరిసరాలను గమనిస్తున్న యశోధరుడు "అదిగో చూడు, పగడాల లోయకి దగ్గరగా వచ్చాం. ఇకపై మనం మాటలు తగ్గించి అప్రమత్తంగా ఉండాలి సుమా," అని హెచ్చరించాడు.

నాగకన్య ఆ పగడాల లోయ వరకూ వారిని చేర్చి "యశోధరా, నేను చేయగలిగే సహాయం ఇంతటితో ముగిసింది. ఇకపై నిన్ను ముందుకు నడిపేది నీ కార్యదక్షతే. శుభమగుగాక," అని పలికి అదృశ్యమయ్యింది.

యశోధరుడు ఒక్కసారి ఆ పగడాల లోయని సొంతం పరిశీలనగా చూశాడు. ఆ దీవి అత్యంత రమణీయంగా ఉంది. ఏదో వింతలోకానికి వచ్చిన అనుభూతి అతనికి కలిగింది. వేల సంవత్సరాలుగా పేరుకుపోయిన రాళ్ళ గుట్టల్లో చిక్కుకున్న వివిధ రంగుల మణులు, మాణిక్యాలు తమ కాంతితో ఆ లోయను వర్ణశోభితం చేస్తున్నాయి. ముత్యపు చిప్పలనుండి జారిపడ్డ ముత్యాలు నీటిలో తేలియాడుతున్నాయి. ఔషధభరితమైన లతలు అ ప్రదేశమంతా వ్యాపించి సువాసనలు వెదజల్లుతున్నాయి. ఆ అందాలను చూస్తూ యశోధరుడు, మల్లన్న ముందుకు సాగారు.

వారికి కాస్త దూరంలో ఎత్తుగా ఏదో నిర్మాణం కనిపించింది. పక్కనే ఉన్న రాళ్ళగుట్ట పైకి ఇద్దరూ ఎగబాకారు. సూక్ష్మపరిమాణంలో ఉన్న వారిద్దరికీ ఆ చిన్న రాళ్ళగుట్టను ఎక్కటమే మహాపర్వతారోహణలా ఉంది. మల్లన్న ఆపసోపాలు

పడసాగాడు. ఎంతో శ్రమతో గుట్టనెక్కి నిలబడిన వారిద్దరిని చూసి ఒక చేపలగుంపు దగ్గరగా వచ్చి గమనించింది. గుట్టనెక్కి అలసిపోయి చికాకుపడుతున్న మల్లన్న కోపంతో గట్టిగా అరుస్తూ ఆ చేపల గుంపును అదిలించాడు.

దానితో చేపలగుంపు అతడిని తరమటం ఆరంభించాయి. మల్లన్న అటూ ఇటూ గుట్టపై పరిగెడుతుంటే చేపలు అతడిని తమ తోకలతో కొడుతూ వెంటపడ్డాయి. పరిగెట్టి పరిగెట్టి అలసిపోయిన మల్లన్న కిందపడిపోగానే ఆ చేపలగుంపు అతడిని మింగేందుకు దగ్గరగా వచ్చింది. అతడిని రక్షించేందుకు యశోధరుడు ముందుకు కదిలాడు. కానీ అంతలోనే పెద్దశబ్దం చేస్తూ ఒక భారీ తిమింగలం అటుగా వచ్చి ఆ చేపల గుంపును అమాంతం మింగేసి, మల్లన్నకు కాస్త ఎత్తులో అలా ముందుకు కదిలి వెళ్ళిపోయింది. ఆ హఠాత్పరిణామానికి మల్లన్న బిక్కచచ్చిపోయాడు.

మల్లన్న దగ్గరకు వచ్చి యశోధరుడు తన చేతిని సాయంగా ఇచ్చి అతడిని పైకి లేపాడు. ఇద్దరూ ఆ తిమింగలం వెళుతున్న దిక్కే చూడసాగారు. అలా చూస్తున్న వారిద్దరికీ దూరంగా ఒక రాజమందిరం కనిపించింది. సముద్రంలోని స్ఫటికాలతో, ఆల్చిప్పలతో నిర్మితమైన ఆ రాజమందిరం చాలా పెద్దదిగా ఉంది.

ఆ రాజమందిరం బయట సౌందర్యవతులైన ఇద్దరు స్త్రీలు కూర్చుని ఉన్నారు. స్వర్ణాభరణాలతో అలంకరించుకుని, పట్టువస్త్రాలు ధరించి అంతఃపుర కాంతలమల్లే కనిపించారు. వదులుగా ఉన్న ఆ స్త్రీల శిరోజాలు నీటిలోని అలలకు కదులుతూ ఆ దృశ్యానికి మరింత శోభనిస్తున్నాయి. వారిని చూసిన మల్లన్న "ఈ సుకుమార యువతులా ఈ మందిరానికి కాపలా? మన పని సులువైనట్టే సోదరా," అన్నాడు మల్లన్న. "లేదు మల్లన్నా. కపాలధ్వజుడు అంతటి బుద్ధిహీనుడు కాదు. ఇందులో ఏదో మాయ ఉంది," అంటూ వారిని పరిశీలించసాగాడు యశోధరుడు.

రాజమందిరానికి దగ్గరగా వస్తున్న తిమింగలాన్ని చూడగానే ఆ స్త్రీలిద్దరూ ఒక భయంకరమైన శబ్దం చేశారు. రాజమందిరంలో నుండి సౌందర్యవతులైన ఎందరో కన్యలు బయటకు వచ్చారు. వారిని గమనించిన తిమింగలం వారి పైకి దూసుకుని వెళ్ళింది. క్షణకాలం ఏం జరుగుతోందో అర్థంకాని ఆశ్చర్యంలో యశోధరుడు, మల్లన్న ఉండగా ఆ స్త్రీలంతా ఆ తిమింగలాన్ని అమాంతం

తినేసి, దాని ఎముకల్ని అలానే వదిలేసి రాజమందిరంలోకి వెళ్ళిపోయారు.

క్షణకాలం క్రితం భయంకరమైన తిమింగలం, ఎముకల గుట్టగా కనిపించేసరికి మల్లన్న వెన్నులో వణుకు మొదలయ్యింది. ఆ విషకన్యల శక్తి గమనించిన యశోధరుడు మార్గాంతరం ఆలోచిస్తూ అలానే నిల్చుండిపోయాడు.

ఆ రాజమందిరాన్నే గమనిస్తున్న యశోధరుడికి మందిరం అడుగుభాగంలో కొన్ని చోట్ల గాలిబుడగలు రావటం గమనించాడు. దగ్గరగా వెళ్ళి పరిశీలిస్తే ఒక మార్గం దొరకవచ్చనే ఆశ కలిగింది. ఇనుమడించిన ఉత్సాహంతో రాళ్ళగుట్ట మీద నుండి కిందకు దూకాడు యశోధరుడు. తనకి మాటన్నా చెప్పకుండా హఠాత్తుగా అలా వెళ్ళిపోతున్న యశోధరుడిని చూసి "సోదరా, ఆగవయ్యా. నన్ను వదిలేసి పోతావేం?" అంటూ పరుగందుకున్నాడు మల్లన్న.

అలికిడి చెయ్యకుండా ఎంతో జాగ్రత్తగా ప్రాకారం దగ్గరకు చేరుకున్నారు ఇద్దరూ. ఆ బుడగలు వచ్చేచోట జాగ్రత్తగా గమనిస్తే మందిరం లోపల నుండి బయటకు గొట్టాలవంటి నిర్మాణం కనిపించింది. "చూశావా? ఇలా నీటి ఆడుగున బుడగలు వస్తున్నాయంటే లోపల నుండి గాలి బయటకు వస్తోంది. ఈ గొట్టాల ద్వారా మనం లోపలికి ప్రవేశించవచ్చనుకుంటా," అన్నాడు యశోధరుడు. "అవి గాలిగొట్టాలో, మన పాలిట మృత్యుకూపాలో? ముందు వెనకలు చూసుకోకుండా వెళితే ఈ గొట్టంలోనే మనకు శాశ్వత సమాధి," అంటు గజగజ వణికాడు మల్లన్న.

"సరే అయితే. నువ్వు బయటే జాగ్రత్తగా ఉండు. నేను లోపలకు వెళ్ళి పని ముగించుకొస్తాను," అన్నాడు యశోధరుడు. "ఒక్కడినే ధైర్యంగా ఉండటానికి ఇదేమన్నా విశ్రాంతిమందిరమా? నువ్వెళ్ళి వచ్చేసరికి ఆ తిమింగలంలా నా అస్థిపంజరమే మిగులుతుంది. నీవెంట వస్తే కనీసం నువ్వున్నావనే ధైర్యం ఉంటుంది," అంటూ యశోధరుడిని అనుసరించాడు మల్లన్న.

* * *

ఆ గొట్టం లోపలికి ప్రవేశించి ఇద్దరూ నడవసాగారు. లోపలంతా చీకటిగా ఉంది. కళ్ళుపొడుచుకున్నా కనబడని చీకటి. ఆ గొట్టం గోడలను తడుముకుంటూ ముందుకు సాగారు. అలా నడుస్తూ ముందుకు వెళుతూ ఉంటే గొట్టంలో

నీటిమట్టం తగ్గుతూ ఉండటం గమనించాడు యశోధరుడు. కాసేపటికి పూర్తిగా నీరనేదే లేకుండా పోయింది. అలా అనేక మలుపులు తిరుగుతూ ముందుకు సాగిన వారిద్దరికీ కాస్త దూరంలో వెలుగు కనిపించింది.

ఇద్దరూ వడివడిగా నడిచి ఆ వెలుగు వస్తున్న చోటుకి చేరుకున్నారు. ఆ వెలుగు వస్తున్న చోట గొట్టానికి ఒక రంధ్రం ఉంది. ఇద్దరూ ఆ రంధ్రం ద్వారా మందిరం లోపలికి ప్రవేశించారు. ఆ మందిరాన్ని గమనిస్తే గొప్ప గొప్ప రాజులు నివసించే రాజప్రాసాదంలా ఉంది. నేలపై పట్టు తివాచీలు పరిచి ఉన్నాయి. గోడలకు బంగారు తాపడాలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా జలగర్భంలో ఉన్న ఆ రాజప్రాసాదంలో నీరనేదే లేదు. ఇదంతా ఆ కపాలధ్వజుడి మాయాజాలం అనుకున్నాడు యశోధరుడు.

ఆ భవనాన్ని, దాని నిర్మాణాన్ని కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తూ "సోదరా, ఇంత పెద్ద భవనంలో అమృత ఎక్కడ బంధింపబడి ఉందో గుర్తించేదెలా? అందులోనూ ఆమెను ఇదివరకూ చూసి ఎరగవు, ఆమె రూపం తెలియదు. ఆమే సాక్షాత్తూ ఎదురైనా గుర్తించలేమే," గుసగుసగా అడిగాడు మల్లన్న.

దీక్షగా ఏదో పరిశీలిస్తున్నట్టుగా కదులుతున్న యశోధరుడు మల్లన్న ప్రశ్నకు బదులిస్తూ "జలగర్భంలో విషకన్యలు నివసించే ఈ మందిరంలో పదిలంగా దాచాల్సినంత విలువైన వస్తువులు ఏముంటాయి చెప్పు? ఇక్కడ పూర్తిగా రక్షణలో దాచింది అమృతను మాత్రమే అని నా నమ్మకం. కాబట్టి విషకన్యలు కాపలా కాస్తూ ఉన్న గదిలోనే అమృతను బంధించినట్టు. ఏ గదికి విషకన్యలు కాపలాగా ఉన్నారో మనం ముందుగా పసిగట్టాలి," అని చెప్పాడు.

ఇద్దరూ ఎవరి కంటా పడకుండా గోడ వారగా నడుస్తూ భవనమంతా వెతకసాగారు. అలా వెతుకుతున్న వారిద్దరికీ ఒక గది బయట ఇద్దరు విషకన్యలు కూర్చుని ఒకరికొకరు అలంకారం చేసుకోవటం కనిపించింది. వారికి కనబడకుండా యశోధరుడు, మల్లన్న ఒక మూల నక్కి వారి మాటలు వినసాగారు.

"సోదరీ, ఇంకా ఎన్నాళ్ళు మనకీ బాధ? స్వేచ్ఛగా సముద్రమంతా విహరించి ఎంతకాలమయ్యింది? విషకన్యలమైన మనకి శునకాల లాగా ఈ కాపలా ఇంకెంత కాలం?" అని నిట్టూర్చింది ఒక విషకన్య. "ఆ కపాలధ్వజుని కార్యం నెరవేరాక, ఈ కన్యను విరుచుకుని తినేస్తాను," అని ఊగిపోయింది లావుగా



ఉన్న మరో విషకన్య. "ఇంకెంతలే, వచ్చే అమావాస్యకి దీనిని, దీని తల్లిదండ్రులను కపాలధ్వజుడు ఎలాగూ బలిస్తాడు," అని చెప్పింది మూలగా కునుకు తీస్తున్న మరో విషకన్య.

ఆ మాటలు విన్న యశోధరుడు, మల్లన్న ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. అమృతను బంధించి ఉంచిన గది అదేనని గ్రహించారు. యశోధరుడు లోపలకు వెళ్ళే మార్గం కోసం అన్వేషించసాగాడు. గదిలో నుండి బయటకు నీరు పోయేందుకు అనువుగా ఉంచిన రంధ్రం ఒకటి కనిపించింది. ఇద్దరూ ఆ రంధ్రంలోకి ప్రవేశించారు.

"మల్లన్నా, నువ్వు రంధ్రానికి ఈ చివరే ఉండి ఎవరైనా వస్తే అలికిడి చెయ్యి. నేను లోపల ఏం జరుగుతోందో గమనించి వస్తాను," అని మల్లన్నను కాపలాగా ఉంచి యశోధరుడు ఒంటరిగా లోపలికి ప్రవేశించాడు. విశాలమైన

ఆ గది మధ్యలో ఎత్తైన తల్పం ఉంది. ఆ తల్పం పైన పట్టుపరుపులు పరిచి ఉన్నాయి. గదంతా పూలతో అలంకరించి, మంచి పరిమళం వ్యాపించి ఉంది. కానీ, అమృత జాడ కనిపించలేదు.

యశోధరుడు అలికిడి చేయకుండా గదంతా కలియతిరిగాడు. ఒక మూల నేలపై పడి ఉన్న స్త్రీ కనిపించింది. యశోధరుడు ఒక ఆసనం వెనక నక్కి ఆమెను గమనించాడు. వేల యుగాల దుఃఖం ఘనీభవించి స్త్రీ రూపాన్ని ధరించినట్టుగా ఉందామె. ఆమె కళ్ళ నుండి ఏకధారగా కారుతున్న అశ్రువుల వల్ల కళ్ళ కింద చారికలు కట్టాయి. ముడివేయక వదిలేసిన ఆమె శిరోజాలు ఆశృధారలతో తడిచి జడలు కట్టి నేలపై నిర్జీవంగా దొర్లుతున్నాయి.

అమృత ఆమే అని యశోధరుడికి నమ్మకం కలిగింది. "కానీ కపాలధ్వజుడు ఈమెను హింసించకుండా ఇంత సుందరమైన భవనంలో ఎందుకు ఉంచాడు? ఈమె అమృత కాదేమో?" అన్న అనుమానం కలిగింది యశోధరుడికి. ఆమె దగ్గరకి వెళ్ళాలని ముందుకు కదిలిన యశోధరుడికి రంధ్రం నుండి మల్లన్న అరుపులు వినిపించాయి. ఎవరో వస్తున్నారన్న విషయం గ్రహించి వెంటనే అక్కడున్న తల్పం కిందకు వెళ్ళి దాక్కున్నాడు.

ఆ గది లోపలికి వచ్చిన ఒక విషకన్య అమృత ముందు ఆహార పదార్థాలు నిర్లక్ష్యంగా పడేసి వెళ్ళిపోయింది. విషకన్య వెళ్ళిన కాసేపటికి అమృత మెల్లగా లేచి కాస్త నీటిని తాగాలని ప్రయత్నించింది. కానీ తాగలేక అక్కడే పడేసి గట్టిగా విలపించసాగింది. ఆమె దుఃఖానికి కారణం అర్థం కాని యశోధరుడు అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు కదిలాడు. ఆమె పడేసిన నీటి వద్దకు రాగానే అతనికి అవి సముద్రజలమని అర్థమయ్యింది. ఆమెను చూస్తే ఎన్నో రోజులుగా గొంతు తడుపుకునేందుకు నీరులేక దప్పికతో అలమటిస్తోందని గ్రహించాడు. ఆహారపదార్థాలు కూడా నోటికి సహించనివే అని అర్థం చేసుకున్నాడు.

వనాల్లో నివసించి, సంచరించే తనబోటి వారికే సహించని ఆ ఆహారం, ఎండ కన్నెరుగక అల్లారుముద్దుగా పెరిగిన ఆ సుకుమారిని ఎంత అవస్థకు గురిచేసిందో అర్థమై అతని నేత్రాలు సజలమయ్యాయి. ఆకలిదప్పులు తాళలేక ఆ నీటిని తాగితే ఆ కఠిన జలంలోని లవణ గాఢత అమెను ఎంత బాధించగలదో యశోధరుడు ఊహించగలడు. ఆమె ముఖం కళావిహీనంగా ఉంది. ఆమె

పడుతున్న క్షోభను సుష్కించిన శరీరం తెలియజేస్తోంది. సాక్షాత్తు మహాశివుని ప్రసాదమైన శోభాయ మానమైన మహానగరానికి యువరాణి ఈ యువతి అని నమ్మేందుకు వీలు లేనంతగా ఆమె క్షీణించిపోయింది. ఆ పరిస్థితులను చూసిన యశోధరుడికి ఆవేశం పెల్లుబికింది. ఈ విషకన్యలందరినీ సంహరించి అమృతను కాపాడతాను అని మనసులో అనుకుని ముందుకు కదిలాడు.

అప్పుడే మెల్లగా ఆ గదిలో ప్రవేశించిన మల్లన్న, యశోధరుడిని ఆపి "సోదరా, ఆ విషకన్యలందరూ బయట విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇప్పుడు వారిని లేపి యుద్ధం చెయ్యటం కంటే ముందుగా యువరాణికి సపర్యలు చెయ్యటం మంచిది," అని చెప్పాడు. మల్లన్న చెప్పింది సబబుగా తోచి, యశోధరుడు తనని తాను నిగ్రహించుకున్నాడు. అమృతకు ముందుగా ఆహారం, నీరు అత్యవసరం అని గ్రహించిన యశోధరుడు ఆ గదిలోకి ఆహారం తీసుకు రావటం ఎలా అని ఆలోచిస్తూ చుట్టూ వెతకనారంభించాడు.

గదిలోకి గాలి, వెలుతురు లోపలికి వచ్చేందుకు వీలుగా ఒకవైపు కాస్త ఎత్తులో ఉన్న కిటికీ కనిపించింది. యశోధరుడు మెల్లగా తల్పంపైకి ఎక్కి అక్కడున్న పరదాలను ఒకదానితో ఒకటి ముడేసి ఆ కిటికీ ద్వారా ఒక కొన బయటకు వెళ్ళేలా విసిరాడు. మరో కొనను తల్పానికి ముడివేసి "మల్లన్నా, ఆహారం ఎక్కడ దొరుకుతుందో వెతుకుదాం పద," అని చెప్పి మల్లన్నను తోడుతీసుకుని రంధ్రం ద్వారా గది బయటకు వచ్చాడు.

భవనంలో ఒక్కో గదిని గాలిస్తున్న వారికి ఒక గదిలో బంగారు పళ్ళాలలో అమర్చి అనేక రకాల ఫలాలు, పిండి వంటలు కనిపించాయి. ఇద్దరూ సంతోషంగా ఆ గదిలో ప్రవేశించి ఒక్కో ఫలాన్ని దొర్లించటం మొదలుపెట్టారు. ఆకలిగా ఉన్న మల్లన్న అలా దొర్లిస్తూనే మరో చేత్తో అందిన వాటిని తినసాగాడు. అలా కొన్ని ఫలాలను, పిండి వంటలను దొర్లించి, తాము మోయగలిగే పరిమాణంలో ఉన్న ఒక నీటి కూజాతో సహా బయట వైపున్న పరదా కొన వద్దకు చేర్చారు. ఆ కొనలో ఆ పదార్థాలన్నీ వేసి మూటకట్టారు.

తర్వాత ఇద్దరూ రంధ్రం గుండా తిరిగి గదిలోకి ప్రవేశించి ఎంతో కష్టపడి ఆ మూటను లోపలికి లాగారు. ఆ మూట కిందపడిన అలికిడికి అమృత కంగారుగా లేచి వారిద్దరినీ చూసింది. అంత చిన్న పరిమాణంలో ఉన్న మనుషుల్ని

చూసి వారు కపాలధ్వజుడి మనుషులే అనుకుని భయపడింది. కానీ వారిద్దరూ ఆమె ముందుకు ఆ మూటను తీసుకుపోయి ఆహారపదార్థాలను చూపించారు. అమృత భయంతో మరికొంచెం దూరం తొలగింది.

"మల్లన్నా, నువ్వు బయటకు వెళ్ళి ఆ విషకన్యలను గమనిస్తూ ఉండు. ఈ సమయంలో వారిక్కడకు వస్తే చాలా ప్రమాదం," అని చెప్పి కాపలాగా మల్లన్నను బయటకు పంపాడు. మల్లన్న వెళ్తూ, వెళ్తూ అమృతకు చిరునవ్వుతో "దండాలు, యువరాణి," అని నమస్కరించి అక్కడ నుండి కదిలాడు. యశోధరుడు ఆ మూటలో ఉన్న నీటి కూజాను శ్రమకోర్చి అమృత ముందుకు తోశాడు.

అమృత భీతికలిగిన కళ్ళతో అతడిని చూస్తూ ముడుచుకుపోయింది. యశోధరుడు వినమ్రంగా "యువరాణి, మీకొచ్చిన ఆపదేమీ లేదు. నేను మీ రక్షణార్థం వచ్చినవాడిని. దయచేసి నన్ను నమ్మి ఈ ఆహారం తీసుకోండి. ఎన్నో రోజులుగా ఆహారం లేక మీరు ఎంతో సుష్కించిపోయారు," అని అన్నాడు. అతడి మాటలు ఆమెకు నమ్మశక్యంగా అనిపించలేదు. ఇంత ప్రమాదకరమైన, రహస్యమైన ప్రదేశానికి ఒక సామాన్యుడు చేరుకోవటం సాధ్యం కాదని ఆమె నమ్మకం. ఆమె అంతరంగాన్ని గ్రహించిన యశోధరుడు "కనీసం విషకన్యలు పెట్టిన పదార్థాలను రుచి చూసినట్టే వీటిని రుచి చూడండి. అలా చేయటం వల్ల కొత్తగా మీకు కలిగే ఆపదేమీ లేదు కదా," అని అర్థించాడు.

అమృతకు అతని మాటలు అర్థవంతంగా తోచాయి. అదీగాక అతడి ప్రవర్తన ప్రమాదకరంగా తోచలేదు. పూర్తి నమ్మకం కలగనప్పటికీ ఆ కూజాలో ఉన్న నీటిని రుచి చూసింది. ఎన్నో రోజులుగా సముద్రజలం రుచి చూడటం వల్ల గాయపడిన ఆమె నోటికి ఆ నీరు మధురంగా అనిపించింది. దప్పిక తీరేలా మొత్తం నీటిని తాగేసింది. కాస్త సంతృప్తిగా నిట్టూర్చిన యశోధరుడు ఆమెకు ఫలాలను అందించాడు. ఆకలిగా ఉన్న అమృత గబగబా ఆ ఫలాలను అందుకుని తినటం మొదలుపెట్టింది. ఆకలి తీరి, కాస్త తేలిక పడుతుండగా తనని గమనిస్తున్న యశోధరుడి వైపు చూసింది. మహానగర సామ్రాజ్యానికి ఒక్కగానొక్క వారసురాలు, మహారాజు ముద్దులపట్టి అయిన అమృత ఇన్నిరోజులూ ఆకలికి ఎంతగా అలమటించి పోయిందో అని ఆలోచిస్తున్న యశోధరుడు ఆమెను జాలిగా చూస్తున్నాడు. అతని చూపులలోని జాలి వల్ల తాను ఎంత

దీనావస్థలో ఉందో గ్రహించిన అమృత భోరున విలపించింది.

తన అంతఃపురంలో సకల విలాసాలతో జీవిస్తున్న రోజుల్లో ఒక్క ముద్ద అయినా తినమని ప్రాధేయపడుతూ తన వెంటపడే తల్లిదండ్రుల ప్రేమ, వారిని తప్పించుకుని పారిపోతుంటే తనని పట్టించేందుకు పరుగులు పెట్టే తన చెలికత్తెల స్నేహం గుర్తొచ్చి అమృత ముఖం వాడిపోయింది.

ఆమెను అనునయించలేని యశోధరుడు నిశ్చేష్టుడై అలా నిలుచుండిపోయాడు. కాసేపటికి తేరుకున్న అమృత యశోధరుడిని పరీక్షగా చూసి "మీరెవరు? చూసేందుకు మానువుల్లా ఉన్నారు, కానీ ఇంత సూక్ష్మ పరిమాణంలో ఎందుకు ఉన్నారు?" అని ప్రశ్నించింది. యశోధరుడు తన సహజ రూపాన్ని ధరించి "యువరాణి, నేను సాధారణ మానవుడినే. ఒక దేవకన్య ఇచ్చిన వరం సహాయంతో విషకన్యలకు ఆనవాలు చిక్కకుండా ఈ రూపాన్ని ధరించాను. నేను మీ రక్షణార్థం వచ్చిన వాడిని. నా ప్రాణాలు అడ్డుగా పెట్టైనా మిమ్మల్ని తిరిగి మహానగరానికి చేరుస్తాను," అని హామీ ఇచ్చాడు.

ఒక్కసారిగా సాధారణ రూపంలోకి మారిన అతడిని చూసి కంగారు పడిన అమృత "మీరు మహానగరవాసి కూడా కాదు. నేనెప్పుడూ మిమ్మల్ని చూసి ఎరుగను. నా వివరాలు మీకెలా తెలుసు? నన్ను రక్షించేందుకు ఎందుకింత సాహసించారు?" అని అడిగింది. "యువరాణి, మీ మహానగర క్షేమాన్ని కాంక్షించే బిల్వకమునీంద్రుల శిష్యుడిని నేను. గురుదేవుల ఆదేశానుసారం మహానగరానికి ప్రయాణమైన నేను, మహానగరానికి కలిగిన ఆపద తెలుసుకుని మీ రక్షణార్థం ఇలా వచ్చాను," అని చెప్పాడు.

మహానగరానికి ఆపద అన్నమాట వినగానే అమృత నివ్వెరపోయింది. తనకు మాత్రమే ఆపద వాటిల్లిందని అంతవరకూ బాధపడుతున్న ఆమె కంగారుగా "మహానగరానికి ఎటువంటి ఆపద సంభవించింది? మా తండ్రి మహారాజు ఫణిభూషణులు క్షేమమే కదా? ఎండకన్నెరుగని సామ్రాజ్ఞి, గంధర్వరాజపుత్రి నా తల్లి మృదుభాషిణికి ఎటువంటి ఆపదా కలుగలేదు కదా? నాకు తెలుసు ఈ ఆపదలన్నీ నా వల్లనే సంభవించాయి. పెదతల్లినని ప్రేమ నటించిన ఆ రాక్షసి మాయలోపడి, ఎటువంటి పరిస్థితులలోనూ అన్యులకు ఇవ్వకూడని మహాదేవుని ఆత్మలింగాన్ని ఇచ్చి క్షమించరాని తప్పుచేశాను. నేను చేసిన తప్పు

నాతో పాటుగా నన్ను ప్రాణసమానంగా ప్రేమించిన తల్లిదండ్రులను సహితం శిక్షిస్తోంది," అని కలవరపడింది.

"కపటమెరుగని మీ స్వచ్ఛమైన మనసుని, అమాయకత్వాన్ని గ్రహించి ప్రేమగా నటించి ఇంత దుర్మార్గానికి ఒడిగట్టిన ఆ వంచకి శ్రీభాషిణి పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. ఆమె తగిన శాస్తి అనుభవించి తీరుతుంది. దీంట్లో మీ నేరమేమీ లేదు. మీరు విచారించవద్దు. ఇప్పటికయితే మీ తల్లిదండ్రులకొచ్చిన ఆపద ఏమీ లేదు. కానీ వారిప్పుడు మహానగరంలో లేరు. ఆ దుర్మార్గుడు కపాలధ్వజుడు వారిని భల్లూకదీవిలో బంధించి ఉంచాడు. రానున్న అమావాస్యలోపు మనం ఆ దీవిని చేరుకుని, వారిని రక్షించి తీరాలి," అని అమృతకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశాడు యశోధరుడు.

* * *

తాను, తన కుటుంబం ఎంత నిస్సహాయ స్థితిలో ఉన్నామో అర్థంచేసుకున్న అమృతకి యశోధరుడి మాటలు ఏ మాత్రం ధైర్యాన్నివ్వలేదు. నిజానికి యశోధరుడు వచ్చేంత వరకూ ప్రాణం మీద ఎటువంటి ఆశలేకుండా రోజులు వెళ్ళదీస్తూ ఉంది. ఇవే తన చివరి రోజులు అని భావించింది. ఆకలి దప్పికలతో సుష్కించి మరణిస్తాననే అనుకుంది. యశోధరుడు వచ్చాక, అతనితో మాట్లాడాక ఇప్పుడిప్పుడే ఆమెకు తన ప్రాణాల మీద తిరిగి ఆశ చిగురించింది. కానీ తన తల్లిదండ్రుల దుస్థితి తెలిశాక, శత్రువులైన కపాలధ్వజుడు, పెదతల్లి శ్రీభాషిణి ఎంతటి శక్తిమంతులో, క్రూరులో అర్థమై తన ఆశలకు నీళ్ళొదులుకుంది.

ఏన్నో రోజులుగా విషకన్యల పహారాలో బందీ అయ్యి మృత్యువు ముంగిట గడిపిన ఆమెకు అప్పుడే పరిచయమయిన తన శక్తిసామర్థ్యాల మీద నమ్మకం కుదరటం, ధైర్యం కలగటం జరిగే పని కాదని గ్రహించాడు యశోధరుడు. తక్షణం ఆమెను విడిపించటం ద్వారా మాత్రమే ఆమె భయాన్ని దూరం చెయ్యగలను అని భావించాడు.

"యువరాణీ, ఈ భవనంలో ఆ విషకన్యలు కాక వేరెవరైనా రక్షణగా ఉన్నారా? కపాలధ్వజుడు ఈ భవనానికి ఏ సమయంలో వస్తాడు? మీకు తెలిసిన వివరాలు చెప్పండి. మనం తక్షణం ఇక్కడి నుండి బయటపడే మార్గం వెతకాలి," అని అడిగాడు యశోధరుడు.

"నన్ను బంధించి వెళ్ళాక కపాలధ్వజుడు ఎప్పుడూ ఇక్కడికి రాలేదు. కానీ ఆ పై అంతస్థులో కపాలధ్వజునికి విశ్వాసపాత్రుడైన దుష్టశక్తి ఎవడో ఉన్నాడని మాత్రం ఆ విషకన్యల మాటల్లో తెలిసింది," అని తనకు తెలిసిన వివరాలు చెప్పింది అమృత.

బయట కాపలాగా ఉన్న మల్లన్నకు విపరీతంగా దాహం మొదలయ్యింది. అమృతకు ఆహారం తెస్తున్న సమయంలోనే ఆకలి తట్టుకోలేక అక్కడ దొరికిన పళ్ళు, పిండి పదార్థాలు పొట్టనిండుగా తినేశాడు. ఇప్పుడు నీరు తాగకపోతే ప్రాణం పోయేలా ఉంది. కానీ తను అక్కడే ఉండి అవసరమైనప్పుడు హెచ్చరికలు ఇవ్వకపోతే యశోధరుడు, అమృత చిక్కుల్లో పడే అవకాశం ఉంది. ఏం చెయ్యాలో పాలుపోక తటపటాయిస్తూ కాపలాగా ఉన్న విషకన్యల వైపు చూశాడు. విషకన్యలంతా గాఢ నిద్రలో ఉన్నారు. ఇదే తరుణమని మల్లన్న అడుగులో అడుగు వేసుకుంటూ మెల్లగా ఆహార పదార్థాలు ఉన్న గది వైపు కదిలాడు.

గది లోపల అమృతతో మాట్లాడుతూ ఆలోచిస్తున్న యశోధరుడికి చప్పున ఏదో స్ఫురించి కలవరపాటుకి లోనయ్యాడు. అతడు అలా కంగారుపడటం చూసి అమృతలో ఆందోళన మొదలయ్యింది. "హఠాత్తుగా అలా కలవరపడుతున్నారెందుకు?" అని అడిగింది. "రాకుమారీ, తెలియకుండానే అపాయం కొనితెచ్చుకున్నాం. మీ ఆకలిని, సుష్కించిన శరీరాన్ని గమనించిన బాధలో వివేకాన్ని మరిచి ఆ తిండిపదార్థాలను తీసుకువచ్చాం. ఆ తిండిపదార్థాలు భద్రపరిచిన గదికి కాపలాగా ఉన్నవాళ్ళెవరైనా వెళితే, అన్యులెవరో భవనం లోపలికి ప్రవేశించారని ఇట్టే తెలిసిపోతుంది. అనుమానం కలిగిన తక్షణమే వారంతా మొదట మీ గదికే వస్తారు," అని తన కలవరపాటుకి కారణం చెప్పాడు యశోధరుడు.

అతని ఆందోళనను నిజం చేస్తూ బయట నుండి బిగ్గరగా మల్లన్న అరుపులు వినిపించాయి. ప్రమాదం ముంచుకొచ్చిందని గ్రహించిన యశోధరుడు అమృతను భయపడకుండా అక్కడే ఉండమని చెప్పి తిరిగి సూక్ష్మరూపాన్ని ధరించి గదికి ఉన్న రంధ్రం గుండా బయటకు వచ్చాడు. ఆహార పదార్థాలు ఉన్న గది నుండి అరుపులు వస్తున్నాయని గ్రహించి అటువైపు కదిలాడు. అక్కడ దృశ్యాన్ని చూసి యశోధరుడు నిశ్చేష్టుడయ్యాడు.



ఆ గదిలో ఒక రాక్షస సముద్రజీవి కనిపించింది. చూసేందుకు నత్త రూపంలో ఉన్న ఆ జీవి శరీరం రెండు ఏనుగుల బరువు తూగేలా ఉంది. దాని నెత్తి మీద రెండు పెద్ద పెద్ద కళ్ళున్నాయి. ఆ రాకాసి నత్తకి ఎనిమిది కాళ్ళు ఉన్నాయి. ఆ కాళ్లు పొడవైన ఏనుగు తొండాల్లా ఉన్నాయి. ఒక కాలితో మల్లన్నను చుట్టి గాల్లోకి లేపింది. మరొక్క క్షణంలో ఆ నత్త మల్లన్నను నోటిలో వేసుకోబోతుందనగా, యశోధరుడు తన సహజరూపాన్ని ధరించి దాని ముందుకు వచ్చి నిలిచాడు.

అప్పటి వరకూ ప్రాణభయంతో బిక్కచచ్చిపోయిన మల్లన్న యశోధరుడిని చూసి ధైర్యం తెచ్చుకుని “సమయానికి వచ్చావు. లేదా దాహం కోసం వచ్చిన నేను దీనికి స్వాహా అయిపోయేవాడిని. రక్షించు సోదరా! రక్షించు,” అని అరిచాడు. యశోధరుడు దృఢంగా నిలబడి “భయపడకు మల్లన్నా, నీ ప్రాణానికి

వచ్చిన ప్రమాదమేమీ లేదు," అని స్థిరమైన కంఠంతో చెప్పాడు. దైవదత్తంగా తనకు లభించిన వజ్రాయుధాన్ని స్థిరంగా పట్టుకుని "ఒరేయ్ రాకాసి! నా స్నేహితుడిని విడిచిపెట్టు. లేదా క్షణాల్లో నీ అష్ట పాదాలను నా ఖడ్గంతో ఖండించి, నీ దేహాన్ని కదలలేకుండా చేసేస్తాను," అని గద్దించాడు.

యశోధరుడి హెచ్చరికలకు ఏ మాత్రం భయపడని ఆ రాకాసి నత్త, అతడిని కూడా తొండంవంటి తన కాలితో చుట్టి గాల్లోకి లేపింది. కోపంతో తన కాళ్ళ పట్టు బిగించింది. కొండచిలువ పట్టుకు చిక్కిన జింకపిల్లల్లా ఇద్దరూ విలవిలలాడారు. యశోధరుడి చేతిలోని ఖడ్గం జారి కిందపడింది. ఆ అలికిడికి నిద్రిస్తున్న విషకన్యలకు మెలుకువ వచ్చి పరుగున అక్కడకు వచ్చారు.

రాకాసినత్త వారిని చూసి గంభీరమైన స్వరంతో "మూర్ఖులారా, ఏం చేస్తున్నారు? ఇద్దరు మానవులు ఇంతటి భయంకరమైన సముద్రగర్భంలోకి వచ్చి, ఇంతమంది కళ్ళుగప్పి దుర్భేద్యమైన మన భవనంలోకి చొరబడి, స్వేచ్ఛగా సంచరిస్తుంటే మీరు విందులు, విలాసాలు చేసుకుని మొద్దు నిద్రపోతున్నారా? ఆ రాకుమారి ఎక్కడ? మిమ్మల్ని వెర్రివాళ్ళని చేసి తప్పించుకుపోలేదు కదా," అని అరుస్తూ తన ఆగ్రహాన్ని ప్రదర్శించాడు. భయంకరమైన ఆ రాకాసినత్త స్వరం ఆ భవనంలో ప్రతిధ్వనించింది. విషకన్యలంతా భయంతో గజగజ వణుకుతూ అమృత గది వైపు పరుగులు తీశారు.

రాకాసినత్త పట్టు మెల్లగా బిగుసుకుంటోంది, వజ్రాయుధం చేజారిపోయింది. ఏం చెయ్యాలో తెలియక యశోధరుడు ఉపాయం కోసం చుట్టూ చూస్తున్నాడు. మల్లన్నకు ప్రాణాల మీద ఆశపోయింది. మృత్యుంజయ మంత్రం పఠించటం మొదలుపెట్టాడు. నిప్పు గోళాల్లా మండుతున్న ఎర్రటి కళ్ళతో రాకాసినత్త ఇద్దరినీ మార్చి మార్చి చూస్తూ ఉంది. ఇద్దరినీ అమాంతం విరుచుకుని తినేయాలని అనిపిస్తున్నా, రాకుమారి అక్కడే ఉందన్న వార్త వినటం కోసమే ఆగింది. ఒకవేళ తప్పించుకుని ఉంటే ఆమెను తిరిగి పట్టుకునేందుకు వీరు బతికే ఉండాలి. చూసి రావటానికని వెళ్ళిన విషకన్యలు చేస్తున్న జాప్యంతో దానికి అసహనం పెరిగిపోతూ ఉంది.

విషకన్యలు అమృతను చంపి రక్తం తాగుతామని బెదిరిస్తూ, దుర్భాషలు ఆడుతూ, నెట్టుకుంటూ తీసుకుని వచ్చారు. రాకాసి నత్తను చూడగానే

భయభ్రాంతులకు లోనయిన అమృత కెవ్వుమని కేకపెట్టి తూలిపడబోయింది. ఒక విషకన్య ఆమె భుజాన్ని గట్టిగా పట్టుకుని నిలబెట్టింది. భయంతో అమృతకు దుఃఖం పొంగింది. ఆ క్షణంలో మల్లన్న, అమృత ఇద్దరి ముఖాల్లో ఒక చిన్న ఆశ కొడిగడుతున్న దీపంలా మిణుకు మిణుకు మంటుండగా ఇద్దరూ యశోధరుడి వైపు చూశారు. వారిద్దరి ప్రాణాలను కాపాడటం తన బాధ్యత అనే విషయం యశోధరుడు మరిచిపోలేదు.

మల్లన్న వైపు చూసి నాలుక బయటపెట్టి సంజ్ఞలు చేశాడు. యశోధరుడు ఏం చెబుతున్నాడో తెలియక తికమక పడ్డాడు మల్లన్న. తనని ఏదో చెయ్యమని చెబుతున్నాడే అని ఆలోచిస్తున్న మల్లన్నకు యశోధరుడి ఉపాయం కాస్త ఆలస్యంగా అర్థమయ్యింది. అర్థమయిన వెంటనే గిలగిలా కొట్టుకుని, నాలుక బయటపెట్టి చచ్చినవాడిలా మెడ వేలాడదీశాడు.

"పిరికిపంద, నేను చంపకుండానే చచ్చాడు," అని రాకాసినత్త వికటాట్టహాసం చేస్తూ మల్లన్న వైపు చూసింది. అదే అదనుగా యశోధరుడు తన చేయిజారి కింద పడిన వజ్రాయుధాన్ని అందుకోమని అమృతకు సైగ చేశాడు. అతని సంజ్ఞ అందుకుని చురుకుగా కదిలిన అమృత, విషకన్యలు గమనించేలోపు నేల పైన ఉన్న ఖడ్గాన్ని అందుకుంది. అంతవరకూ శోక దేవతలా, అబలలా కనిపించిన అమృత ఖడ్గాన్ని అందుకోగానే నిజమైన రాచకన్యగా మారిపోయింది. కాలం కలిసిరాక మాయావి మాయాజాలానికి చిక్కి మ్రాన్పడిపోయింది కాని, ఆమె కూడా యుద్ధవిద్యలను అభ్యసించింది. ఇప్పుడు వజ్రాయుధమిచ్చిన కొత్త ఉత్సాహంతో ఆమె మెరుపులా కదిలి ఆ ఖడ్గాన్ని సరాసరి రాకాసినత్త పొట్టలో దిగవేసింది.

ఊహించని ఈ పరిణామానికి రాకాసినత్తతో సహా విషకన్యలు కూడా నివ్వెరపోయారు. రాకసినత్త శరీరం నుండి రక్తం ధారగా ఎగసిపడింది. బాధతో దాని తొండాల పట్టుజారింది. మల్లన్న, యశోధరుడు దాని పట్టు నుండి విడివడి కిందపడ్డారు. ఎత్తు నుండి కిందపడ్డ నొప్పికి మల్లన్న కుయ్యో మొర్రోమని మూలగటం మొదలుపెట్టాడు. యశోధరుడు మాత్రం కిందపడుతూనే వేగంగా అమృత వైపు కదిలి వజ్రాయుధాన్ని అందుకున్నాడు. ఖడ్గాన్ని అమితవేగంతో ప్రయోగిస్తూ ఆ రాకాసినత్త చుట్టూ ప్రదక్షిణగా తిరిగి దాని ఎనిమిది తొండాలను ఖండించేశాడు.

ఆ ప్రదేశమంతా రక్తపు మడుగయ్యింది. ఆ మడుగులో కదలలేక మొండి శరీరంతో రాకాసి నత్త పడి ఉంది. "అయ్యో రాక్షసుడి ప్రాణాలన్నీ ఆ కాళ్ళలోనే ఉన్నాయి. ఆ కాళ్ళని ఖండించేశారే," అని శోకాలు పెడుతూ విషకన్యలంతా వచ్చి యశోధరుడి పైన పడ్డారు. వాడియైన గోళ్ళతో, కోరలతో ఆ విషకన్యలు యశోధరుడి పైన దాడి చేశారు. ఒక విషకన్య తన కోరలతో యశోధరుడి కుడిచేతిని గట్టిగా పట్టి రక్తం తాగేందుకు ప్రయత్నించింది. బాధతో ఆ చేతిని విదిలించగానే పట్టు తప్పి ఆయుధం చేజారింది.

ఆయుధం నేలను తాకక ముందే తన ఎడమచేతితో దాన్ని అందుకుని, తనను గాయపరిచిన విషకన్య తలని ఖండించాడు యశోధరుడు. తన మీదకు దూకేందుకు సిద్ధంగా ఉన్న మరొక విషకన్యను గమనించి, బలమైన తన పిడికిలితో దాని తలపై ఒక్క దెబ్బవేశాడు. అది చప్పుడు చెయ్యకుండా ప్రాణాలు విడిచి నేల మీద పడింది. ఆ దృశ్యాన్ని చూసి బెంబేలుపడిన విషకన్యలంతా యశోధరుడి నుండి దూరంగా పారిపోయేందుకు సిద్ధపడ్డారు.

"ఆగండి. అక్కడే నిలవండి," అని గద్దించాడు యశోధరుడు. అందరూ ఆగి భయంతో అతడి వైపు చూశారు. "మీ అందరినీ క్షమించి ప్రాణాలతో వదిలేస్తున్నాను," అని హామీ ఇచ్చాడు యశోధరుడు. ఆ మాటతో వాళ్ళంతా కాస్త ఊరట చెందారు. "కానీ ఒక్క షరతు, నేను వచ్చి ఈ రాకుమారిని రక్షించుకుని వెళ్ళిన విషయం ఆ కపాలధ్వజుడికి తెలియకూడదు. అమవాస్యలోపు పూర్తిచేయవలసిన వేరొక కార్యం ఉంది. ఈ విషయం తెలిసిన వెంటనే వాడు అప్రమత్తమై నాకు అవరోధమవుతాడు," అని హెచ్చరించాడు. విషకన్యలంతా ఒకరి మొహాలు ఒకరు చూసుకుని "నరోత్తమా, కపాలధ్వజునికి తెలియకుండా ఈ భూప్రపంచంలో ఏ విషయాన్ని దాచలేం. వాడి వద్ద ఉన్న మాయాకపాలం వాడిని ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంచుతుంది. కానీ కపాలధ్వజుడు ఇప్పుడు దీక్షలో ఉన్నాడు. మూడు రోజులపాటు తన రహస్య స్థావరంలో ధ్యాన నిమగ్నుడై ఉంటాడు. వాడి అనుచరులు కానీ, మాయాకపాలం కానీ దీక్షలో ఉన్న కపాలధ్వజుడిని కదిలించరు. కాబట్టి ఈ వార్త వాడికి చేరేలోపే నీ కార్యం సిద్ధించుకో," అని చెప్పారు.

విషకన్యలతో సంభాషిస్తున్న యశోధరుడి శక్తిని ఎవరో లాగేస్తున్నట్టుగా

బలహీనమవ్వసాగాడు. అతని కళ్ళు నిస్తేజమవుతున్నాయి. అతనిలోని ప్రాణశక్తిని ఎవరో హరించివేస్తున్నట్టయి తూలి కింద పడ్డాడు. మల్లన్న, అమృత పరుగున అతని వద్దకు చేరుకున్నారు. విషకన్య కోరల కారణంగా గాయమైన కుడిచేయి నీలంగా మారింది. ఆ విషం అతడి శరీరంలోకి వ్యాపిస్తోందని గ్రహించిన అమృత, ఖడ్గాన్ని తన చేతులలోకి తీసుకుని "తక్షణమే అతని శరీరంలోని విషాన్ని తొలగించండి," అని విషకన్యలను హెచ్చరించింది.

"రాకుమారీ! మాలో ఎవరి కారణంగా విషం శరీరంలో ప్రవేశించిందో వారే తిరిగి ఉపసంహరించగలరు. అతడిని గాయపరిచిన మా నెచ్చెలి ఇప్పుడు ప్రాణాలతో లేదు. కాబట్టి ఆ విషాన్ని ఉపసంహరించలేం. కానీ ఈ దగ్గరలోనే ఉన్న నల్లనాగుల దీవిలో ఎటువంటి విషాన్నయినా హరించే అశ్వనీగంధ అనే మూలిక లభిస్తుంది. ఆ మూలిక మాత్రమే ఈ నరుడి ప్రాణాలను కాపాడగలదు," అని ఒక విషకన్య చెప్పింది.

అంతవరకూ నెత్తుటి మడుగులో కొనప్రాణాలతో ఉన్న రాకాసినత్త పెద్దగా శబ్దం చేస్తూ ప్రాణాలు విడిచింది. ఆ శబ్దానికి భవనమంతా దద్దరిల్లింది. అక్కడ ఉన్న వారంతా భయంతో చెవులు మూసుకున్నారు. భవనమంతా కంపించటం మొదలయ్యింది. తక్షణమే ఆ భవనం నుండి బయటపడాలని గ్రహించి అందరూ బయటకు పరుగులు తీశారు. అమృత, మల్లన్న చేరోవైపు సాయం చేస్తూ యశోధరుడిని తమతో తీసుకుని బయటకి వచ్చారు. అందరూ చూస్తుండగానే భవనం కుప్పకూలింది.

"సముద్రంలో స్వేచ్ఛాజీవులమై సంచరించే మమ్ములను ఈ రాక్షసుడు పట్టి బంధించి దుష్టకార్యాలెన్నో చేయించాడు. ఆ రాక్షసుడి మరణంతో మాకు తిరిగి స్వేచ్ఛ లభించింది. ప్రత్యుపకారంగా మేం మీ అందరినీ నల్లనాగుల దీవికి చేరుస్తాం," అని చెప్పి విషకన్యలు ఒక్కొక్కరినీ రెండు చేతులతో మోస్తూ, శరవేగంతో ఈదుతూ ఒడ్డుకు చేర్చారు.

"రాకుమారీ, ఇదే నల్లనాగుల దీవి. అత్యంత విషపూరితమైన సర్పాలు సంచరించే ప్రదేశం. ఇక్కడే అశ్వనీగంధ మూలిక లభిస్తుంది. ఆ మూలిక చూసేందుకు బంగారుతీగ లాగా మెరిసిపోతూ ఉంటుంది. ఆ తీగకు పూసే పువ్వులు పంచవర్ణాల్లో ఒక్కోటి ఒక్కో రంగులో పూస్తాయి. నరుల చేయి సోకగానే

ఆ తీగకున్న వెలుగు మాయమవుతుంది. ఆ తీగను చిటికెనవేలు గోరు పరిమాణంలో తుంచి, విష ప్రభావానికి గురైన నరుడి పంటికింద ఉంచండి. అతని శరీరంలోని విషాన్నంతా అది హరించి వేస్తుంది. కానీ జాగ్రత్త, ఆ తీగ ఉండే పరిసరాల్లో భయంకరమైన విషసర్పాలు ఉంటాయి. వీలయినంత త్వరగా ఈ దీవిని విడిచి వెళ్ళండి," అని చెప్పి విషకన్యలంతా అ ప్రదేశాన్ని వదిలి వెళ్ళిపోయారు.

* * *

అమృతను యశోధరుడి వద్దనే ఉండమని చెప్పి మల్లన్న ఆ దీవిలో అశ్వనీగంధ తీగను వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆ దీవి అతడికి ఎంతో విచిత్రంగానూ, భయంకరం గానూ తోచింది. ముందుకు వెళుతున్న కొద్దీ చీకటి చిక్కబడుతూ ఉండటం గమనించాడు. కంగారుపడి వెనకకు చూస్తే సముద్రపు ఒడ్డున మాత్రం పగలు మాదిరి ప్రకాశవంతమైన వెలుగు కనిపించింది. 'ఆ విషకన్యలు చెప్పినమాట సత్యం. త్వరగా సోదరుని రక్షించుకుని ఈ ప్రదేశాన్ని వీడి వెళ్ళాలి,' అని మనసులో అనుకుంటూ ముందుకు అడుగు వేయబోయాడు. చెట్టు చాటున అతి భయంకరమైన పది అడుగుల పొడవున్న సర్పం అతడి కంటపడింది.

భయంతో అతను పెట్టిన కేక గొంతు దాటలేదు. ఆ శబ్దానికి ఆ సర్పం తనని పసిగడుతుందేమో అనే భయంతో నోరు నొక్కుకున్నాడు. ఆ సర్పంలో ఎలాంటి చలనం లేదు. అప్పుడు పరీక్షగా గమనించాడు. అది సర్పం కాదు, సర్పం విడిచిన కుబుసం. ఆ విషయం అర్థమై ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నాడు. ఆ కుబుసం ఉన్నచోటే మెరుస్తూ అతనికి ఒక బంగారుతీగ కనిపించింది. ఆ తీగకున్న పుష్పాలను గమనించాడు. గుత్తులు గుత్తులుగా ఉన్న పుష్పాలన్నీ వేరు వేరు వర్ణాల్లో ఉన్నాయి. దగ్గరలో సర్పాలేమయినా ఉన్నాయేమో అని భయపడుతూ వంగి ఆ తీగను అందుకున్నాడు. అతని చేయి పడిన మేర ఆ తీగ తన కాంతిని కోల్పోయింది. విషకన్యలు చెప్పిన గురుతులన్నీ సరిపోయాయి. ఇదే అశ్వనీగంధ అని రూఢి చేసుకున్నాడు. ఆలస్యం చేయకుండా వెంటనే ఆ తీగను తెంచి పరుగులాంటి నడకతో అమృతను చేరుకున్నాడు.

యశోధరుడి తలను తన ఒడిలో ఉంచుకుని తల్లడిల్లుతూ మల్లన్న రాక

కోసమే ఎదురూ చూస్తూ ఉంది అమృత. మల్లన్న చేతి నుండి ఆ తీగను అందుకుని విషకన్య చెప్పిన పరిమాణంలో తుంచి యశోధరుడి పంటికింద ఉంచింది. లేని బలాన్ని కూడదీసుకుని యశోధరుడు ఆ తీగను కొరికి, నోటిలో ఉంచాడు. ఆ తీగ నుండి ఘాటైన ద్రవం వెలువడి, మెల్లగా అతని గొంతు దిగింది. మల్లన్న, అమృత భయంభయంగా అతడినే చూస్తూ ఉన్నారు. కొన్ని క్షణాలు గడిచిన పిమ్మట గుణం కనిపించటం మొదలయ్యింది.

నల్లబడిన యశోధరుడి ముఖం తేటపడింది. కాసేపటికి గాయంతో నీలంగా మారిన అతని కుడిచేయి సాధారణ వర్ణానికి మారింది. అతడి కళ్ళలో తిరిగి జీవం కదలాడింది. అమృత ముఖంలో దిగులుపోయి చిరునవ్వు ఉదయించింది. మల్లన్న ఆనందంతో “సోదరా, సోదరా!” అంటు కేకలువేశాడు. యశోధరుడు చిరునవ్వుతో మెల్లగా లేచి కూర్చున్నాడు.

అంతలో విషకన్యలు చెప్పిన హెచ్చరిక అమృతకు జ్ఞప్తికి వచ్చి “మనం తొందరగా ఈ దీవి విడిచి వెళ్ళాలి. ఇది భయంకర సర్పాల నివాస స్థలమని విషకన్యలు చెప్పారు,” అని యశోధరుడితో చెప్పింది. వెంటనే మల్లన్న అందుకుని “అవును సోదరా, ఈ తీగను తెచ్చేందుకు నేను వెళ్ళినచోట సర్పం విడిచిన పది అడుగుల కుబుసాన్ని చూశాను. దానిని చూసేపాటికే నా ప్రైప్రాణాలు పైనే పోయాయి. నిజంగా సర్పమే ఎదురయితే ఏం జరిగి ఉండేదో. ఇక్కడ నుండి త్వరగా బయటపడాలి,” అన్నాడు.

ముగ్గురూ మాటల్లో పడి గమనించలేదు కాని అప్పటికే కొన్ని సర్పాలు వీళ్ళున్న వైపు చరచరా పాకుతూ వేగంగా వస్తున్నాయి. యశోధరుడు పంటి కింద ఉంచిన మూలికను బయటపడేసాడు. బంగారురంగులో మెరిసే ఆ మూలిక నల్లగా మారిపోయింది. మల్లన్న గుండెపైన చెయ్యి వేసుకుని “ఎంత విషం, ఎంత విషం,” అని ఆశ్చర్యపోయాడు. ఈ దీవి నుండి ఇప్పుడు బయటకు వెళ్ళేదెలా అని ఆలోచిస్తూ ముగ్గురూ లేచారు. ఆసరికే వచ్చిన సర్పాలన్నీ వారిని చుట్టుముట్టాయి. పడగలు విప్పి బుసలుకొడుతూ ఉన్నాయి. ఆ దీవి పేరుకు సరిపోయినట్టుగా ఆ నాగులన్నీ నల్లగా ఉన్నాయి. వాటి రూపాన్ని చూస్తుంటేనే ముగ్గురిలో గగుర్పాటు మొదలయ్యింది. అన్ని సర్పాలని ఒక్క చోట చూసి బతికున్న మానవమాత్రుడు ఈ లోకంలో ఉండి ఉండడు.

* * *

ఆ సర్పాల మధ్య నుండి దారి చేసుకుంటూ ఒక కాంతి తమ వైపుగా రావటం గమనించాడు యశోధరుడు. ఆ కాంతి వైపు పరీక్షించి చూస్తే ఆ కదిలి వస్తున్నది శిరస్సు పైన మణి కలిగిన ఒక సర్పం అని అర్థమయ్యింది. ఆ సర్పమే ఈ నాగుల నాయకుడని గ్రహించాడు యశోధరుడు. ఆ నాయకుడు ముందుకు వచ్చి మానవ భాషలో "నరులెవరూ ప్రాణాలతో ఈ దీవిని చేరుకోవటం నేను వినలేదు. మిమ్మల్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. మీరు ఈ దీవిలోకి ప్రవేశించటమే మొదటి నేరం. అనుమతి లేకుండా మా వనంలో చొరబడి మా రక్షణలో ఉన్న అశ్వనీగంధ మూలికను తస్కరించటం క్షమించరాని నేరం. ఎవరు మీరు? ఆ మూలికను తుంచి ఇక్కడకు తెచ్చింది వీడే కదా?" అని మల్లన్న వైపు ఎర్రని కళ్ళతో చూస్తూ అడిగాడు.

యశోధరుడు జరిగిన పరిణామాలు వివరించేందుకు ముందుకు వచ్చి నిలబడ్డాడు. ఇంతలో సర్ప నాయకుడు "అయినా ఈ వివరాలతో కాలయాపన ఎందుకు? వ్యర్థం. నేరం చేశారు, దొరికారు. సమస్త నరజాతి భయపడేలాగా వీరిని కాటేసి, కాళయమునికి కబురంపండి," అని నాగులను ఆదేశించి వెనుదిరిగాడు. నాగులన్నీ బుసలు కొడుతూ ముందుకు ఉరికాయి.

మానవ ప్రయత్నంతో ఈ ఆపదను దాటటం కల్ల అని గ్రహించిన యశోధరుడు మనస్సులో నాగకన్యను తలుచుకున్నాడు. మరుక్షణంలో వారి ముందు గొప్ప ప్రకాశంతో నాగకన్య, ఆమె తండ్రి నాగేంద్రుడు ప్రత్యక్షమయ్యారు. ఆ కాంతికి ముగ్గురినీ కాటేసేందుకు ముందుకు వచ్చిన సర్పాలన్నీ నిలిచిపోయాయి. వెళ్ళిపోతున్న సర్ప నాయకుడు కూడా వెనుతిరిగి వచ్చాడు. అప్పటివరకూ భీతిగొలిపే రూపాలతో ఉన్న సర్పాలన్నీ మానవరూపాలను ధరించాయి. ఆ ప్రదేశమంతా దేవతామూర్తులతో వెలిగిపోతూ ఉంది. ఇదంతా అమృతకు విస్మయం కలిగిస్తూ ఉంది.

సర్పనాయకుడు వడివడిగా ముందుకు వచ్చి "నాగకులతిలకా, మహా భుజంగా! స్వాగతం, సుస్వాగతం!" అని ఆహ్వానం పలికాడు. నాగేంద్రుడు సాదరంగా చిరునవ్వు నవ్వి, సర్పనాయకుని చేతులు అందుకుని "నీకు, నీ వారికి శుభమగు గాక!" అని అందరి వైపూ చూశాడు. అందరూ జయజయధ్వానాలు చేశారు. "శుభాశుభాలకు, ధార్మిక జగత్తుకు దూరంగా

క్షుద్రులు, తాంత్రికులు నివశించే ఈ ప్రదేశంలో బతుకుతూ, ఈ తావుకు వచ్చిన జీవుల ప్రాణాలను హరిస్తూ, కర్కోటకులమని పేరు పడి, విషజీవులుగా పుట్టి విషజీవితాన్నే గడుపుతున్న మాకు ఎటువంటి శుభాలు కలుగుతాయి? దేవతలతో సమానులై సంచరిస్తున్న మీది కదా శుభమయమైన జీవనం. మీవంటివారు మా తావులకు రావటమే ఆశ్చర్యకరం కదా?" అని పలికాడు సర్పనాయకుడు.

"సోదరా, నీ వ్యాకులత సమంజసమే. అయినా, క్షేత్రధర్మాలు నిర్ణయించేది మనం కాదు. క్షేత్రపాలనం మాత్రమే మనకు అప్పగించిన భాద్యత. ఆ కార్యాన్ని మీరంతా త్రికరణశుద్ధితో నెరవేరుస్తున్నారు. ఈశ్వరాజ్ఞాపాలన సర్వదా పరమేశ్వరునకు ప్రీతిపాత్రమే. మీరునూ పూజనీయులే," అని సర్పనాయకుడిని ఉత్సాహపరిచాడు.

ఆ విధంగా కొనసాగుతున్న సంభాషణకు అడ్డుపడుతూ "పితృసమానులైన నాగులక్షేత్ర నాయకులకు ఇవే నా వందనాలు. మేము ఇక్కడకు రావటానికి కారణం అడుగో ఆ నరోత్తముడు. అతడు విరోధి కాదు. కాళభైరవుడనే మాంత్రికునికి చిక్కి బలికావలసిన నా ప్రాణాలను కాపాడిన వీరుడు," అని చెప్పింది నాగకన్య. "మా కుమార్తెను మాకు దక్కించి, మిక్కిలి మేలు చేసిన ఈ నరుడిని ఆపత్సమయంలో ఆదుకోవలసిన ధర్మం నాపై ఉండి ఇక్కడకు వచ్చాను," అని నాగేంద్రుడు చెప్పాడు.

యశోధరుడు ముందుకు వచ్చి "సర్పనాయకా, సముద్రగర్భంలో విషకన్యల దాడిలో విషప్రయోగానికి లోనై, ప్రాణరక్షణకోసం ఇక్కడకు వచ్చి అశ్వనీగంధ మూలికను ఉపయోగించిన మాట వాస్తవం. ఈ ప్రదేశ నియమాలు, ఆ మూలికా రక్షణలో మీ బాధ్యత తెలియక చేసిన నేరాలే తప్ప, మీ పట్ల గౌరవభంగమని భావించవద్దని మనవి," అని చెప్పాడు.

సర్పనాయకుడు శాంతించాడు. ప్రసన్నవదనంతో "మేలుచేసిన వారికి కీడు చేసేవారం కాదు. ఇప్పుడు మీరు కూడా మా అతిథులే," అని చెప్పాడు. "నల్లనాగుల దీవి అంటే మృత్యువేనని భావించి, ఇటు వచ్చిన జీవే లేదు. రాక రాక వచ్చిన అతిథులను ఊరకనే పంపించం. నల్లనాగులారా ఏర్పాట్లు చెయ్యండి. మన ఆతిథ్యంతో అందరి మన్ననలు పొందాలి," అని ఉత్సాహపడ్డాడు సర్పనాయకుడు.

ప్రాణాలను హరించేందుకు బుసలుకొట్టిన వారే మిక్కిలి వినయంతో స్వాగత సత్కారాలు మొదలుపెట్టారు. క్షణాల్లో మారిపోయిన పరిస్థితులకు విస్తుపోతూ, ఆపద తప్పినందుకు అమృత, మల్లన్న ఆనందపడ్డారు. ఎంతో క్లిష్టమైన అవరోధాలను అధిగమించి తనను కాపాడవచ్చిన యశోధరుడిపై అమృతకు గౌరవాభిమానాలు కలిగాయి.

* * *

అడవిలో కొంత దూరం వెళ్ళాక వారికి ఒక గొప్ప నగరం కనిపించింది. ఆ నగరం పెద్ద పెద్ద భవనాలతో, విశాలమైన వీధులతో ఉంది. ఆ వీధుల గుండా సాగి ఒక రాజభవనానికి చేరుకున్నారు. ఆ భవన నిర్మాణం దేవతలకు మాత్రమే సాధ్యం. ఎత్తైన, రత్నాలు పొదగిన స్తంభాలు, రంగురంగుల కుడ్యాలు, విశాలమైన గదులు, బంగారు సింహాసనాలు, పట్టు పరుపులు, సువాసనను వెదజల్లే ధూపాలు, అడుగులకు మడుగులొత్తుతున్న సుందరీమణులతో ఆ రాజభవనం స్వర్గాన్ని తలపిస్తోంది. చావుకు పుట్టినిల్లులా కనిపించి భయపెట్టిన దీవిలో ఇంతటి సుందర నగరమా అని మల్లన్న ఆశ్చర్యపోయాడు.

అందరూ ఆ భవనంలో ఉన్న విశాలమైన సభామందిరాన్ని చేరుకున్నారు. నాగేంద్రునికి తన సింహాసనాన్నిచ్చి గౌరవించాడు సర్పనాయకుడు. నాయకుని ఆదేశంతో అతని అనుచరులు మిగిలిన అతిథులకు కూడా సముచిత ఆసనాలు ఏర్పాటు చేశారు. అందరూ బడలిక మరిచి సంభాషించుకోసాగారు.

కాళభైరవుని మందిరంనుండి యశోధరుడు తమను కాపడిన వృత్తాంతం నాగకన్య, మల్లన్న చెబుతున్నప్పుడు అమృత ఆసక్తిగా విన్నది. వజ్రాయుధాన్ని సాధించటానికి ప్రాణత్యాగం చేయటానికి సిద్ధపడ్డాడని చెప్పినపుడు కళ్ళను పెద్దవిచేసి చూస్తూ అబ్బురపడింది. తన ప్రాణాలుపోయినా వేరొకరు వచ్చి కాళభైరవుని సంహరిస్తే, లోకానికి మంచి జరుగుతుందన్న అతని ఆలోచన, త్యాగం ఆమె మనసుని చూరగొన్నాయి. భీకర యుద్ధంలో కాళభైరవుడిని చిత్తుచేసి సంహరించిన విషయం చెప్పినప్పుడు పసిపాపవలె సంభ్రమానికి లోనై “భలే, భలే,” అని చప్పట్లుకొట్టింది. అమృత మనస్సులో యశోధరుడి పట్ల ఆరాధన మొదలయ్యింది. అతని తోడు తనకు శాశ్వతంగా లభిస్తే చాలు, జీవితమంతా

ఆనందదాయకమే కదా అనుకుంది. అంతలోనే ఒక పురుషుని పైన ప్రేమ, అనురాగం, అతనితో వివాహం వంటి ఆలోచనలు కలగటం తన జీవితంలో ఇదే మొదటిసారి అన్న స్పృహ రాగానే సిగ్గుతో ఆమె ముఖం ఎర్రబడింది. తనను ఎవరైనా గమనిస్తున్నారేమో అని కంగారుగా చుట్టూ చూసింది.

అక్కడున్న వారంతా విందు, వినోదాల ఏర్పాట్లు చేస్తూ ఉత్సాహంగా అటుఇటూ పరుగులు తీస్తున్నారు. మల్లన్నకు భలే సంబరంగా ఉంది. దినదిన గండంగా గడుస్తున్న తన జీవితంలో, ఇలాంటి ఒక రోజు వస్తుందని అతను అనుకోలేదు. ఈ రోజుకి ఏ ప్రాణభయం లేకుండా హాయిగా విందు ఆరగించి, విశ్రాంతి తీసుకోవచ్చు అని ఆలోచిస్తూ ఆనందపడుతున్నాడు. యశోధరుడు అందరిలో కలిసి ఉన్నా అతని ఆలోచనలు మాత్రం భల్లూకదీవి వైపుగా సాగుతున్నాయి. మరో రెండు రోజుల్లో అమావాస్య. అప్పటికి ఎలా అయినా ఆ దీవిని చేరుకుని రాజదంపతులిద్దరినీ రక్షించాలి. అతని ముందున్న కొండంత బాధ్యత వల్ల, మనస్సు విందు వినోదాలను కోరుకోవటం లేదు.

కానీ అతని ఆలోచనలను భగ్నంచేస్తూ సర్పనాయకుడు, నాగేంద్రుడు వచ్చి భోజన మందిరానికి ఆహ్వానించారు. యశోధరుడు చిరునవ్వుతో వారి ఆహ్వానాన్ని మన్నించి ముందుకు కదిలాడు. నాగకన్య వచ్చి విశ్రాంతికోసం అమృతను ప్రత్యేక మందిరానికి తోడ్కొనిపోయింది.

యశోధరుడూ, నాగేంద్రుడూ సర్పనాయకుడి వెంట విశాలమైన భోజన మందిరంలోకి అడుగు పెట్టారు. అతిథుల గౌరవార్థం విశేషమైన విందు ఏర్పాటు చేశారు. కనీవిని ఎరుగని మధుర ఫలాలను తీసుకుని వచ్చారు. రుచికరమైన పదార్థాలు, పానీయాలు వండి వడ్డించారు. వినోదం కోసం సుందరీమణులు ఆడి, పాడారు.

భోజనానంతరం సర్పనాయకుడు "యశోధరా, నువ్వు మా నాగకన్యను రక్షించిన వృత్తాంతం, ప్రాణాపాయస్థితిలో అశ్వనీగంధం కోరి రావటం అవగతమయినది. కానీ మనుషులు సంచరించటానికి అనుకూలమైన పరిధి దాటి, ఈ అడవులు, సముద్రాలు దాటి ఈ దీవుల వైపు ఎందుకు వచ్చావు? మనుషుల సాధారణ శక్తిని మించి అతీంద్రియశక్తి, క్షుద్రశక్తి కలిగిన జీవులు సంచరించే ఈ ప్రదేశాలకు నీవంటి వారు రాకూడదు సుమా," అని మందలించాడు.



"సర్పనాయకా, మా గురువులు బిల్వకమునీంద్రుల ఆదేశంతో మొదలైన నా ప్రయాణం ఇక్కడి వరకూ సాగింది. ఇది దైవనిర్ణయంగా భావిస్తున్నాను. మా గురుదేవుల ఆశీస్సులతో, సహచరుల సహకారంతో, దివ్యశక్తులు కలిగిన మీలాంటి వారి అండతో మహానగరం అనే శ్రీశిఖరపురం యువరాణి అమృతను కాపాడగలిగాను. మరొక్క బాధ్యత నాపై మిగిలిపోయింది. రానున్న అమావాస్యలోపు మహానగర చక్రవర్తి ఫణిభూషణుడిని, మహారాణి మధురభాషిణినిని రక్షించి మహానగరానికి తీసుకుని వెళ్ళాలి. కాబట్టి నా ఈ ప్రయాణంలో చివరి మజిలీ భల్లూకదీవి లోని కపాలదుర్గం," అని వినయంగా యశోధరుడు తన వృత్తాంతాన్ని వివరించాడు.

భల్లూకదీవి పేరు వినగానే సర్పనాయకుడి భృకుటి ముడిపడింది. "యశోధరా, నీకు గాని మతిపోలేదు కదా. భల్లూకదీవికి ఒక మనిషి వెళ్ళటమా?

వెళ్ళి, ప్రాణాలతో తిరిగి రావటమా? నీ సాహసాన్ని చాలించి మీ గురువుల వద్దకు వెళ్ళి జరిగింది వివరించు. ఈ లోకంలో అన్ని తప్పులనూ సరిచేసే బాధ్యత నీది కాదు. శక్తికి మించిన కార్యానికి పూనుకుని, ప్రాణాల మీదకి తెచ్చుకోకు," అని గంభీరమైన స్వరంతో చెప్పాడు.

"మీరు నా మీదగల దయతో అలా చెబుతున్నారు. కానీ ఆపదలో ఉన్న చక్రవర్తిని వదిలి వెనకకు ఎలా వెళ్ళగలను? తల్లిదండ్రులను కోల్పోయి ఆ సుకుమారి అమృత ఎలా బతకగలదు? ప్రాణాలకు భయపడి పారిపోయి వచ్చానని మా గురువులకు ఎలా చెప్పగలను? వారు హర్షిస్తారా? ఆయన నేర్పిన విద్యకు ఇది అవమానం కాదా? కానున్నది కాక మానదు. మీకు నా మీద వాత్సల్యం ఉంటే ఆ దీవికి వెళ్ళే మార్గాన్ని చెప్పండి. అక్కడ ఎదురయ్యే ఆపదలను వివరించండి. నా శక్తియుక్తులన్నీ ఉపయోగించి ఎలా అయినా రాజదంపతులను కాపాడతాను," అని స్థిరమైన కంఠంతో అన్నాడు.

యశోధరుడి మొండి పట్టుదల సర్పనాయకునికి కాస్త చికాకు కలిగించినా, ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకే తాను నేర్చుకున్న విద్యలను వినియోగిస్తున్న అతడి నిబద్ధత, త్యాగం అతడి మనసుని చూరగొన్నాయి.

"విషప్రయోగానికి లోనై ఇప్పుడే తెరిపిన పడ్డావు. ఈ రోజుకి ఇక్కడ విశ్రాంతి తీసుకో. రేపు నేనే నిన్ను స్వయంగా భల్లూకదీవికి తీసుకుని వెళతాను," అని చెప్పి విశ్రాంతి మందిరాన్ని చూపించాడు సర్పనాయకుడు. నాగేంద్రుడు కూడా తనకోసం సిద్ధం చేసిన మందిరం వైపు కదిలి వెళ్ళాడు.

కడుపు నిండా విందారగించిన మల్లన్న భుక్తాయసంతో భారంగా నడుస్తూ యశోధరుడిని వెతుక్కుంటూ విశ్రాంతి మందిరానికి వచ్చాడు. "ఏం మల్లన్నా, ఆకలి తీరిందా?" అని అతడి అవస్థను చూస్తూ అడిగాడు యశోధరుడు. మలన్నకు బదులిచ్చేందుకు కూడా ఓపిక లేదు. విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన పట్టు పరుపులు చూడగానే అతనికి నిద్ర కమ్ముకుని వచ్చింది. క్షణాల్లో పెద్దగా గురక పెడుతూ నిద్రలోకి జారుకున్నాడు. యశోధరుడు అతడిని చూసి నవ్వుకుంటూ నిద్రకు ఉపక్రమించాడు. ఎన్నో రోజులుగా పడుతున్న శ్రమంతా తీరిపోయేలా గాఢనిద్రలోకి జారుకున్నాడు.

* * *

విశ్రాంతి మందిరంలో అమృతకు అన్నపానీయాల మీద ఆసక్తి కలగటం లేదు. ఏదో పరధ్యానంలో ఉంది. ఆమె అవస్థను గ్రహించిన నాగకన్య "అమృతా దేవీ, ఆపద నుండి బయటపడ్డాక కూడా ఆకలిదప్పులు లేవంటే అది చాలా ప్రమాదకరమైన వ్యాధి సుమా," అని కొంటెగా నవ్వింది. అమృత అమాయకంగా "ప్రమాదకరమైన వ్యాధా? ఏమిటది? ప్రాణాలను హరిస్తుందా?" అని అడిగింది. "విరహమని ప్రేమలో ఉన్నవారికి కలిగే వ్యాధి. ప్రాణాలను తీయదు, సుఖంగా ఉండనీయదు," అని గట్టిగా నవ్వింది నాగకన్య. ప్రేమ, విరహం అనే పదాలు విని సిగ్గుతో తలదించుకుంది అమృత.

"తొలిసారి కలుగుతున్న భావనలు కాబట్టి నీకు తెలియటం లేదు కానీ ఇది ఆ అవస్థే. ఇంతకీ నీ మనసును దోచుకున్న సుందరాంగుడెవరమ్మా? ఆ మల్లన్నే కదా!" అని మేళమాడింది నాగకన్య. మల్లన్న పేరు వినగానే చురుక్కున వెనుతిరిగి కోపంగా చూసింది ఆమృత.

"అమ్మో, కోపమే," అని పకపకా నవ్వి "తెలిసిందిలే! ఈ ఆపసోపాలన్నీ ఆ యశోధరుడి గురించే కదా. అతడు నిజంగా మనోహరుడు, జగదేకవీరుడు. అన్నింటికీ మించి గొప్ప హృదయం కలవాడు. అటువంటివాడి అనురాగం పొందటం గొప్ప వరం. అతని మనసులో మాత్రం ఇంకా ఈ ప్రేమ కుసుమం వికసించలేదు. నీ తల్లిదండ్రులను కాపాడే వరకూ అతడి ఆలోచనలు ఆ బాధ్యతల చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. అంతవరకూ ఓపిక పట్టు. నీ కోరిక తప్పక తీరుతుంది," అని ఆప్యాయంగా చెప్పింది నాగకన్య. ఆమృత ఆనందంతో నాగకన్యను ఆలింగనం చేసుకుంది.

"ఇంక ఈ ఆలోచనలు మాని హాయిగా విశ్రాంతి తీసుకో," అని చెప్పి నాగకన్య అక్కడ నుండి వెళ్ళిపోయింది. నాగకన్య చెప్పిన మాటల వల్ల కలిగిన ఆనందంతో అమృత మనస్సులో ఉన్న ఆందోళనలు తొలగి ప్రశాంతంగా నిద్రపోయింది.

అప్పటి వరకూ కోలాహలంగా, సందడిగా కనిపించిన నల్లనాగుల దీవి మొత్తం నిద్రలో జోగుతోంది. నిత్యం చీకటిలో కాపాలాకాసే వాళ్లు కూడా అలసిపోయి నిద్రమత్తులో ఉన్నారు. వీరెవరికీ తెలియని విషయం ఏమిటంటే కపాలధ్వజుడి భల్లూకాలు ఆకాశంలో ఎగురుతూ అక్కడున్న చిన్నచిన్న

దీవులన్నింటినీ గాలిస్తున్నాయి. పగడాలలోయలోని మందిరం నుండి అమృత తప్పించుకుందనే విషయం ధ్యానంలో ఉన్న కపాలధ్వజుడికి తెలిసేలోపుగా ఆమెను తిరిగి బంధించి తీసుకువచ్చేందుకు కపాలధ్వజుడి అధీనంలో ఉన్న శక్తులన్నీ బయలుదేరాయి.

అలా దీవులన్నీ గాలించి ఎక్కడా అమృత జాడ కనిపించక విసుగు చెందిన భల్లూకాలు నల్లనాగుల దీవిని చేరుకున్నాయి. కానీ అప్పటికే సూర్యోదయ సమయం కావొస్తోంది. దినకరుని కిరణాలు మెల్లగా నల్లనాగుల దీవిపై ప్రసరిస్తున్నాయి. తమ రాకను నల్లనాగులు గుర్తిస్తే వారు వెంటనే తమపై దాడి చేస్తారని భల్లూకాలకు తెలుసు. వారితో పోరాటం కొత్త సమస్యను కొని తెచ్చుకోవటమే తప్ప ప్రయోజనం లేదు. కాబట్టి నేటికి వెతుకులాట ఆపి తిరిగి వెళ్ళిపోవటం శ్రేయస్కరం అని భావించాయి భల్లూకాలు. రాత్రికి మళ్ళీ వచ్చి నల్లనాగుల దీవిని గాలించవచ్చు అని నిర్ణయించుకుని అక్కడి నుండి వెళ్ళిపోయాయి. ఆకాశాన్ని కమ్మిన నల్లని గబ్బిలాల గుంపులా ఎగిరివెళుతున్న ఆ భల్లూకాలను నల్లనాగుల దీవిలో ఎవరూ గమనించలేదు.

* * *

ఉదయాన్నే యశోధరుడు ఉత్సాహంగా లేచాడు. భల్లూకదీవికి ప్రయాణం అయ్యేందుకు సిద్ధమయ్యాడు. ప్రమాదకరమైన ఈ ప్రయాణానికి మల్లన్నను, అమృతను దూరంగా ఉంచాలని అతని ఆలోచన. అందుకే వారు చూడక ముందే అక్కడ నుండి వెళ్ళిపోవాలని భావించాడు. నాగకన్యను కలుసుకుని అమృతను ఏదైనా భద్రమైన చోటుకు తీసుకుని వెళ్ళమని కోరాడు. ఇంతలో సర్పనాయకుడు అక్కడకి చేరుకున్నాడు. అతని మనస్సులో శంక ఇంకా అలాగే ఉంది. సాధారణ మానవుడైన యశోధరుడు కపాలధ్వజుడి వంటి మహా మాంత్రికుడిని ఎదుర్కోవటం ఆత్మహత్యా సదృశ్యమని అతని భావన.

సర్పనాయకుడిని చూడగానే ఉత్సాహంగా ముందుకు కదిలిన యశోధరుడు “అమృత, మల్లన్న చూడకముందే మనం భల్లూకదీవికి బయలుదేరుదాం. వారిని కూడా తీసుకుని వెళ్ళి ప్రమాదాలకు గురిచేయటం నాకు ఇష్టం లేదు. మనం వెళ్ళాక నాగకన్య వారిని సముదాయించి సురక్షితమైన ప్రదేశానికి చేరుస్తుంది,” అని అన్నాడు.

అతడి మాటలకు అంగీకార సూచకంగా తల పంకించి ముందుకు దారితీశాడు సర్పనాయకుడు. వారిరువురూ నడుచుకుంటూ భవనం వెలుపలికి వచ్చేసరికి అమృత, మల్లన్న అక్కడ సిద్ధంగా ఉన్నారు. వారిని చూసి ఆశ్చర్యపోవటం యశోధరుడి వంతయ్యింది. తనతో రావద్దని వారించేందుకు ప్రయత్నించాడు.

"నన్ను, మా కుటుంబాన్నీ కాపాడేందుకు వచ్చిన మిమ్మల్ని ప్రమాదకర ప్రదేశాలకు ఒంటరిగా వెళ్ళనివ్వటం నాకు సమ్మతం కాదు. ఆపదలు ఎదురైతే నన్ను మీరు కాపాడగలరనే నమ్మకం ఉంది. మీకు ఏదైనా ప్రమాదం జరిగితే మిమ్మల్ని రక్షించుకోవాల్సిన బాధ్యత నాదే," అని యశోధరుడితో స్థిరంగా చెప్పింది.
"సోదరా, నేను కూడా నీ వెంటే. కాదని ఇక్కడే ఉన్నా నా మనసంతా ఆందోళనగా ఉంటుంది," అని మల్లన్న కూడా తన మనుసులో మాట చెప్పాడు. వారిని మాటలతో ఒప్పించి అక్కడ ఉంచటం సాధ్యమయ్యే పని కాదని గ్రహించిన యశోధరుడు చేసేది లేక అంగీకరించాడు.

"యశోధరా, ఈ సర్పనాయకుడు నిన్ను భల్లూకదీవికి చేరుస్తాడు. ఈ ఆఖరి పోరాటంలో ఆ దేవదేవుడి సహకారం నీకు లభిస్తుంది. ఇక మాకు సెలవు," అని చెప్పి నాగేంద్రుడు, నాగకన్య అదృశ్యమయ్యారు.

సర్పనాయకుడు తన అనుచరులతో సముద్రతీరం వైపు కదిలాడు. యశోధరుడు, అమృత, మల్లన్న వారిని అనుసరించారు. నల్లనాగులు అప్పటికి ఒక పడవను సిద్ధంగా ఉంచారు. ఆ పడవకు ముందుభాగంలో ముగ్గురు, వెనక భాగంలో ముగ్గురు తెడ్లు పట్టుకుని ఉన్నారు. సర్పనాయకుడు ముందుగా యశోధరుడిని పడవ ఎక్కమని సైగచెయ్యటంతో అతను ఎక్కి కూర్చున్నాడు. అతని వెంటే మిగిలిన ఇద్దరూ ఎక్కారు. సర్పనాయకుడు పడవ ఎక్కి కూర్చుని, పడవను నడిపమని నల్లనాగులకు ఆదేశం ఇచ్చాడు. వెంటనే వారు తెడ్లు వెయ్యటం మొదలు పెట్టారు. పడవ ముందుకు కదిలింది.

అందరూ పరిసరాలు గమనిస్తూ ఉన్నారు. సముద్రంలో కాస్త ముందుకు వెళ్ళగానే దూరంగా అనేక చిన్నచిన్న దీవులు వారికి కనిపించాయి. సర్పనాయకుడు ఆ దీవుల విశేషాలు వివరించాడు. ఆ దీవులలో దాగిన రహస్యాలు, అక్కడ దొరికే అద్భుత ఔషధ మూలికలు, వింత జంతువుల వివరాలు విని ఇంత



విశాల సృష్టిలో మానవునికి తెలిసింది అణుమాత్రమే కదా అని ముగ్గురూ ఆశ్చర్యపోయారు.

కొంతవరకూ ఆహ్లాదంగా సాగిన సముద్ర ప్రయాణం మెల్లగా కల్లోలంగా మారింది. వీచేగాలిలో వేగం పెరిగింది, దూరం నుండి వినిపిస్తున్న శబ్దాలు భయాన్ని కలిగిస్తున్నాయి. దూరంగా నల్లని అస్పష్ట ఆకారాలు వీరినే కోపంగా చూస్తున్నట్టు అనిపించసాగింది. "నేను ముందే చెప్పినట్టు మానవ సంచారానికి దూరంగా ఉన్న ఈ దీవులన్నీ అతీంద్రియ శక్తులకు ఆలవాలమై ఉంటాయి.

దుష్టశక్తులెన్నో ఈ దీవుల్లో నిక్షిప్తమైన ప్రకృతి శక్తులను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ ఉంటాయి. అపరిచితులు ఇటుగా వస్తే ఆ దుష్టశక్తులు దాడిచేసేందుకు ప్రయత్నిస్తాయి. మనం ఇప్పుడు అలాంటి దుష్టశక్తులున్న దీవులను సమీపిస్తున్నాం," అని చెప్పాడు సర్పనాయకుడు.

మరి కొంతసేపు ప్రయాణించాక పడవ ఒక దీవికి అతి సమీపానికి చేరుకుంది. సర్పనాయకుడి ఆజ్ఞతో పడవ నడుపుతున్న నల్లనాగులు పడవను అక్కడ నిలిపారు. "యశోధరా, ఆ కనబడుతున్నదే భల్లూకదీవి. మా దీవులకున్న అంతర్గత ఒప్పందాల మేరకు ఒక దీవి అంతరంగిక విషయాల్లో మరొకరు జోక్యం చేసుకోవటం నిషిద్ధం. ఒక దీవి నాయకుడిగా నేను ఆ నియమాలకి కట్టుబడి ఉన్నాను. కాబట్టి నేను మీతో ఆ భల్లూకదీవిలో ప్రవేశించలేను. మిమ్మల్ని ఆ తీరానికి చేర్చిన వెంటనే మేం ఇక్కడి నుండి నిష్క్రమిస్తాం. కానీ మీ మంచిని కోరేవాడిగా నేను చెప్పేది శ్రద్ధగా వినండి. ఈ భల్లూకదీవిలో నిక్షిప్తమైన అనేక శక్తులను సొంతం చేసుకునేందుకు ఎందరో ఈ దీవిలో జపతపాలు చేసేవారు. కపాలధ్వజుడు కూడా అలానే తపస్సు చేసేందుకు ఇక్కడకు వచ్చి తన తాంత్రికశక్తులతో ఈ దీవిని వశం చేసుకున్నాడు. అతను అత్యంత శక్తిమంతుడు. ఈ దీవిలో నివసించే ఎందరో మునులను పక్షులుగా, జంతువులుగా, శిలలుగా మార్చివేశాడు. అతను తన ధ్యానాన్ని ముగించుకుని ఇక్కడకు రాకముందే మీరు రాజదంపతులను విడిపించుకుని వెళ్ళిపోవాలి సుమా," అని చెప్పాడు సర్పనాయకుడు.

"మీరు చేసిన సహాయాన్ని, చూపించిన ఆదరణను మేం ఎప్పటికీ మరిచిపోలేం. మీరు చెప్పినవన్నీ మదిలో ఉంచుకుని సాధ్యమైనంత త్వరగా మా కార్యాన్ని పూర్తి చేసుకుని వెళతాం," అని చెప్పి నమస్కరించాడు యశోధరుడు.

పడవ ముందుకు సాగి తీరాన్ని చేరుకుంది. యశోధరుడు, మల్లన్న, అమృత పడవ దిగి మరొక్కసారి సర్పనాయకుడికి నమస్కరించారు. పడవ తిరిగి నల్లనాగుల దీవి వైపుగా సాగిపోయింది. దీవిలో దిగిన ముగ్గురూ పరిసరాలను గమనించారు. దూరంగా ఒక రాళ్ళగుట్ట కనిపించింది. అక్కడకు చేరుకుంటే ఆ పెద్ద పెద్ద బండరాళ్ళ వెనక దాగి కపాలధ్వజుని అనుచరుల సంచారాన్ని గమనించవచ్చని భావించారు. ముగ్గురూ నెమ్మదిగా నడుచుకుంటూ ఆ గుట్టను

చేరుకుని, రాళ్ళ మధ్యన దాగి దీవి వైపు చూశారు. దూరంగా భయంకరమైన కపాలదుర్గం వారికి కనబడింది.

* * *

మానవ కపాలాన్ని పోలిన మహానిర్మాణం ఆ కపాలదుర్గం. చూసేందుకు అత్యంత భయాన్ని కలిగిస్తున్న ఆ నిర్మాణం ఖచ్చితంగా కపాలధ్వజుడి మాయా సృష్టే. ఎలాంటి శక్తులను ఇక్కడ రక్షణగా ఉంచాడో అని ఆలోచిస్తూ నిశితంగా గమనిస్తున్నాడు యశోధరుడు. పరిశీలనగా చూస్తున్న అతనికి కపాలధ్వజుడి సైన్యం కనిపించింది. తోడేలు ముఖం కలిగిన సైన్యం కోట బురుజులపై ఉంటే, శునకముఖ రాక్షసులు కోటద్వారం వద్ద కాపలా ఉన్నారు. కోట పైన ఆకాశంలో భల్లూకాలు ఎగురుతూ ఉన్నాయి. ఈ రక్షణ వలయాన్ని దాటి చిన్న చీమ కూడా లోపలికి వెళ్లలేదని యశోధరుడికి అర్థమయ్యింది. యశోధరుడి ఆలోచనలను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ అతని పక్కనే నిలబడి ఉంది అమృత. ఒక బండరాయి చాటున కూర్చున్న మల్లన్న గుండె దడదడా కొట్టుకుంటోంది.

"ఇప్పుడు మనకు ఆలోచించుకునే సమయం లేదు. నేను ఎలా అయినా ధైర్యం చేసి ముందుకు వెళతాను. మీరు మాత్రం ఇక్కడే ఉండండి. ఒక వేళ నాకు ఏదైనా ఆపద సంభవిస్తే, మీరు ఎలా అయినా ఈ దీవి నుండి తప్పించుకుని వెనక్కి వెళ్ళిపోండి," అని చెప్పి తన వజ్రాయుధాన్ని అందుకున్నాడు యశోధరుడు. "చీకటిపడే వరకూ ఆగి దాడి చేయటం మేలు. ఇప్పుడైతే ఒకేసారి అందరూ చుట్టుముడతారు," అని తన ఆలోచన చెప్పింది అమృత. "రాత్రైతే రాక్షసుల బలం రెట్టింపవుతుందని మా బామ్మ చెప్పేది," వణుకుతూ అన్నాడు మల్లన్న. ముగ్గురూ మాట్లాడుకుంటూ ఉండగా పెద్ద శబ్దం వినిపించి వెనక్కి తిరిగి చూశారు. ఒక పెద్ద బండరాయి గాల్లో ఎగురుతూ వీరి వైపే దూసుకు వస్తోంది. ముగ్గురూ చప్పున పక్కకి తప్పుకున్నారు.


ఆ బండరాయి నేరుగా వచ్చి అంతవరకూ వీరు దాక్కున్న రాళ్ళపై పడింది. ఆ రాళ్ళన్ని పిండి పిండి అయ్యాయి. ఆ బండరాయి వచ్చిన వైపుగా చూస్తే మకర ముఖం కలిగిన రాక్షసులు సముద్రంలో నుండి ఒక్కరొక్కరుగా బయటకు

వస్తున్నారు. పరులెవరో తమ దీవిలో ప్రవేశించారని ఆ మకరసైన్యం గుర్తించింది. దాడి చేసేందుకు భయంకరంగా అరుస్తూ, చేతికి దొరికిన బరువైన వస్తువులు వీరి వైపే విసురుతూ దూసుకు వస్తున్నారు. ముందు చూస్తే మకరసైన్యం, వెనుక దీవి వైపు చూస్తే తోడేలుసైన్యం, తప్పించుకునే దారిలేదని ముగ్గురికి అర్థమయ్యింది. ఇద్దరినీ తన వెనకే ఉండమని చెప్పి యశోధరుడు ముందుకి దూకాడు. ముందుగా తనని సమీపించిన మకర రాక్షసుడి తల ఒక్క వేటులో ఖండించాడు.

తమ సహచరుడి మరణాన్ని చూడగానే మిగిలిన రాక్షసులు రెచ్చిపోయి గట్టిగా అరుస్తూ ముందుకు వచ్చారు. ఒకేసారి నలుగురు రాక్షసులు యశోధరుడి మీద దాడిచేశారు. ఆ మెరుపుదాడికి అతను తూలి కిందపడ్డాడు. ఆ నలుగురూ అతని మీద పడబోయారు. ఒడుపుగా తప్పుకున్న యశోధరుడు తన ఆయుధానికి పనిచెప్పాడు. మరికొందరు రాక్షసులు అమృత వైపు దూసుకుని వచ్చారు. అమృత ఏ మాత్రం జంకు లేకుండా కింద పడి ఉన్న ఒక ఆయుధాన్ని అందుకుని వారిని అడ్డుకుంది. యశోధరుడు, అమృత ఒకరిని మించి ఒకరు తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఆ మకరసైన్యాన్ని ఎదుర్కొంటున్నారు. వారి గురువుల శిక్షణ, కఠోర సాధన ప్రకటితమయ్యేలా వారు చేస్తున్న పోరులో రాక్షసుల తలలు ఒక్కొక్కటిగా ఎగిరి పడుతున్నాయి.

ఆ కోలాహలాన్ని కోట బురుజుల పైన ఉన్న తోడేలు రాక్షసులు గమనించారు. ప్రమాద సంకేతంగా తలలు పైకెత్తి గట్టిగా ఊళలు వేయసాగారు. సంకేతాన్ని అందుకున్న శునకరాక్షసులు ముందుకు ఉరికారు. ఆకాశంలో ఎగురుతున్న భల్లూకాలు కూడా అటువైపుగా కదిలాయి. మకరసైన్యం వలయంగా ఏర్పడి దాడిచేస్తూ ఉంది. వలయం మధ్యలో చెరోవైపు నిలిచి యశోధరుడు, అమృత ఆ దాడిని తిప్పి కొడుతున్నారు. వారిద్దరి మధ్యలో మల్లన్న బితుకుబితుకుమంటూ ఉన్నాడు. భల్లూకాలు ఎగురుతూ తమ వైపే రావటాన్ని మల్లన్న గమనించాడు. యశోధరుడు, అమృతలను హెచ్చరించాడు. కానీ వారు ఒక్క క్షణం కూడా ఆగి చూసే పరిస్థితి లేదు. క్షణక్షణానికి మకరసైన్యం పెరిగిపోతూ ఉంది. చస్తున్నకొద్దీ వస్తూనే ఉన్నారు.

ఆకాశంలో ఎగురుతూ వస్తున్న భల్లూకాల్లో రెండు సంధించిన బాణాల్లా



కిందకు దూసుకు వచ్చాయి. మరొక్క క్షణంలో ఆ రెండు భల్లూకాలు తమ మీదపడతాయి అని గమనించిన మల్లన్న గట్టిగా కేక వేసి కళ్ళు మూసుకున్నాడు. అతని అరుపులకి జరగబోతున్నది గ్రహించిన యశోధరుడు, అమృత ఒకేసారి

గాలిలోకి ఎగిరి, మెరుపులా కదిలి ఒకే బలమైన వేటుతో భల్లూకాల రెక్కలను ఖండించారు. రెక్కలు తెగిన శరీరం నుండి రక్తం మకరసైన్యంపై వర్షంలా కురిసింది. భల్లూకాల మొండాలు మకరసైన్యంపై పడి కొందరు మకర రాక్షసులు చచ్చారు. ఆ దృశ్యాన్ని చూసిన మల్లన్నకు భయం, విస్మయం ఒకేసారి కలిగాయి. యశోధరుడు, అమృతల పట్ల అతని గౌరవం, అభిమానం మరింత పెరిగాయి.

మరోవైపు మకరరాక్షసులు తత్తరపాటుకు లోనయ్యారు. ఆ భల్లూకదీవిలో కానీ, కపాలధ్వజుని రాక్షససైన్యంలో కానీ అత్యంత శక్తిమంతమైనవి భల్లూకాలే. అలాంటి భల్లూకాలని ఒక్క దెబ్బలో కిందపడెయ్యటం చూసి రాక్షసులంతా లిప్తపాటు భయానికి లోనై ఎక్కడివారు అక్కడే నిలబడిపోయారు. వారి అడుగులు ముందుకు పడటంలేదు. ఉరుకుతూ వచ్చిన శునకరాక్షసులు కూడా దూరంగా నిలిచిపోయారు. ఎవరూ ఎవరి మీదా దాడి చెయ్యటంలేదు. అప్పటి వరకూ అరుపులు, కేకలతో, ఆయుధాలు రాసుకున్నప్పుడు వచ్చే ఖణేలుమనే శబ్దాలతో కోలాహలంగా ఉన్న ప్రదేశంలో ఇప్పుడు పూర్తిగా స్తబ్ధత నెలకొంది.

యశోధరుడు, అమృత ఏ మాత్రం దృష్టి మరల్చలేదు, ఆయుధాలపై పట్టు సడలించలేదు. తరువాత తమ చేతిలో చచ్చేందుకు ఎవరు ఉత్సహపడుతున్నారు అన్నట్టుగా సునిశిత దృష్టితో రాక్షసుల కదలికలు గమనిస్తూ ఉన్నారు. ఈ నిశ్శబ్దం ఎక్కువసేపు ఉండదని వారికి తెలుసు. 'నలువైపుల నుండీ కమ్ముకొస్తున్నది తమవారే, ఇద్దరు ఎంతమందిని నిలవరించగలరు?' అన్న ఆలోచన కలిగిన మరుక్షణం రాక్షసుల్లో తిరిగి ధైర్యం, అంతకు మించిన ఉన్మాదం పుట్టుకొస్తాయి. అప్పుడు వారిని ఆపేందుకు తమ బలం సరిపోదు. అయినా ఓటమిని అంగీకరించేందుకు వారు సిద్ధంగా లేరు. చివరివరకూ పోరాటం సాగించటమే వారి లక్ష్యం. అప్పటికి మల్లన్నకు కూడా భయం పోయింది. చావు గురించిన చింతపోయి తరువాత ఏం జరగనున్నదో అని ఆసక్తిగా చూస్తున్నాడు.

ఒక్కసారిగా అక్కడి నిశ్శబ్ద వాతావరణాన్ని ఛేదిస్తూ సముద్రంలో పెద్ద శబ్దం వినపడింది. అందరూ ఉలిక్కిపడి అటువైపు చూశారు. అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సముద్రంలో కల్లోలం మొదలయ్యింది. అందరూ భయంతో తీరం నుండి దూరంగా పరుగులు తీశారు. తలలు పైకెత్తి చూస్తే ఆకాశంలో రాబందులను పూన్చిన రథంలో కపాలధ్వజుడు కనిపించాడు. ఆ రాబందుల

రెక్కల విసురుకి సముద్రంలో నీరు ఎగసిపడుతోంది. రాక్షస సైన్యానికి ఉత్సాహం ఉరకలెత్తింది. "సాహో, దేవరా సాహో సాహో! సాహో, దేవరా సాహో సాహో!" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ తమ నాయకుడికి ఆహ్వానం పలికారు.

* * *

కపాలధ్వజుడిని అంతకుముందెన్నడూ చూసి ఎరుగని యశోధరుడు ఆ ఎగిరి వస్తున్న రథం వైపే చూస్తూ నిలబడ్డాడు. మల్లన్న నోరు తెరిచి ఆశ్చర్యంగా అలా పైకే చూస్తూ ఉండిపోయాడు. "అతడే కపాలధ్వజుడు," అని యశోధరుడికి చెప్పింది అమృత. కపాలధ్వజుడి ధ్యానం ముగియగానే సాగరగర్భంలోని అతని చెర నుండి అమృత తప్పించుకున్న విషయం, భల్లూకదీవిలో పరులు ప్రవేశించిన విషయం తెలిసి ఉండొచ్చని ముగ్గురూ గ్రహించారు.

కపాలధ్వజుడి రథం వీరిని సమీపిస్తూ ఉండగా, మంత్రించిన ఒక దండం వీరి వైపు విసిరాడు. అది గాలిలో తేలుతూ వచ్చి ఒక వలగా మారి ఆ ముగ్గురిపై పడింది. ముగ్గురూ వలలో బందీ అయ్యారు. వల బిగుసుకుంది. కపాలధ్వజుడి సైన్యం ఆనందంతో కేకలు వేసింది. కపాలధ్వజుడి రథం పూర్తిగా నేలకు దిగకముందే అతడు రథంలో నుండి కిందకు దుమికి, వడివడిగా నడుచుకుంటూ నేరుగా అమృతను సమీపించాడు. "ఏం రాకుమారి! సుకుమారవతివి, లావణ్యవతివి, ఎండకన్నెరుగని నువ్వు కూడా ఆయుధాన్ని ధరించి, నా సైన్యాన్ని ఎదిరిస్తున్నావా? భళా! ఇది అంతా ఈ కుర్రకుంక ఇచ్చిన ధైర్యమా? కపాలధ్వజుడి చెర తప్పించుకున్నాక బుద్ధిశాలి ఎవరైనా, భగవంతుడా మా ప్రాణాలు దక్కించావు చాలుచాలని పారిపోవాలి కానీ, వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టు తిరిగి తిరిగి నా కోటకే రావటం, నా చేతికి మళ్ళీ చిక్కటం ఎంతటి బుద్ధిమాలిన చర్య," అని అమృతను హేళన చేశాడు.

కపాలధ్వజుడి మాటలు యశోధరుడిలో ఆవేశాన్ని రగిలించాయి. "ఓరీ మాయావి, ఆయుధాన్ని చేపట్టి నాతో తలపడు. ఈ కుర్రకుంక దెబ్బ ఎటువంటిదో నీకు పూర్తిగా అవగతమవుతుంది," అని సవాలు చేశాడు. కపాలధ్వజుడు బిగ్గరగా నవ్వాడు. "నీతో నాకు యుద్ధమా? ఈ కపాలుడంటే ఎవరో తెలుసా? ఈ విశాల విశ్వానికి కాబోయే అధిపతి. అలాంటి నేను అడవిలో జంతువులను

వేటాడే నీవంటి చవకబారు వ్యక్తులతో తలపడటమా? స్థాయి ఎరిగి మాట్లాడు," అని కన్నెర్ర చేశాడు.

"తంత్రవిద్యలతో, కపట మాయలతో మహానగర రాజదంపతులను, అమృతను అపహరించటమేనా నీ వీరత్వం? ఆ తంత్రవిద్యలను పక్కనబెట్టి ఆయుధాన్ని చేబూని రా. ఏవరు ఏ స్థాయి వీరులో తేలిపోతుంది," అన్నాడు యశోధరుడు. "పిచ్చివాడా, పక్కన పెట్టేందుకా ఎన్నో ఏళ్ళు ఘోర తపస్సు, కఠిన సాధనలు చేసి మహాసిద్ధులను పొందింది? తంత్రవిద్యలంటే ఏమనుకున్నావు? నీ గురువు చెప్పిన గుప్పెడు మర్మాలను ముక్కునపట్టి కత్తిని అటూ, ఇటూ తిప్పటమనుకున్నావా?" అని హూంకరించాడు కపాలధ్వజుడు.

"ఈ వజ్రాయుధం నీ శిరస్సుని ఖండించటానికి ఉత్సాహపడుతోంది. నీలాగా అహంకరించిన ఎందరో మట్టిలోకలిశారు. నేడు నీ చరిత్ర కూడా ఆ మట్టిలోనే కలుస్తుంది," అని హెచ్చరించాడు యశోధరుడు. వజ్రాయుధమనే మాట విన్నాక యశోధరుడి చేతిలోని ఆయుధాన్ని పరిశీలనగా చూశాడు కపాలధ్వజుడు. మనోనేత్రంతో దాని కథను గ్రహించాడు. "ఈ తుప్పుపట్టిన కత్తా నీతో ఇన్ని ప్రగల్భాలు పలికిస్తోంది? అసలైన వజ్రాయుధం ధరించిన ఇంద్రుడే నా ఎదుట నిలువలేడు. ఒక మాయా వజ్రాయుధాన్ని సంపాదించి దాంతో నన్నెదిరించి, జయించగలనని పగటి కలలు కంటున్నావా?" అని బిగ్గరగా నవ్వుతూ "చాలు చాలు నీ వీరత్వం, శిలగా మారి పడుండు," అని చెప్పి కపాలధ్వజుడు మంత్రం జపించాడు. మరుక్షణంలో యశోధరుడు శిలాప్రతిమగా మారిపోయాడు.

ఊహించని ఈ పరిణామానికి అమృత, మల్లన్న బిగుసుకుపోయారు. అమృత చేతిలోని ఆయుధం జారిపోయింది. శిలారూపంలో ఉన్న యశోధరుడిని చూడగానే ఆమెకు దుఃఖం ప్రవాహంలా పొంగుకుంటూ వచ్చింది. "యశోధరా, యశోధరా!" అంటూ బిగ్గరగా పిలుస్తూ ఏడ్వనారంభించింది. ఆమె బాధ కపాలధ్వజుడికి మరింత ఆనందం కలిగించింది. "రాకుమారీ, విలువైన నీ అశ్రువులు, వృధాకానివ్వకు. నీ తల్లిదండ్రులు పడబోయే కష్టాలు చూసి కార్చేందుకు కాసిన్ని మిగలనీ," అని అవహేళనగా నవ్వి "వీరందరినీ మోసుకుని రండి," అని తన రాక్షస సైన్యానికి ఆదేశించి అక్కడ నుండి కపాలదుర్గం వైపు కదిలాడు.



కపాలదుర్గం ఎత్తైన ద్వారాలతో, బలమైన కుడ్యాలతో నిర్మించి ఉంది. లోపలంతా చిమ్మచీకటి. వెలుగు కోసం మండుతున్న దివిటీలు గోడలకు వేలాడుతున్నాయి. కపాలధ్వజుడి పూజాప్రాంగణం పెద్ద రాజసభను పోలి ఉంది. ఆ పూజామందిరంలో మహామాత కపాలిని భారీ రాతి విగ్రహం కొలువై ఉంది. పెద్ద పెద్ద ఎర్రని కళ్ళు, బయటకు చొచ్చుకు వచ్చిన నాలుక, వాడియైన కోరలతో ఆ విగ్రహం మిక్కిలి భీతి గొలుపుతూ ఉంది. ఆ విగ్రహం మెడలో కపాలధ్వజుడు బలి ఇచ్చిన ఉత్తమ జాతి కన్యల పుర్రెలు దండగా వేలాడుతున్నాయి.

ఆ మందిరానికి ఒక పక్కన బలిపీఠాలున్నాయి. మరో పక్కన చెరసాలలు ఉన్నాయి. ఆ చెరసాలల గోడలపై అనేక భాషలలో రాసి ఉన్నాయి. వాటన్నింటి

భావం ఒక్కటే. "ఈ దుర్మార్గుడు మమ్మల్ని బంధించి, బలిచ్చేందుకు పూనుకున్నాడు. మమ్మల్ని కాపాడే వారే లేరా? ఇది ఎటువంటి పూజ? ఇటువంటి లోకనాశనకారికి వరాలు ఇచ్చింది ఎటువంటి దైవం?" అని బలయ్యే ముందు ఆ కన్యలు దుఃఖాతిశయంతో రాసిన రాతలవి. వాటిని చూస్తేనే హృదయం ద్రవిస్తుంది. అటువంటి ఒక చెరసాలలో మహానగర రాజదంపతులు ఫణిభూషణుడు, మృదుభాషిణి బంధించబడి ఉన్నారు.

వారిని చెరసాలలో ఉంచిననాటి నుండి ప్రతిదినమూ మూలికలు కలిపిన అన్నం, ఎర్రని మంత్రజలం మాత్రమే ఆహారంగా ఇస్తున్నారు. ఏ మాత్రమూ నోటికి సహించని ఆ ఆహారం తినలేక, తినకుండా ఉంటే ఆకలికి తాళలేక వారిద్దరూ చిక్కి శల్యమైపోయారు. ఆత్మలింగాన్ని ఒక ప్రత్యేక మందిరంలో భద్రపరిచాడు కపాలధ్వజుడు. దాని శక్తిని నిర్వీర్యం చేసేందుకు క్షుద్రశక్తులను ప్రయోగించాడు.

వలలో పడిన ముగ్గురినీ రాక్షసులు మోసుకుని వచ్చి చెరసాలలో పడేశారు. అమృతను చూసిన రాజదంపతులకు దుఃఖం కట్టలు తెంచుకుంది. కానీ కరువు తీరేలా ఏడ్చేందుకు వాళ్ళకు కన్నీరు రావటంలేదు, శక్తి సరిపోవటం లేదు. తల్లిదండ్రుల పరిస్థితిని చూసిన అమృతకు కూడా హృదయం వికలమయ్యింది. పరుగున వెళ్ళి వారిని హత్తుకుని ఏడ్చింది. కపాలధ్వజుడు ఆ చెరసాల వద్దకు వచ్చి "వియోగం నుండి శాశ్వత వియోగం సిద్ధించేలోపు దొరికిన ఈ చిన్న విరామాన్ని జాగ్రత్తగా వినియోగించుకోండి. తరువాత మిగిలింది పరలోక యోగమే," అని బిగ్గరగా నవ్వి అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

* * *

దుఃఖంనుండి తేరుకున్న అమృత, శిలగా పడి ఉన్న యశోధరుడిని తన తల్లిదండ్రులకు చూపింది. గురుదేవుని ఆదేశంతో అతను తమ కోసమే రావటం, తామంతా ఆపదలో చిక్కుకున్నామని తెలిసి రక్షించేందుకు అతడు చూపిన ధైర్య సాహసాలు, చొరవ వివరించి చెప్పింది. ఆ వృత్తాంతమంతా విన్న వారికి అతడి పైన అభిమానం కలిగింది. కానీ తమను రక్షించేందుకు వచ్చిన అతడికి ఇటువంటి గతిపట్టడం వారి మనసుని కలచివేసింది. ఆ రాత్రి వారి పాలిట

కాళరాత్రే అయ్యింది. కంటికి కునుకు లేదు. ఆ సుదీర్ఘమైన బాధ కంటే మరణం మేలని వారికి అనిపించింది. కపాలధ్వజుడు తమను బలిచ్చే క్షణం త్వరగా రావాలని కోరుకున్నారు.

జరగబోయే దారుణ పరిణామాలకు సంకేతమన్నట్టు ఆ దినం సూర్యోదయంలో చైతన్యం లేదు. వాతావరణం మబ్బుపట్టి లోకమంతా నిరాశను నింపుతున్నట్టుంది. పక్షులు గూడు వదిలి బయటకు రాలేదు. అడవిలోని జంతువులు గుబురు పొదలలో దాగి గుబులు గుబులుగా ఉన్నాయి. విశ్వమంతా ఘనీభవించిన దుఃఖంలా ఉంది.

శరీరమంతా విభూది పూసుకుని, మంత్రదండాన్ని ధరించి పూజా మందిరానికి వచ్చాడు కపాలధ్వజుడు. పూజకు సమయమయ్యింది, బలిని సిద్ధం చెయ్యండని తన సైన్యానికి ఆదేశించాడు. ఒక రాక్షసుల గుంపు చెరసాల నుండి రాజదంపతులను బయటకు తీసుకుని వచ్చారు. అమృత అడ్డుపడేందుకు శతవిధాల ప్రయత్నించింది. రాక్షసులు ఆమెను బలంగా నెట్టివేశారు. రాజదంపతులలో మాత్రం ఎటువంటి ప్రతిఘటన లేదు. వారిని నడిపించు కుంటూ బలి ప్రదేశానికి తీసుకుని వచ్చారు.

కొందరు రాక్షస స్త్రీలు వచ్చి రాజదంపతులు ధరించిన ఆభరణాలన్నీ తీసివేశారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వెయ్యిన్నొక్క కలశాలలోని పవిత్ర జలాలను రాజదంపతుల శిరస్సు పైనుండి పోశారు. ఒక్కో కలశంలోని జలం పోస్తున్నప్పుడు ఒక్కో మంత్రం పఠిస్తూ, చేతులతో తాంత్రిక సంకేతాలను, శబ్దాలను చేస్తున్నాడు కపాలధ్వజుడు. ఆ మందిరం మధ్యలో ఉన్న హోమంలో మంటలు ఎగసి పడుతున్నాయి. ఆ మందిరమంతా కపాలధ్వజుని మంత్రోచ్చారణతో దద్దరిల్లుతోంది. ఇద్దరు రాక్షసులు కపాలధ్వజుడి భారీ ఖడ్గాన్ని మోసుకుని వచ్చి, కపాలధ్వజుడికి అందించారు. కపాలధ్వజుడు రెండు చేతులతో ఆ ఖడ్గాన్ని అందుకుని, కళ్ళకు అద్దుకున్నాడు. కపాలధ్వజుడి పక్కనే గాలిలో తేలుతూ అతని మాయాకపాలం అన్నింటినీ గమనిస్తూ ఉంది. రాక్షససైన్యమంతా చేరి బలి ఎప్పుడు జరుగుతుందా అని ఉత్కంఠతో ఎదురు చూస్తోంది. కపాలధ్వజుడు తన మాయాకపాలం వైపు చూశాడు. "మరికొన్ని విఘడియలలో ముహూర్తం రాబోతోంది, సిద్ధంగా ఉండు," అని మాయాకపాలం చెప్పింది. రాజదంపతులను

బలిపీఠంపై మోకరిల్లేలా తోశారు రాక్షస స్త్రీలు. వారి తలలని వంచి బలిపీఠంపైన ఉండేలా చేశారు. కపాలధ్వజుడు వారిని సమీపించి ఖడ్గాన్ని పైకెత్తి బలికి సిద్ధంగా ఉన్నాడు. రాజదంపతులు చావు తప్పదని గ్రహించి కడసారిగా పరమేశ్వరుడిని ప్రార్థిస్తున్నారు.

దూరం నుండి జరుగుతున్నది గమనిస్తున్న అమృత బాధతో విలవిలలాడుతోంది. శిలారూపంగా పడి ఉన్న యశోధరుడిని చూసి “సోదరా, నువ్వు మాత్రమే ఈ దుర్మార్గాన్ని ఆపగలవు. లే సోదరా లే,” అని మల్లన్న దుః ఖిస్తున్నాడు.

అందరూ ఎదురు చూస్తున్న అమావాస్య ఘడియలు మొదలయ్యాయి. ఉత్సాహంగా రాక్షసులంతా కేకలు పెట్టారు. “మనస్సులో చండాలికను నిలుపుకుని అమ్మకు బలిని అర్పించు,” అని గట్టిగా అరిచింది మాయాకపాలం. కపాలధ్వజుడు ఖడ్గాన్ని బలంగా పైకెత్తాడు. సరిగ్గా అప్పుడే భయంకరమైన శబ్దంతో భూమి కంపించింది. సమస్త లోకాలు ఒక్కసారిగా దద్దరిల్లాయి. అగ్నిపర్వతాలు బద్దలయ్యి నిప్పులు ఎగసిపడ్డాయి. సముద్రాలు అల్లకల్లోల మయ్యాయి. మహా వృక్షాలు నేలకూలాయి, భవనాలు, నగరాలు నేలమట్టం అవుతున్నాయి. సమస్త లోకాలలోని ప్రజలు భయంతో హాహాకారాలు చేస్తూ పరుగులు పెడుతున్నారు. జరగబోయే పరిణామాలు ముందుగానే గ్రహించిన ఇంద్రాది దేవతలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. సమస్త దేవతలు తమ శక్తులు కోల్పోయి కళావిహీనమయ్యారు. భూత, ప్రేత, పిశాచాది శక్తులు అంతరించాయి.

అన్ని శక్తులనూ తనలోనే ధరించి మహాశక్తిగా చండాలిక అవతరించింది. నల్లని రంగు, మహాకాయం కలిగిన మాత ఆవేశంతో ఊగిపోతోంది. జడలు విప్పి నాట్యం చేస్తోంది. ఆ నాట్య విన్యాసానికి ఏర్పడే ప్రకంపనలకు లోకాలు అల్లాడుతున్నాయి. ఆమె పాదం నేలను తాకలేదు. భూమికి ఎన్నో అడుగుల ఎత్తున ఆమె లాస్యం కొనసాగుతోంది. ఆమె ఆవేశంతో భూమిపై పాదం మోపితే భూమి పిండి పిండి అయిపోయేలా ఉంది.

కపాలదుర్గంలో కపాలధ్వజుడు ఎగిరి దూరంగా పడ్డాడు. వాడి సైన్యమంతా చెల్లా చెదురయ్యింది. “కపాలా, సమస్త మాయలను ఆ మాత హరించి వేస్తోంది.

ఇదే నా చివరి ఉపదేశం. నేను కూడా అంతమవబోతున్నాను. నువ్వు మానవ ప్రయత్నంతోనే ఈ బలిని పూర్తి చెయ్యాలి. మాత అవతారం ఇంకా ఎంతోసేపు ఉండదు," అని చెబుతున్న మాయాకపాలం పెద్ద శబ్దంతో పేలిపోయింది. కపాలధ్వజుడి రాక్షససేనంతా మాయమయి పోయింది. కపాలధ్వజుడు మాయతో సృష్టించిన కపాలదుర్గం అదృశ్యమయ్యింది. మహానగరంలో రక్షణగా నిలిచిన కపాలధ్వజుడి రాక్షససైన్యం, జలకందకంలో సర్పరూపంలో ఉన్న పాతాళరాక్షసుడు అందరూ మాయమయ్యారు. శ్రీభాషిణికి జరుగుతున్నది అర్థం కాక రాజభవనం నుండి వెలుపలకి వచ్చి సైన్యం కోసం, కపాలధ్వజుడి కోసం వెదకసాగింది.

కదిలేందుకు శక్తిలేక చావుకు సిద్ధపడిన ఫణిభూషణుడు, మృదుభాషిణి ఇంకా బలిపీఠం మీదే ఉన్నారు. ఈ అవకాశాన్ని వదులుకోకూడదని భావించిన కపాలధ్వజుడు తన శక్తిని కూడదీసుకుని ఖడ్గంతో బలిపీఠం వైపుకి వచ్చాడు. తిరిగి ఖడ్గాన్ని ఎత్తేంతలో వెనకనుండి అతడిని బలంగా ఎవరో తన్నారు. ఆ దెబ్బకు దూరంగా తూలిపడిన కపాలధ్వజుడు వెనకకు తిరిగి చూశాడు. కపాలధ్వజుడి మాయ తొలగిపోవటంతో తిరిగి తన రూపాన్ని పొందిన యశోధరుడు ఆయుధంతో స్థిరంగా నిలబడి ఉన్నాడు. అమృత, మల్లన్న పరుగున వచ్చి రాజదంపతులను పక్కకు తీసుకుని వెళ్ళారు.

తనకున్న విలువైన ఘడియలు నాశనమవుతున్నాయనే అక్కసుతో కపాలధ్వజుడు యశోధరుడి మీదకి దూకాడు. యశోధరుడు అప్పటికే సిద్ధంగా ఉండటంతో తన ఆయుధంతో అతని ఖడ్గం దెబ్బను అడ్డుకున్నాడు. ఆ రాపిడికి నిప్పులు రాలిపడ్డాయి. ఇద్దరూ తమ శక్తిని, నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ భీకరంగా తలపడసాగారు. అక్కడున్న మిగిలినవారంతా భయం నిండిన కళ్ళతో ఈ పోరును తిలకిస్తూ ఉన్నారు. కపాలధ్వజుడు యుక్తితో కొట్టిన దెబ్బకు యశోధరుడి పట్టుసడలి ఆయుధం ఎగిరి దూరంగా పడింది. కానీ కపాలధ్వజుడికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఒక్క దూకులో ఆయుధాన్ని తిరిగి అందుకున్నాడు యశోధరుడు. రెట్టించిన ఉత్సాహంతో కపాలధ్వజుడి పైకి వచ్చాడు.

కపాలధ్వజుడి బలం సడలింది. అతనిలో అలసట తొంగి చూసింది. ఖడ్గంపై పట్టు సడలింది. తన అంతిమ ఘడియలు ఆసన్నమయ్యాయని గ్రహించాడు కపాలధ్వజుడు.



"మహానగరాన్ని నాశనం చేసి, యువరాణిని అపహరించినందుకు ఇదే నీకు శిక్ష," అంటూ యశోధరుడు ఒక వేటుతో కపాలధ్వజుడి చేతిని ఖండించాడు. "రాజదంపతులను ఇక్కట్లపాలు చేసినందుకు," అంటూ అతని పాదాలు ఖండించాడు. "సమస్త లోకాలకు కీడు తలపెట్టినందుకు," అని అతని శిరస్సును ఖండించాడు. కపాలధ్వజుడి మొండెం రక్తసికతమై కిందపడింది. శిరస్సు ఎగిరి వెళ్లి మహామాత చండాలిక పాదాల వద్ద పడింది. మరుక్షణంలో మాత ఆవేశం చల్లారి, తాండవం ఆగింది.

భీతిగొలిపే రూపం పోయి ప్రసన్న వదనంతో దేవి ప్రత్యక్షమయ్యింది. సమస్త లోకాలు శాంతించాయి. దేవతల శక్తులు తిరిగి ప్రతిష్ఠించబడ్డాయి. అందరూ దేవిని స్తుతించారు.

"భూమిపైన పాపాలు, దుష్టశక్తులు మితిమీరిన రోజున దైవశక్తి ఉదయిస్తుంది. దుష్టులను హరిస్తుంది. కుమారా, యశోధరా! దుష్టుడైన కపాలధ్వజుడిని సంహరించిన కారణంగా అతని సమస్త సిద్ధులు నీకు లభిస్తాయి.

నువ్వు కోరితే లోకాధిపత్యం లభిస్తుంది. చెప్పు నాయనా నీకేం కావాలి?" అని అడిగింది దేవి. "ఎందరినో బలిచేసి అతడు సాధించిన తాంత్రికవిద్యలు నాకు వద్దు. మా ప్రభువులను రక్షించుకునేందుకే నేను కపాలధ్వజుడిని సంహరించాను తప్ప ఆధిపత్యాన్ని కోరి కాదు. కాబట్టి మహానగర పూర్వవైభవాన్ని తిరిగి ప్రసాదించు తల్లీ. అదే నేను కోరుకునేది," అని భక్తిశ్రద్ధలతో విన్నవించాడు యశోధరుడు.

దేవి గాలిలో చేయి చాచగానే ఆమె చేతిలోకి కపాలధ్వజుడు నిర్వీర్యం చేయ తలపెట్టిన ఆత్మలింగం వచ్చింది. దేవి ఆ ఆత్మలింగాన్ని తిరిగి శక్తిమంతం చేసింది. చేతితో సైగ చేయగానే ఆ ఆత్మలింగం అలా గాలిలో తేలుతూ అమృత చేతిలోకి వచ్చింది. ఆమె చేతిలోకి ఆత్మలింగం రాగానే రాజదంపతులు సంపూర్ణ ఆరోగ్యవంతులు అయ్యారు. రాక్షసమూకల దాడులతో శిధిలమైన మహానగరం పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. భవనాలు, వీధులు, ఆలయాలు కాంతివంతం అయ్యాయి. అందరూ అనందంతో దేవి ముందు మోకరిల్లారు. "కుమారా, స్వార్థ చింతన లేని నీకు ఎల్లప్పుడూ శుభమే కలుగుతుంది," అని ఆశీర్వదించి దేవి అంతర్ధానమయ్యింది.

దేవీ అనుగ్రహంతో అందరూ మహానగరం చేరుకున్నారు. మహానగర ప్రజలు మిక్కిలి ఆనందోత్సాహాలతో తమ ప్రభువుకు ఆహ్వానం పలికారు. పిచ్చిపట్టినదాని లాగా తిరుగుతున్న శ్రీభాషిణిని కొందరు ప్రజలు బంధించి తెచ్చి ఫణిభూషణుడి కాళ్ళ వద్ద పడేశారు. "భర్తను దూరం చేసి దేవుడే నిన్ను శిక్షించాడు. ఇంక మేం శిక్షించవలసింది ఏముంది?" అని రాజదంపతులు ఆమెని క్షమించి విడిచిపెట్టారు. ఆమె ఆ నగరాన్ని విడిచి వెళ్ళింది.

ఫణిభూషణుడు తన ప్రజలతో, పరివారంతో యశోధరుడు తమకు చేసిన మేలుని వివరించి చెప్పాడు. ఈ సాహసయాత్రలో తనకు సహాయం చేసిన మునులకు, నాగకన్యకు మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు యశోధరుడు.

బిల్వకమునీంద్రుల ఆశ్రమానికి పరివార సమేతంగా ప్రయాణమయ్యాడు ఫణిభూషణుడు. తాను ఇచ్చిన మాట ప్రకారం యశోధరుడు మార్గమధ్యంలో రాక్షసుల రూపంలో చరిస్తున్న యక్షులు మయూరుడు, మంజీరునికి శాపవిమోచన కలిగించాడు. అందరూ మంత్రాలమర్రిని దర్శించి కృతజ్ఞతలు చెప్పారు.

అందరూ బిల్వకమునీంద్రుల ఆశ్రమం చేరుకున్నారు. మునీంద్రుల ఆదేశాను సారం మహాలింగానికి అభిషేకం జరిపించారు. అమృత మనస్సులోని మాటను గ్రహించిన ఫణిభూషణుడు బిల్వకమునీంద్రులతో చర్చించి యశోధరుడితో ఆమె వివాహాన్ని నిశ్చయించారు.

యశోధరుడిని పెంచిన తల్లిదండ్రులను, బిల్వకమునీంద్రులను సకల లాంఛనాలతో మహానగరానికి ఆహ్వానించి తీసుకుని వచ్చారు రాజదంపతులు. మునీంద్రుల ఆశీస్సులతో మహానగరంలో అమృత, యశోధరుల వివాహం అంగరంగ వైభవంగా జరిగింది.

అమృతను, యశోధరుడిని సింహాసనంపై కూర్చోబెట్టి పట్టాభిషేక మహోత్సవం జరిపించాడు ఫణిభూషణుడు. రాజ్యభారాన్ని వారికి అప్పగించి విశ్రాంతి కోసం వనాలకు వెళ్ళారు రాజదంపతులు. అమృత, యశోధరులే కాక వారి వారసులు కూడా మహానగర వైభవం ఎన్నో తరాలు నిలిచేట్టుగా పరిపాలించారు. వారి పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో తులతూగారు.



# మహానగరం

నాగమురళీధర్ నామాల

బొమ్మలు : పి. చైతన్య

ఫణిభూషణుడు తనని పెళ్ళి చేసుకోనన్నాడని అతడి మీద పగబట్టింది శ్రీభాషిణి. తాంత్రిక శక్తులు సాధిస్తూ ప్రపంచ ఆధిపత్యాన్ని పొందాలని తహతహలాడుతున్న కపాలధ్వజుడితో శ్రీభాషిణి చేతులు కలిపింది. వీళ్ళిద్దరూ వంచనతో, మాయలతో ఆత్మలింగాన్ని స్వాధీనం చేసుకుని రాకుమార్తె అమృతను బందీగా చేశారు; రాజదంపతులను కూడా బందీలుగా చేసి మహానగరాన్ని చేజిక్కించుకున్నారు. రాజదంపతులను బలి ఇచ్చే ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నారు.

గురువు బిల్వక మునీంద్రుడి కోరిక మేరకు రాజదంపతులను ఆశ్రమానికి ఆహ్వానించటానికి మహానగరానికి బయలుదేరిన యశోధరుడికి ఈ సంగతులు ఏమీ తెలియవు. ఈ ప్రయాణంలో అతడికి ఎటువంటి కష్టాలు ఎదురయ్యాయి? ఎవరెవరి నుండి సహకారం లభించింది? చివరికి అతడు అనుకున్నది సాధించగలిగాడా?

రెక్కల భల్లూకాలు, తాటి చెట్టంత రాక్షసులు, మకరముఖ సైనికులు, సముద్రంలో అద్భుత భవనాలు, మాయలు మంత్రశక్తులు వంటివాటితో ఉత్కంఠభరితంగా సాగిపోయే జానపద నవల మహానగరం.

రచయిత బ్లాగు చిరునామా : https://muralidharnamala.wordpress.com/
ఫేస్ బుక్ పేజీ : https://www.facebook.com/nnmuralidhar
గూగుల్ ప్లస్ : https://plus.google.com/113069614515937193289

మంచి పుస్తకం

ISBN 978-93-83936-49-6